


# బోల్షెవిక్


సంచిక: 6 | సి.పి.ఐ.(మావోయిస్టు) ఎ.ఒ.బి. సమాచార పత్రిక | జులై–డిసెంబర్ 2015


## లోపలి పేజీల్లో...


1. బ్రాక్సైట్ తవ్వకాలకు వ్యతిరేకంగా పోరాడదాం... .......... 03

2. రెండున్నర దశాబ్దాల ప్రపంచీకరణ... .......... 07

3. ఒక చిన్న నిప్పురవ్వ... .......... 14

4. కరపత్రాలు/పత్రిక ప్రకటనలు .......... 19

5. అమరుల చరిత్ర .......... 30

6. పోరాట స్రవంతి .......... 34


"కమ్యూనిస్టులమైన మనం మనం చేసే ఏ పనిలోనైనా రెండు పద్ధతులను తప్పనిసరిగా అవలంబించాలి. ఒకటి : సాధారణాన్ని నిర్దిష్టత్వంతో జోడించడం. మరొకటి : ప్రజా బహుళ్యంతో నాయకత్వాన్ని జోడించడం"

- కామ్రేడ్ మావో



# మీ త్యాగాల వెలుగులో ప్రజాయుద్ధ మార్గం ప్రకాశవంతమైంది.

# లక్ష్యం చేరేదాక మీరు చూపిన మార్గాన్ని వదలం.

భారత దేశంలో ప్రస్తుతం నెలకొని వున్న అర్ధ భూస్వామ్య, అర్ధవలస సమాజాన్ని కూకటివేళ్ళతో పెళ్ళగించి నూతన ప్రజాస్వామిక వ్యవస్థనూ, ఈ క్రమంలో సోషలిజాన్ని, అంతిమంగా కమ్యూనిజాన్ని స్థాపించే లక్ష్యంతో సి.పి.ఐ మావోయిస్టు పార్టీ నేతృత్వంలో ప్రజలు వీరోచితంగా ఉద్యమిస్తున్నారు. ఈ ఉద్యమాన్ని అణచి వేసి తమ అధికారాన్ని సుస్థిరం చేసుకొనేందుకూ, దోపిడీ పీడనలను కొనసాగించేందుకు ఈ దేశ దోపిడీ పాలక వర్గాలైన దళారీ నిరంకుశ బూర్జువా, భూస్వామ్య వర్గాలు, వారి యజమానులైన సామ్రాజ్యవాదులు తమ రాజ్యాంగ యంత్రం ద్వారా పార్టీపైన, పి.ఎల్.జి.ఎ.పైన, ప్రజలపైన తీవ్రమైన సాయుధ అణిచివేతను కొనసాగిస్తున్నారు. ఈ అణచివేత 2009 సెప్టెంబర్ నుండి గ్రీన్‌హంట్ బహుముఖ, సైనిక దాడి రూపంలో మరింత తీవ్రతరం అయింది. ఈ దాడి అత్యంత పాశవికంగా, క్రూరంగా, మోసపూరితంగా కొనసాగుతున్నది. విరుద్ధ ప్రయోజనాలకోసం జరుగుతున్న ఈ యుద్ధంలో ప్రజల రాజ్యాధికారాన్ని నెలకొల్పే లక్ష్యంతో దోపిడి వర్గాల రాజ్యంతో వీరోచితంగా పోరాడుతూ అనేక మంది ప్రజల ఉత్తమ పుత్రులు, పుత్రికలు తమ అమూల్యమైన ప్రాణాలను తృణప్రాయంగా అర్పిస్తున్నారు. చరిత్ర పురోగమనానికి తమ వంతు కర్తవ్యంగా వీరోచితమైన త్యాగాలను చేస్తూ గొప్ప విప్లవ సాంప్రదాయాలను నెలకొల్పుతున్నారు. 2015 జులై నుండి డిసెంబర్ వరకు దేశవ్యాప్తంగా పదుల సంఖ్యలోనే పార్టీ, పి.ఎల్.జి.ఎ, ప్రజాసంఘాల సభ్యులు, నాయకత్వంతో పాటు సాధారణ ప్రజలు నేలకొరిగారు. ఎ.ఒ.బిలో కా॥ జానకి (ఎ.సి.ఎమ్), కా॥ ధిరే (మిలీషియా సభ్యురాలు), కా॥ కోస (మిలీషియా సభ్యుడు), కా॥ శంకర్ (ఆర్.పి.సి ఉపాధ్యాక్షుడు)లు నేలకొరిగారు. మన ఈ కామ్రేడ్స్ అమరత్వం పార్టీకి, ఉద్యమానికి ఎనలేని నష్టాన్ని కల్పించింది. వారి కుటుంబాలకు, శ్రేయోభిలాషులకు తీవ్రమైన దు:ఖాన్ని నింపింది. ఈ పరిస్థితులలో అమరుల కుటుంబాల, శ్రేయోభిలాషుల దు:ఖంలో పాల్పంచుకుంటూ, వారికి ఎస్.జడ్.సి ప్రగాఢ సంతాపాన్ని తెలియ జేస్తున్నది. అలాగే అమరుల ఆశయాలను సఫలీకృతం చేస్తామని ప్రతిజ్ఞ చేస్తూ, వారికి తలవంచి వినమ్రంగా శ్రద్ధాంజలి ఘటిస్తున్నది.

మన అమరుల త్యాగాలు మన వెంటనే వున్నాయి. వారి త్యాగాలతో మన మార్గం ప్రకాశవంతమైంది. మన పురోగమనంలో వారిస్తున్న ఉత్తేజం మనకు నూతన శక్తినీ, చైతన్యాన్ని అందిస్తున్నది. అందుకే వారు సదా చిరస్మరణీయులు.

*గమనిక :* డిసెంబర్ 10వ తేదీన శ్రీకాకుళం-కోరాపుట్ డివిజన్ ముట్టిశిడిగెలో జరిగిన ఎన్‌కౌంటర్ దాడిలో బోల్షివిక్-6లో ముద్రించవలసిన రిపోర్టులు, వ్యాసాలు, అమరుల జీవిత చరిత్రలు పోయాయి. తిరిగి వాటిని పున:రచించి పత్రికను తీసుకురావడంలో ఆలస్యం అయినందుకు అర్థం చేసుకోగలరు. ఈ సంచికలో కామ్రేడ్ చలసాని ప్రసాద్, కా॥ పాలరామ్మూర్తిలకు నివాళి ముద్రించవలసి ఉండే. వారికి సంబంధించిన వివరాలు కలిగిన సాహిత్యం కూడా పోవడంతో తిరిగి ఆ సమాచారాన్ని తెప్పించుకోవడంలో ఉన్న అననుకూల పరిస్థితుల మూలంగా వారికి నివాళిని ముద్రించలేకపోయాము.

- *సం॥*

వ్యాసం

# బాక్సైట్ తవ్వకాలకు వ్యతిరేకంగా పోరాడుతున్న ఆదివాసీలకు అండగా నిలబడదాం !

## జల్ జంగల్, జమీన్, ఆత్మగౌరవం, అధికారంకై పోరాడదాం !!

విశాఖ మన్యంలో 1990వ సంవత్సరం నుండి దళారీ పాలకవర్గాలు (దళారీ నిరంకుశ బూర్జువా, భూస్వాములు) బాక్సైట్ గనులు తవ్వాలని ప్రయత్నిస్తున్నప్పటికీ, ఆదివాసీ ప్రజల ప్రతిఘటనతో అది వాయిదా పడుతూ వస్తున్నది. ప్రస్తుతం అరకు, జెర్రెల గ్రూపులలో ఉన్న సుమారు 503 మిలియన్ టన్నుల బాక్సైట్‌ను చంద్రబాబు ప్రభుత్వం ఐ.టి.డి.ఎ గిరిజన సొసైటీల ద్వారా తవ్వించి అన్‌రాక్, రస్‌అల్‌ఖైమా గ్రూపుకు అందించాలని చూస్తున్నది. అలాగే ఎ.పి.ఎమ్.డి.సి (ఆంధ్రప్రదేశ్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్) ద్వారా కూడా తవ్వకాలు జరిపించడానికీ ప్రయత్నిస్తున్నది. 2014 ఆగస్టు 9న ప్రపంచ ఆదివాసీ దినం రోజు చంద్రబాబు ఆదివాసీలను ఉద్దేశించి "మీరు కొండలు దిగి రండి, మిమ్మల్ని లక్షాధికాలను చేస్తాను'' అని మాట్లాడాడు. మరొక మంత్రి అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ కొండల్ని చూసుకొని వుంటే మీకు ఒరిగేదేమిలేదనీ, ఆ కొండల్ని తొలచి బాక్సైట్ వెలికితీయడం వలన మీ జీవితాలు మెరుగుపడతాయని అన్నాడు. ఇటీవల దీనికి కేంద్రప్రభుత్వం అన్ని రకాల అనుమతులు మంజూరు చేసింది. తదనుగుణంగా రాష్ట్రప్రభుత్వం జీ.వో నెం.97ను జారీ చేసి, బాక్సైట్ తవ్వకాలకు దారి సుగుమం చేసింది. ఈ జీ.ఒలో మైనింగ్ పనులు చేపట్టడానికి ఎ.పి.ఎమ్.డి.సికి భూమిని బదలాయింపు చేసే ప్రక్రియ ఉంది. దానితో ఆదివాసీ ప్రాంతంలో ఆదివాసేతనులకు భూ బదలాయింపు చేసే అధికారం ప్రభుత్వానికి లేదని చెప్పినా సమతా జడ్జిమెంట్ మరల తెరపైకి వచ్చింది. ఆదివాసీలు జీవించే హక్కును హరించే బాక్సైట్ తవ్వకాల వలన 4,500 కుటుంబాలు నిర్వసితులవుతారు. అలాగే అరకు ప్రాంతంలోని చిట్టెంగొంది, రక్తకండి కొండల్లో తవ్వకాలు చేపడితే ఆంధ్ర ప్రజలతో పాటు ఒడిశా ప్రజల జీవితాలు అల్లకల్లోలం కావడం ఖాయం. అరకు ప్రాంతానికి ఆనుకొని వున్న పొట్టంగి బ్లాక్‌లోని 5 పంచాయితీల (నందక, సొంబాయ్, పేటూరు, హంపవల్లి, గొల్లూరు) పరిధిలో వేలాది కుటుంబాలు వీధిన పడతాయి. జర్రెల బ్లాక్‌లో తవ్వకాల వలన మల్కనగిరి జిల్లా కుడుముల గుమ్మ బ్లాక్ పరిధిలోని రోళ్ళగెడ్డ, బోడ్‌పొదర్ పంచాయితీలకు చెందిన 70 గ్రామాల ప్రజలు విస్తాపితులు కానున్నారు. జర్రెల, అరకు బ్లాకులలో బాక్సైట్ తవ్వకాల మూలంగా 1,607 హెక్టార్ల అడవి విధ్వంసం కానుంది. ఎందుకంటే బాక్సైట్ గని పని విధానంలో భూమి పొరలను తలక్రిందులు చేయడం వల్ల ప్రాణకోటి నివాస యోగ్యమైన, సారవంతమైన భూమి పైపొర నాశనమైపోతుంది. సహజసిద్ధమైన సెలయేర్లు, వాగులు, వంకలు, నదులు, తమ దిశను మార్చుకుంటాయి, లేదా నాశనమైపోతాయి. సహజ సిద్ధంగా ఏర్పడ్డ కొండలు, గుట్టలు కనుమరుగైపోతాయి. బాక్సైట్ గనుల్లో తవ్వి తీసిన ఎర్రమట్టి దిబ్బలతో ఏర్పడతాయి. నీటిపారుదల లేక వ్యవసాయం కుంటుబడుతుంది. తాగడానికి గుక్కెడు మంచినీళ్ళు కరువైపోనుంది. అలాగే బాక్సైట్ గనుల కింద పెద్దఎత్తున అడవులు విధ్వంసం చేయడం వల్ల అరుదైన వృక్ష జాతులు, అడవి జంతువులు, విలువైన వనమూలికలు ఉనికికి ప్రమాదం ఏర్పడుతుంది. ఒక చోట బాక్సైట్ గని ఉంటే చుట్టూ 25 కీ.మీటర్ల పరిధిలో భూగర్భ జలాలు ఇంకిపోతాయి. ఫలితంగా మానవ నివాసయోగ్యం కాని మరుభూమిగా మారిపోతుంది. ఒక్క అడవుల నుండే ఆదివాసీలు 35 రకాల అటవీ ఉత్పత్తులు తీసుకుంటున్నారు. అవన్నీ ఇప్పుడు పోతాయి. దానితో ఆదివాసీ ప్రాంతాల్లో ప్రాధాన్యత సంతరించుకున్న సంతలు పోతాయి. ఇప్పటివరకు ప్రధానంగా 3 రకాల సంతలు ఆదివాసీ ప్రాంతాల్లో ఉన్నాయి. అవి మొదటిది వస్తుమార్పిడి సంత. ఈ సంతలో వాళ్ళు పండించినవి, అడవిలో సేకరించినవి తీసుకువచ్చి అమ్మి తమకు అవసరమైన సరుకులు కొనుగోలు చేసుకుంటారు. ఈ సంతల్లో ఒక 50 గ్రామాల వరకు పాల్గొంటాయి. ఈ సంతలో అరకోటి వరకు టర్నోవర్ ఉంటుంది. ఇక రెండవది ఒక మోస్తరు సంత. దీనిలో 100 నుండి 150 గ్రామాల ప్రజలు పాల్గొంటారు. వీటి టర్నోవర్ కోటి వరకు ఉంటుంది. ఇక మూడవది అతి పెద్దది. ఇది అరకు, పాడేరు, జి.మాడుగుల, చింతపల్లి వంటి ప్రాంతాల్లో జరుగుతాయి. వీటిలో 500 నుండి 1000 గ్రామాల ప్రజలు పాల్గొంటారు. ఈ సంతల్లో సంవత్సరానికి సుమారు 3600కోట్లు టర్నోవర్ ఉంటుంది. ఈ విధమైన ఆర్థికవ్యవస్థ అంతా చిన్నాభిన్నామవుతుంది. ఆదివాసీలు కూడా దెబ్బతింటారు. ఎందుకంటే స్థానిక సంతల్లో అమ్ముకోవడానికి ఒక రైతుల, వ్యాపారిలా వచ్చే ఆదివాసీ మైనింగ్ జరిగినప్పుడు పారిశ్రామిక కూలీలా మారిపోతాడు. స్వతంత్ర ఆదాయం పోయి 3000 రూపాయల జీతగాడిగా మారిపోతాడు. భవిష్యత్‌లో మానవ రహిత యంత్రాలు వస్తాయనీ, అదే జరిగితే ఇక ఆదివాసీ పరిస్థితి ఎట్లా ఉంటుందో ఊహించుకోవచ్చు. వాళ్ళకి స్కూలు, వైద్యాలయాలు, ఇంటింటికి సరఫరా అయ్యే విద్యుత్, నీటి సౌకర్యాలు లేవనే మాట తప్పితే ఇప్పటివరకు ఆదివాసీలు మంచి జీవితాన్ని అనుభవిస్తున్నారు. మైనింగ్ వల్ల అటువంటి జీవితం పోగొట్టి మరొక కొత్త పేదరికాన్ని సృష్టించబడుతుంది.



ఆదివాసీల జీవన విధానం, సంస్కృతి భిన్నమైనది. ప్రకృతికి దగ్గరగా సమిష్టి జీవన విధానం. కుటుంబంలోని పిల్లా, జెల్లా అడవి మీద ఆధారపడి ఏ పండో, ఆకో ఏరుకొనీ, పోడు చేసిన నేల మీద చల్లిన గింజలు మొలకెత్తితే పండుగ చేసుకునే ప్రకృతి ఆరాధకులు. వాన కురిస్తే పసిపిల్లల్లా గెంతే ఆనందం, పక్షుల కిల కిల రాగాలకు పరవసించే సంతోషం, తమదైన ఆటా, పాటలతో, పండుగలతో తమ బ్రతుకేదో తాము బ్రతికే అమాయక జీవులు. అటువంటి మన్యం మూలవాసుల బతుకుల్లో బాక్సైట్ గనుల విషం చిమ్మబోతోంది. వాళ్ళ బతుకుల్లో టన్నుల కొద్ది మట్టి కొట్టి, వారి అడవుల్లోని సంపదలను దేశ, విదేశీ బహుళజాతి సంస్థలకు కట్టబెట్టడమే నరేంద్ర మోడీ, చంద్రబాబు ప్రభుత్వాలకు పరమావధిగా మారిపోయింది. వాళ్ళ భూముల్లో, అడవుల్లో సంపదలుండటమే నేరమైంది. ఆ సంపదను కాజేయడానికి ఆదివాసీ రక్షణ చట్టాలను కూడా యధేచ్ఛగా ఉల్లంఘనలకు పాల్పడుతున్నారు. చంద్రబాబు ఏకంగా 100 పోలీసు ఔట్‌పోస్టులను ఏర్పాటు చేసైనా బాక్సైట్ తవ్వితీరుతామని ప్రకటించి వున్నాడు. ఆదివాసీల సంక్షేమం కోసం పాటుపడవసిన రాజ్యం వారి మనుగడను పూర్తిగా అంతం చేసే విధంగా వ్యవహరిస్తుంది.

ఆదివాసీలు నివసిస్తున్న ప్రాంతాలకు రక్షకులైన రాష్ట్ర గవర్నర్ గానీ, మూలవాసుల సంక్షేమ బాధ్యతలు తీసుకున్న ట్రైబల్ అడ్వైజరీ కౌన్సిల్ (టి.కె.సి)గానీ, ఆదివాసీల విధ్వంసకర అభివృద్ధి నమూనాను, తమకున్న విచక్షణాధికారంతో అడ్డుకునే ప్రయత్నం చేయడం లేదు. ఎందుచేతనంటే అభివృద్ధి పట్ల పార్లమెంటరీ వ్యవస్థలోని మెజారిటీ బూర్జువా రాజకీయ పార్టీలకు ఉన్న దృష్టే వారికి కూడా ఉంది. గనుక ఆదివాసీలను కార్పోరేట్ కంపెనీల కబంద హస్తాలనుండి కాపాడకపోగా, వారిని విస్తాపనకు గురి చేసి, అక్కడి అపార ఖనిజ నిక్షేపాల కోసం వెంపర్లాటలో బలవంతుల దురాక్రమణ నిరాటంకంగా కొనసాగేందుకు సహకరిస్తున్నారు. దానిని కప్పిపుచ్చడం కోసం కేంద్రం, రాష్ట్రం మరియు గవర్నర్ కలసికట్టుగా మన్యం వానులను నేరస్తులుగా ముద్రవేసే ప్రయత్నం ప్రారంభమైంది. నేటి ప్రపంచీకరణ యుగంలో రాజ్యాంగ వ్యవస్థలను కూడా ప్రపంచబ్యాంకు అభివృద్ధి నమూనాకు అనుగుణంగా మలచబడుతున్నాయనడంలో ఎలాంటి సందేహం లేదు.

ఆదివాసీల మనోభవాలకు విఘాతం కలిగించే రీతిలో బాక్సైట్ తవ్వకాలు చేపట్టబోమని, మెజారిటీ ప్రజల అభిప్రాయాలకు అనుగుణంగానే ప్రభుత్వం నడుచుకుంటుందనీ, ఎన్నికల్లో వాగ్దానం చేసిన చంద్రబాబు అధికారంలోకి రాగానే మాట మార్చేసాడు. ఎందుకంటే రాష్ట్ర విభజనతో ఆంధ్రప్రదేశ్‌కు తీరని అన్యాయం జరిగిందనీ, రాష్ట్ర భవిష్యత్ అగమ్యగోచరంగా తయారయిందనీ దాన్నుండి గట్టెక్కించాలంటే తప్పకుండా బాక్సైట్ తవ్వి తీరాల్సిందేననీ, మరోమార్గం లేదని ప్రకటించాడు. రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దాలంటే, ఆదివాసీలు కూడా ఎంతో కొంత కోల్పోవడానికి సిద్ధం కావాలంటాడు. అభివృద్ధి అంటే ప్రకృతి వనరులు, వృక్షసంపద, జంతుసంపద నాశనం చేయడం కాదు. అలాగే ఒక వర్గం ఆదాయ అవకాశాలను మెరుగుపర్చడం కోసం, ఇతర ప్రాంత ప్రజలను బలిపెట్టడం, కాకులను కొట్టి గెద్దలకు వేయడం లాంటిదే. అంటే ఆంధ్ర సంపన్న దళారీ వర్గాలకు, కార్పోరేట్ శక్తుల సూపర్ లాభాల కోసం ఆదివాసీలను బలిపశువులను చేయడమే. స్వర్ణాంధ్ర నిర్మాణం మూలంగా లాభపడేది సింగపూర్, జపాన్, అమెరికా వంటి సామ్రాజ్యవాద బహుళజాతి కంపెనీలు, దేశీయ బడా పెట్టుబడుదారులు మాత్రమే. స్వర్ణాంధ్ర మూలంగా ఆర్థికంగానూ, భౌతికంగానూ మన్యం ప్రాంతానికి ఏ మాత్రం ఉపయోగం లేదు. పైగా మన్యం భూములు, అడవులు ధ్వంసం కాబడతాయి. ప్రజలు నిర్వాసితులవుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జంతువుల మీద చూపిన ఔధార్యం సామాన్య ప్రజల మీద చూపడం లేదు.

ప్రపంచీకరణ 'సోషల్ డెమోక్రసీ' ముసుగు వేసుకొని అత్యంత పీడిత సెక్షన్లకు మేలు చేస్తామని చెబుతున్నప్పటికీ, వాస్తవానికి ఆదివాసీ ప్రజలనూ, వారి వనరులను కొల్లగొడుతున్నారు. ప్రభుత్వం విశాఖ ఏజెన్సీ ప్రాంతాలనూ, ఆదివాసీలనూ అత్యంత ప్రధానమైనవిగా టార్గెట్ చేస్తూ, విధ్వాంసకాండకు పూనుకుంటోంది. రానున్న కాలానికి విశాఖ ఏజెన్సీ బొందల గెడ్డగా మారిపోనుంది. పర్యవసానంగా వాతావరణ సమతౌల్యం లోపించి, తీవ్రమైన దుష్పరిణామాలు చోటు చేసుకోవడం ఖాయం. అయినా మన పాలకులకు ఇవేవి చెవికి ఎక్కడంలేదు. తమ యజమానులైన సామ్రాజ్యవాద, దళారీ నిరంకుశ బూర్జువా వర్గాల ఆర్థిక ప్రయోజనాలే పరమావదిగా పని చేస్తున్నాయి. కాబట్టే ఇటువంటి జీ.ఒలు జారీ చేస్తున్నాయి. ఖనిజవనరులు వారసత్వ సంపద. అవి ప్రకృతి ఎన్నో వేల, లక్షల సంవత్సరాల పరిణామ క్రమ ఫలితంగా ఏర్పడ్డాయి. వాటిని మన పూర్వీకులు జాగ్రత్త చేసి కాపాడుకుంటూ మనకు ఇచ్చారు. అట్లాగే మనం కూడా ఇవ్వాలి కదా ! కానీ అభివృద్ధి పేరుతో మన పాలకులు ధ్వంసం చేస్తున్నారు. ఈ పరిణామం మరిన్ని ప్రకృతి విలయాలకు దారి తీయదా ! ప్రపంచబ్యాంకు అభివృద్ధి నమూనా అంటేనే విధ్వంసం. ప్రజా జీవనాన్ని కబలించడం, ప్రజా సంక్షేమాన్ని వారి అభివృద్ధిని పూర్వపక్షం చేయడం, మన్యంలో బాక్సైట్ తవ్వకాల వలన నష్టపోయే ఆదివాసీ ప్రజానీకం ఇందుకు మినహాయింపు కాదు. ఇది ప్రకృతి ప్రళయం, సహజ ప్రకృతి విధ్వంసం కాదు. ఇది సాక్షాత్తు సామ్రాజ్యవాద, దళారీ నిరంకుశ బూర్జువాల కృత్రిమ విధ్వంసం. ఈ విధ్వంసంలో ఆదివాసీ ప్రజల జీవనం అందుకు ఆధారిత అంశాలు పాలకులకు పట్టవు.

చంద్రబాబు ప్రభుత్వం బాక్సైట్‌పై శ్వేతపత్రం విడుదల చేసిన విషయం మనకందరికి తెలిసందే. అందులో ప్రధానంగా గత వై.ఎస్.ఆర్ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వ నిర్వాకం వల్లనే బాక్సైట్ సమస్యాత్మకంగా మారిందనీ, అక్రమ మార్గంలో గనుల కంపెనీ (జిందాల్, అన్‌రాక్, రస్‌అల్‌ఖైమా) లకు బాక్సైట్ గనులు లీజుకిచ్చిందని ప్రకటించారు. అంతే కాకుండా గత కాంగ్రెస్ ప్రభుత్వం గనుల కంపెనీలకు లీజుకివ్వడానికి దోహదం చేస్తూ జారీ చేసిన జీ.వో 222ను రద్దు చేస్తున్నామని కూడా ప్రకటించారు. ఇంతకి బాక్సైట్ విషయంలో చంద్రబాబు ప్రభుత్వం విడుదల చేసిన స్వేతపత్రంలో గనుల తవ్వకం ప్రాంతం చుట్టూ మానవ జీవితం గానీ, వణ్యప్రాణులు గాని లేవని పేర్కొంది. మెజారిటీ ఆదివాసీ ప్రజల మనోభవాలకు భంగం కలిగించని రీతిలో అది కూడా వారి అభిప్రాయాలకు అనుగుణంగా తవ్వకాలు చేపడతారంట. రెండవది ఐ.టి.డి.ఎ గిరిజన సొసైటీల ద్వారా తవ్వకాలు చేపట్టి జిందాల్, అన్‌రాక్, రస్‌అల్‌ఖైమా కంపెనీలకు అందించాలనీ, ఆదివాసీ యువతీ, యువకులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తారంట. నిర్వాసితులకు మెరుగైన పునరావాస ప్యాకేజీ ఇస్తారంట. బాక్సైట్

తవ్వకాల వలన ఎంత మొత్తంలో అడవి విధ్వంసమవుతుందో అంతే మొత్తంలో మరొకచోట అడవిని పెంచుతారంట. స్థూలంగా ఇది బాక్సైట్‌పై ప్రభుత్వ వైఖరి గత ప్రభుత్వం బాక్సైట్ విషయంలో అవలంభించిన వైఖరికీ, నేడు చంద్రబాబు ప్రభుత్వం అవలంబిస్తున్న వైఖరికి మౌళికమైన తేడా ఏమి లేదు. ఇరువురి వైఖరి ఒక్కటే. ఇకపోతే కేంద్ర పర్యావరణం అడవుల మంత్రిత్వశాఖ ఆ ప్రాంతంలో 4000 కుటుంబాలు పైగా నివసిస్తున్నట్లు పేర్కొంది. అంతే కాకుండా అటవీ హక్కుల చట్టం 2006 ప్రకారం 44 వాజ్యాలు పరిష్కారం కోసం ఎదురుచూస్తున్నాయి. అంటే ఆ చుట్టుప్రక్కల మానవ కుటుంబాలు నివసిస్తున్నాయని తేటతెల్లమవుతుంది. ప్రభుత్వం విడుదల చేసిన శ్వేతపత్రం ప్రపంచబ్యాంకు అభివృద్ధి నమూనానే ప్రతిభింబిస్తుంది తప్ప, మెజారిటీ ఆదివాసీల ప్రయోజనాలు శ్వేతపత్రంలో ఎక్కడ మనకు మచ్చుకైనా కానరాదు.అందువల్ల స్వేతపత్రంలో అబద్ధాలు, అర్ధసత్యాలు పేర్కొన్నారు. కేవలం ప్రజలను ఉద్యమమార్గం నుండి పక్కదారి పట్టించడానికి వేసిన ఎత్తుగడలో భాగమేననేది అందరూ గుర్తించాల్సిన విషయం. చంద్రబాబు పదే పదే మెజారిటీ ప్రజల మనోభవాలకూ, అభిప్రాయాలకు అనుగుణంగానే బాక్సైట్ తవ్వకాలు చేపడతాయని మాట్లాడుతున్నారు. ఇది ఒట్టి మాటలే. ఎందుకంటే తెలుగుదేశం నాయకుల కిడ్నాప్ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ ఆదివాసీల అభిమతానికి భిన్నంగా నడుచుకోజాలమని ప్రకటించాడు. కానీ ఆ ప్రకటన తడిఆరక మునుపే బాక్సైట్ తవ్వకాలకు గ్రీన్‌సిగ్నల్ తెలియజేస్తూ, జీ.ఒ నెం. 97ను జారీ చేసారు. అంటే తమ పార్టీ నాయకుల విడుదల కోసమే ఆ ప్రకటన చేసారనేది స్పష్టమవుతున్నది. బాక్సైట్ గనుల తవ్వకం వల్ల ప్రభావితమయ్యే గ్రామాలన్నింటిలోనూ గ్రామసభలు జరపాలని కాలాకమిటీ నిర్దిష్టంగా పేర్కొంది. అటవీ హక్కుల చట్టం 2006ను పూర్తిగా అమలు చేయాలని కమిటీ సిఫార్సు చేసింది. కానీ ప్రభావిత గ్రామాల్లో ఏ గ్రామసభ జరపడం లేదు. ఎటువంటి ప్రజావిచారణ నిర్వహింపబడలేదు. సామాజిక ప్రయోజనాలు ప్రజల అభివృద్ధిని ఏనాడు అలోచించని పాలకులు ఆదివాసీల మనోభవాలకు అనుగుణంగానే అలోచిస్తారనీ భావించడం భ్రమే అవుతుంది. బాక్సైట్ తవ్వకాల అంశం తెరపైకి వచ్చినప్పటి నుండి అంటే పదిహేను ఏండ్లనుండి బాక్సైట్‌కు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఉద్యమం నడుస్తున్నది. 1999లో చంద్రబాబు అధికారంలో వున్నప్పుడు రెండుసార్లు, అటు తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో వున్న సమయంలో మూడుసార్లు ప్రజాభిప్రాయ సేకరణ జరిపిన సమయంలో మెజారిటీ మన్యం ప్రజలు తమ వ్యతిరేకత నమోదు చేసినప్పటికీ, వాటికి ఏ మాత్రం విలువ ఇవ్వలేదు. పైగా ప్రజల వ్యతిరేకతను సాయుధ బలగాలను దించి, ఆదివాసీలను అక్రమ అరెస్టులతో భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. భిన్నాభిప్రాయాలను ఏ మాత్రం సహించలేని ప్రభుత్వం నిజంగా ప్రజల అభిమతానికి అనుగుణంగా నడుచుకుంటున్నట్టా? లేదనే చెప్పవచ్చు. పాలకవర్గాలు ప్రజానీకానికి నీతులు చెబుతున్నాయి. కానీ ఆచరణలో మాత్రం అందుకు పూర్తి విరుద్ధంగా ప్రవర్తిస్తున్నాయి. బాక్సైట్ విషయంలో చంద్రబాబు మాట్లాడుతున్న మాటలకూ, ప్రకటనలకు, కార్యాచరణకు పొంతన కుదరటం లేదు. పాలకవర్గాలు, ప్రభుత్వ యంత్రాంగం మొత్తం కూడా భూస్వామ్య, దళారీ నిరంకుశ పెట్టుబడిదారులంతా సామ్రాజ్యవాద ఏజెంట్లుగా పని చేస్తూ వారి ఎజెండాను అమలు చేస్తున్నారు. ఆదివాసులను అడవి నుండి దూరం చేస్తూ, అడవి నుండి తరిమి వేయాలని పాలకవర్గాలు కుట్రలు పన్నుతూ, ఆదివాసీల బతుకులను సామ్రాజ్యవాదుల చేతుల్లో పెడుతున్నాయి. ఆదివాసీల జీవితంలో ఇంత విధ్వంసం సృష్టించే బాక్సైట్ తవ్వకాల నిర్ణయానికి, బూర్జువా రాజకీయ పార్టీలన్నీ ఆమోదాన్ని ప్రకటితంగానో, అప్రకటితంగానో తెలిపే వున్నాయి. రివిజనిస్టు పార్టీలైన సి.పి.ఐ, సి.పి.ఎమ్ బాక్సైట్ వ్యతిరేక ఫోజు పెట్టినా చివరకు వాళ్ళనుసరించే వైఖరీ రాజీ ధోరణియే. ఇది అంతిమంగా పాలకవర్గాల ప్రయోజనాలే ఈడేర్చుతుంది.

ఒకవైపు ప్రజలంతా సీరియస్‌గా బాక్సైట్ తవ్వకాలకు వ్యతిరేకంగా ఉద్యమిస్తుంటే, ఒక అనివార్యస్థితిలో నుండి బూర్జువా పార్టీలు సైతం మేము కూడా వ్యతిరేకమేనని ప్రకటిస్తున్నాయి. అధికారంలోలేని విపక్షాలు సహజంగానే బాక్సైట్ వ్యతిరేకపోరాటంలో భాగమవుతున్నాయి. అయితే ఎన్నికల సమయంలో ప్రజల పోరాటాన్ని ఓట్లరూపంలో సొమ్ము చేసుకునే లక్ష్యంతో ఉంటాయనే విషయాన్ని ప్రజల్లో బహిర్గతం కావాలి. ధనిక వర్గానికి ప్రాతినిధ్యం వహించే ఈ పార్టీలన్నీ పేరుకు ప్రజాఉద్యమాలు చేపట్టినా, అవి ప్రభుత్వ వ్యతిరేక మిలిటెంట్ పోరాటంగా మారకుండా ప్రజల ఆగ్రహాన్ని, వ్యతిరేకతను నీరుగార్చే ప్రయత్నాల పట్ల కూడా అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అధికారంలో ఉన్నప్పుడు ఒకలాగా, ప్రతిపక్షంగా మారాక మరోలాగా మాట్లాడుతున్న పాలకవర్గాల ద్వంద్వనీతిని ప్రజల్లో ఎండగట్టాలి. బాక్సైట్ వ్యతిరేకపోరాటాన్ని నీరుగార్చడానికి పాలకవర్గాలు మొదటి నుండి తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. నయానా, బయానాలతో కొందర్ని లొంగదీసుకొని, వారికి డబ్బులిచ్చి లోబర్చుకొని తమ పనులు సాగించుకోవాలని అనుకుంటున్నాయి. దీనికి పావులుగా దళారీలైన ఆదివాసీలనే ఎంపిక చేసుకుంటున్నది. ఈ కుట్రలో భాగంగానే జిల్లాస్థాయిలో బాక్సైట్ పునరావాస కమిటీలో (కలెక్టర్, ఎస్.పి, చైర్‌పర్సన్, సర్పంచ్) జర్రెల మాజీ సర్పంచ్ వెంకటరమణని నియమించి రహస్యంగా బాక్సైట్‌కు అనుగుణంగా ఆ గ్రామ పంచాయితీ తీర్మాణం చేయించారు. అంతేకాకుండా 2010 సం॥లో బాక్సైట్ మట్టి నమూనాలు సేకరించే బృంధంతో జి.కె వీధి మండల మాజీ ఉపాధ్యాక్షుడు మత్స్యలింగం (సి.పి.ఐ) కుమ్మకై మట్టిని సేకరిస్తూ ప్రజలకు దొరికిపోయాడు. చివరకు ప్రజల ఆగ్రహానికి గురై కుక్క చావు చావాల్సివచ్చింది. నిజంగా వీరు చావడానికి రాజ్యం ఆదివాసీల పట్ల అనుసరిస్తున్న వైఖరే కారణం. బాక్సైట్ ప్రభావిత ప్రాంతాలైన అరకు, అనంతగిరి, చింతపల్లి, జి.కె వీధి మండలాల్లో చాలా గ్రామాలనుండి నిరుద్యోగ యువతీ, యువకులను ఉద్యోగం, ఉపాధి కల్పన పేరుతో సమీకరించి కడప, అనంతపురం, చిత్తూరు జిల్లాలకు తరలించి గనుల తవ్వకంలో శిక్షణను ఇస్తున్నారు. వీరే బాక్సైట్‌కు అనుకూలంగా ప్రచారం చేస్తున్నారు. బాక్సైట్ తవ్వకాల వలన ఉపాధి, ఉద్యోగ అవకాశాలు మెరుగవుతాయనీ, ఆకర్షనీయమైన వేతనాలు లభిస్తాయనీ, ప్రజలకు మెరుగైన పునరావాస ప్యాకెజ్ అందజేయబడతాయని నమ్మబలుకుతున్నారు. అభివృద్ధి పేరుతో అభవృద్ధికి ఆటంకమైన మావోయిస్టు పార్టీ చెబుతున్న మాటలు, ఉపన్యాసాలు విని, బాక్సైట్ పోరాటమంటూ అనవసరమైన రాద్ధాంతం సృష్టిస్తున్నారనీ, అందివచ్చిన ఉపాధి

అవకాశాలను చేజేతులారా జారవిడుచుకుంటున్నారనీ, మన్యాన్ని 50 ఏండ్ల వెనక్కితీసుకుపోతున్నారనీ, గోబెల్స్ ప్రచారాన్ని లంఘించుకున్నారు. వీళ్ళే గ్రామస్థాయిలో ప్రభుత్వానికి సాంఘిక పునాదిగా ఉంటూ ప్రజలకు వ్యతిరేకంగా గనుల మాఫీయాకు మద్ధతుగా నిలబడుతున్నారు. అలా నిలబడ్డవారిని తూర్పు డివిజన్ కోరుకొండ ఏరియా కమిటీ పరిధిలోని గ్రామ పంచాయితీకి చెందిన జెర్రల, మొండిగెడ్డ, గుడివాడ మొదలైన గ్రామాలనుండి కొంతమంది ప్రజావ్యతిరేకులను ఆ ఏరియా నుండి ప్రజలు బహిష్కరించారు. వారి వారి చర, స్థిరాస్తులను స్వాధీనపర్చుకున్నారు. శ్రీకాకుళం-కోరాపుట్ డివిజన్ పరిధిలో, పొట్టంగి బ్లాకు, గొల్లూరి పంచాయితీకి ఆనుకొని అరకు ప్రాంతం ఉంటుంది. అక్కడ రక్తకండి, చిట్టంగొంది బాక్సైట్ నిక్షేపాలు ఉన్న ప్రాంతం. అక్కడ బాక్సైట్ అనుకూలురు విప్లవ ప్రతీఘాతుకులుగా తయారయ్యి, ఉద్యమ ప్రజానీకంపై భౌతిక దాడులకు దిగే సూచనలు కనిపిస్తున్నాయి. మొత్తం మీద పాలకులు తమ ప్రభువుల (భూస్వామ్య, దళారీ నిరంకుశ బూర్జువా వర్గ, సామ్రాజ్యవాదుల) ఆర్థిక ప్రయోజనాల కోసం విభజించు-పాలించు అనే కుటిల నీతిని అక్షరాల అమలు చేయడానికి పూనుకుంది. హిట్లర్ పాలనలో నాజీలు సాగించిన దురాంతాలను మించిపోతున్న ఈ అక్రమాలను ప్రతి ఒక్కరు ఎవరికీ తోచిన పద్ధతిలో వారు ఖండించడం, ప్రతిఘటించడం తప్ప వీటిని ఆపడానికి మరొక మార్గం లేదు.

'పొట్టకిచ్చిన, బట్టకిచ్చిన అడవే' అని బ్రతుకుతున్న లక్షలాది మంది ఆదివాసీలు బాక్సైట్ వెలికితీత మూలంగా తాము సర్వస్వం కోల్పోతామనీ, కనుక తమ ప్రాణాలొడ్డయినా బాక్సైట్ తవ్వకాలను అడ్డుకుంటామనీ 15ఏండ్లుగా ఉద్యమిస్తున్నారు. ఇటీవల కాలంలో చంద్రబాబు ప్రభుత్వం బాక్సైట్ తవ్వకాలకు దారి సుగుమం చేస్తూ జారీ చేసిన జీ.వో నెం.97తో ఉద్యమం మరింత ఉధృతమవటంతో చంద్రబాబు ఒక అడుగు వెనక్కి వేసాడంతే. కానీ పూర్తిగా కాదు.వాస్తవానికి ఈ జీ.ఓ విడుదల చేయడమంటే (1997 జులై 11 నాటి సమతా జడ్జిమెంట్) కోర్టు తీర్పును ధిక్కరించినట్లే. అందుకే ఈ జీ.ఒను రద్దు చేస్తూ మరొక జీ.ఓ వచ్చేంతవరకు పోరాడాల్సిందే. అప్పుడు గానీ జరగబోయే మైనింగ్ ప్రమాదాన్ని ఆపలేము. ఈ ప్రాంతంలో నివసించే ఆదివాసీలందరూ కలిసి బాక్సైట్ మైనింగ్ వ్యతిరేక పోరాట కమిటీలను ఏర్పర్చుకొని అందరూ ఏకతాటిపైకి వచ్చారు. వారందరూ తమ సమస్యలపై మిలిటెంట్ పోరాటం చేస్తున్నారు. వీరికి మద్ధతుగా ఉద్యోగులు, విద్యార్థులు, ఆదివాసీ ప్రజాస్వామిక సంఘాలు ఐక్యకార్యాచరణ కమిటీలుగా ఏర్పడి ఉద్యమిస్తున్నారు. ప్రాణాలొదిలైనా మా అడవిని, భూమిని రక్షించుకుంటాం. కానీ ఇక్కడి నుండి వెళ్ళేది లేదని ఖరాఖండిగా చెప్పడం జరుగుతున్నది. బాక్సైట్ ప్రభావిత ప్రాంతాల్లో ప్రభుత్వ కార్యకలాపాలను బహిష్కరించడానికి పూనుకున్నారు. ప్రజల సాయుధ ప్రతిఘటనను సహించలేని క్రూరమైన ఈ రాజ్యం ఆదివాసీలపై విరుచుకుపడుతున్నది. గత ఆగస్టు (2014) నెలలో జెర్రల పంచాయితీ కేంద్రంలో బాక్సైట్ వ్యతిరేక జె.ఎ.సి ఆధ్వర్యంలో జరిగిన బహిరంగ సభపై ఎ.పి గ్రేహౌండ్స్ బలగాలు దాడి చేసారు. సభకు హాజరైన ప్రజలు తిరుగుబాటు చేయడంతో కాలికి బుద్ధి చెప్పారు. ఆ తర్వాత సభకు మావోయిస్టులు వచ్చారనే ముందస్తు సమాచారంతో దాడి చేసామే తప్ప, ఉద్దేశపూర్వకంగా మాత్రం దాడి చేయలేదని అసత్యాలు, కట్టుకథలు చెప్పి నమ్మింపజూసారు. ఈ మధ్య కాలంలో ప్రజల ఆగ్రహావేశాలకు బలైన జెర్రల మాజీ సర్పంచ్ వెంకటరమణ చావు సాకు చూపించి 30 మంది ఆదివాసీలను అరెస్ట్ చేసి, చేయని నేరాలను వారిపై మోపి నేరస్తులుగా చిత్రీకరించే కుట్ర చేస్తున్నారు. అందులో భాగంగా బాక్సైట్ తవ్వకాలకు వ్యతిరేకంగా ప్రభుత్వ దమననీతిని వ్యతిరేకిస్తూ ప్రజాస్వామ్య విలువలను కాపాడి ప్రజలను రక్షించండి అని తోటి ఆదివాసీల పక్షాన పోరాడుతున్న ఆదివాసీ మహిళా ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరీని, చంద్రబాబు నాయుడికి వ్యతిరేకంగా ఒక బహిరంగ సభలో అభ్యంతర కరమైన వ్యాఖ్యాలు చేసిందని రాజద్రోహం కుట్ర కేసులను పెట్టారు. ప్రజాస్వామ్యంలో ప్రజలను రక్షించమని అడిగేవారు రాజద్రోహులైతే, ప్రజల హక్కులను కాలరాసేవారు మాత్రం రాజులై కూర్చుంటున్నారు. శ్రీకాకుళం-కోరాపుట్ డివిజన్, నందపూర్ ఏరియా కమిటీ పరిధిలో బాక్సైట్ వ్యతిరేక పోరాట నాయకత్వాన్ని నయానా, బయానా లొంగదీసుకొని డబ్బులు ముట్ట జెప్పి లోబర్చుకునే ప్రయత్నం చేసారు. అంతటితో ఆగక మన పార్టీ నాయకత్వాన్ని నిర్మూలించాలనే కుట్రలో భాగంగా గ్రామాల్లో దళం వస్తే అన్నం, కూరల్లో విషం కల్పమని విషం బాటిల్ ఇచ్చారు. ఇది మచ్చుకు మాత్రమే. ఇలాంటి ఘటనలు, సంఘటనలు బాక్సైట్ వ్యతిరేక పోరాట ప్రభావిత ప్రాంతాల్లో కోకొల్లలు. ఇది ముమ్మాటికీ బాక్సైట్ వ్యతిరేక పోరాటాన్ని నిర్వీర్యం చేయడానికే ప్రభుత్వం ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నది. మరొకపక్క బాక్సైట్ తవ్వకాలు చేపట్టే వారికి పూర్తి భద్రత కల్పిస్తామనీ, ప్రభుత్వం అనుమతిస్తే మన్యం అంతటా పోలీసు ఔట్ పోస్టులు ఏర్పాటు చేస్తామని విశాఖ జిల్లా ఎస్.పి కోయ ప్రవీణ్ ప్రకటించాడు. అంటే సాయుధ బలగాల బలప్రయోగం ద్వారా ప్రజలను అణచిపెట్టి, బాక్సైట్ ఖనిజ సంపదను కొల్లగొట్టేందుకు విశ్వప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా బాక్సైట్ గనుల ఖిల్లా కోరుకొండకు ముఖద్వారమైన ఆర్‌జీ కొత్తూరులో పోలీసు ఔట్‌పోస్టు నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. అలాగే ఎమ్.కె.వి.బి డివిజన్, పెదబయలు ఏరియా కమిటీ పరిధిలోని రూడకోటలో పోలీస్ ఔట్‌పోస్టు నిర్మాణపనులు యుద్ధ ప్రాతిపదికన జరుగుచున్నాయి. మద్దిగరువులో మరో పోలీస్ ఔట్‌పోస్టు ఏర్పాటుకై ప్రయత్నాలు చేస్తున్నారు. కోరాపుట్ జిల్లా, పొట్టంగి బ్లాక్ పేటూరు వద్ద ఒక బి.ఎస్.ఎఫ్ క్యాంపు ఏర్పాటయ్యింది. అలాగే గొల్లూరు గ్రామ పంచాయితీ పరిధికి చెందిన దిగువ గొల్లూరు వద్ద కూడా బి.ఎస్.ఎఫ్ క్యాంపు ఏర్పాటు చేసారు. పైన పేర్కొన్న పోలీసు ఔట్‌పోస్టుల ప్రతిపాదనలను 18-2-2016న విశాఖపట్నంలో మూడు రాష్ట్రాల (ఒడిశా-ఎ.పి-చత్తీష్‌గడ్) డి.జి.పిలు, సి.ఆర్.పి.ఎఫ్, బి.ఎస్.ఎఫ్, డైరెక్టర్ జనరల్స్‌తో కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ జరిపిన సమావేశంలో ఆమోద ముద్ర వేసారు. తత్ఫలితంగానే ఆంధ్రప్రదేశ్‌కు ఒక బెటాలియన్ సరిహద్దు భద్రతా బలగాలను కేటాయిస్తున్నట్టు ప్రకటించాడు. రాజ్యం తలపెట్టిన సాయుధ కార్యక్రమం ఇక్కడి పచ్చదనాన్ని పొట్టనబెట్టుకొని కోట్ల రూపాయలు గడించడానికే అనేది అందరూ గమనించాల్సిన విషయం. బయటకు మావోయిస్టుల ఏరివేత లక్ష్యంగా కనిపిస్తున్నా, దాని వెనక ఆదివాసీ సమూహాల నిర్మూలన, స్థానభ్రంశం చేయడం అనంతరం బాక్సైట్ నిక్షేపాలను వెలికితీయడానికి మార్గం సుగుమం చేయడం. వాటిని బహుళజాతి

**తరువాయి 7వ పేజీలో...**

వ్యాసం

# రెండున్నర దశాబ్దాల ప్రపంచీకరణ విధానాలు విధ్వంసమవుతున్న కార్మిక బతుకులు

ఇది సువిశాల భారతదేశం. ఇక్కడ వ్యవసాయమే ప్రధాన ఆర్థిక వనరు. నూటికి 70శాతం మంది ప్రజలు వ్యవసాయంపైనే ఆధారపడి బతుకుతున్న దేశం. వ్యవసాయంతో పాటు దేశవ్యాప్తంగా ముంబాయి, కలకత్తా, గుజరాత్, బెంగుళూర్, చెన్నై, హైదరాబాద్, ఢిల్లీ లాంటి ప్రసిద్ధిగాంచిన నగరాలలో భారీ, చిన్న, మధ్యతరహా పారిశ్రామిక వాడలతో విలసిల్లుతున్న దేశం. దేశ ప్రగతిలో రెండవస్థానం కార్మికులు చిందించిన చెమటచుక్కలదే అనడంలో అతిశయోక్తే లేదు. కానీ ఇక్కడి చరిత్ర ప్రస్థానంలో, కార్మికుల ప్రస్తావన కంటికైనా కనిపించదు. చార్మినార్ ఎవరు కట్టారంటే మహమ్మద్ కూలీ ఖుతుబ్‌షా అని అంటారు. కానీ దాన్ని నిర్మించిన కార్మికుల ఊసే ఉండదు. అభివృద్ధి చెందిందని చెప్పుకుంటున్న ఈ సమాజంలో సూది మొదలుకొని అంతరిక్షంలో వేలాడుతున్న ఉపగ్రహాలదాకా కార్మికుల చెమట చుక్కల ప్రతిఫలమే. ఇక్కడి శ్రామికులు ఎంతటి నైపుణ్యం కలిగిన శిల్పులో ఇక్కడ నిర్మించిన చారిత్రక కట్టడాలను చూస్తే మనకు అర్థమవుతుంది. పెట్టుబడిదారి దేశాల శ్రామికులతో పోల్చితే ఇక్కడి శ్రామికులకు అక్షరాస్యత తక్కువే కావచ్చు, కానీ అగ్గిపెట్టెలో ఒదగగలిగే జరిచీరలను నేచిన నేర్పరులు ఇక్కడి నేత కార్మికులు. ఎత్తైన భవనాలు, రోడ్లు, వంతెనలు, చారిత్రక కట్టడాలు, రైల్వేస్టేషన్‌లు, విమానాశ్రయాలు, ఓడరేవుల నిర్మాణాలన్నీ కార్మికుల చెమట చుక్కలకు చిహ్నాలే. భారీ, చిన్న తరహా, కుటీర పరిశ్రమలలో కార్మికుల స్పర్శ తగలని యంత్రాలే వుండవు. అందుకే "ప్రభువెక్కిన పల్లకి కాదోయ్-దాన్ని మోసిన బోయిలెవరోయ్" అని అంటాడు విప్లవ కవి కామ్రేడ్ చరబండరాజు. అది చారిత్రక సత్యం. నేటికి ఆ మాటలు, రాతలు అర్థవంతమే. 18వ శతాబ్దం చివరి అర్థం నాటికి బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీ దేశాన్ని నిలువునా కొల్లగొట్టి ఇక్కడి వనరులను తరలించుకుపోవడానికి అవసరమైన రైల్వేమార్గం, ఓడరేవుల నిర్మాణంతో ఇక్కడి ఆధునిక సంఘటితమైన 'భారత కార్మికవర్గం' ఆవిర్భవించింది. ఈ సంఘటిత కార్మికవర్గంతో పాటే అసంఘటిత కార్మికవర్గం కూడా పురుడుబోసుకుందని చెప్పవచ్చు. ఇది ట్రాన్స్‌పోర్ట్, మైనింగ్, ప్లాంటేషన్, హమాలీ, పారిశుధ్య నిర్మాణ రంగాలలో తనదైన భాగస్వామ్యాన్ని అందించింది. నేటికి అందిస్తున్నది. దీనిపై పుట్టిన నాటినుండే వివక్ష. ఇది ఇవ్వాల్టికీ కూడా తగిన గుర్తుంపులేని రంగంగానే మిగిలింది. ఉపాధి, భద్రతలేని రోజు కూలీలుగా బతుకెళ్ళదీస్తున్నది. ఏది ఏమైనా సంఘటిత, అసంఘటిత కార్మిక రంగాలు దేనికవే సాటి. దేని ప్రాధాన్యత దానిదే. అయినా ఈ రెండు రంగాలు ఒకదానిపై మరొకటి నిరంతరంగా ఆధారపడుతూ పరస్పర సహకారంతో జమిలిగానే భారత ఆర్థిక వ్యవస్థ అభివృద్ధిలో తమవంతు భాగస్వామ్యాన్ని అందిస్తున్నాయి.

ప్రపంచ దేశాల కార్మికవర్గం వలనే మహోన్నతమైన

---

**6వ పేజీ తరువాయి...**

కంపెనీలకు ధారదత్తం చేయడం అనేది నిర్వివాదమైన అంశం.

ఆదివాసీలు ఇప్పుడు సామ్రాజ్యవాద స్వదేశీ, విదేశీ కబంధహస్తాల్లో వున్నారు. గ్రీన్‌హంట్ మరో రూపమే రెడ్‌హంట్ పేరిట ఆదివాసీలపై కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు అధర్మ యుద్ధానికి దిగుతున్నాయి. గ్రామాలపై మూకుమ్మడి దాడులు చేయడం, అక్రమ అరెస్టులకు పాల్పడడం, తప్పుడు కేసులు మోపి జైల్లో నిర్బంధించడం, మావోయిస్టుల ముద్రవేసి లొంగుబాట్లకు గురిచేయడం సర్వసాధారణమైపోయింది. పలుచోట్ల ఆదివాసీ ప్రజలపై కాల్పులకు దిగడం, నిత్యం ఇనుప బూట్ల చప్పుళ్ళతో మన్యం మారుమ్రోగిపోతుంది. గతంలో వివిధ కాలాలలో అడవిలో స్వేచ్ఛగా తిరిగేవారు, కానీ నేడు అలా తిరగలేని పరిస్థితి నెలకొనివుంది. వారి కదలికలపై అప్రకటిత నిషేధం కొనసాగుతుంది. దీంతో అడవి లేకుండా ఎలా బతకాలో అర్థం కావడం లేదని ఆవేధన చెందుతున్నారు. ఈ ప్రాంతాలలో నిర్విరామంగా జరిగే (పోలీసింగ్) నిఘాలతో, కనిపించిన వారిని అణువణువునా చెకింగ్ చేయడం, అనుమానం వస్తే అరెస్టులు చేయడం, ఇంటరాగేషన్ పేరుతో థర్డ్ డిగ్రీ పద్ధతులు అనుసరించి తీవ్ర చిత్రహింసలకు గురి చేయడం పరిపాటయింది. హక్కులు పొందాల్సిన షెడ్యూల్ ప్రాంతంలో పౌరహక్కులు మృగ్యమవుతున్నాయి. మరోవైపు మన్యంలో సభలు, ర్యాలీలు చివరికి ఏ కొద్ది మంది కూడా జమఅయ్యేందుకు వీలులేని పద్ధతులలో పోలీస్‌యాక్ట్-30ని అమలు జరుపుతూ ప్రజల ప్రాథమిక హక్కులను సైతం కాలరాచివేస్తున్నారు. భావప్రకటన చుట్టూ ఎన్నో ఇనుపకంచెలు, ఎంత పోలీసు పహారా అయినా అవన్నీ భరిస్తూనే నిర్బంధ శిభిరంలోనే బాక్సైట్ వ్యతిరేక పోరాటం కొనసాగిస్తున్నారు. గద్దల్లా మారిన పోలీసు మూకల చేతచిక్కిన ప్రజలను సాధారణంగా ప్రభుత్వం తల్లికోడిలా మారి ఆదుకోవాలి. కానీ దుష్పరిపాలన, అవినీతి, నేరమయ ముఠాలకు, గనుల మాఫియాకు, నారు, నీరు పోసి పెంచడం వంటి చర్యల ద్వారా చంద్రబాబు ప్రభుత్వం ఓ ఆకలిగొన్న గద్దలాగా వ్యవహరిస్తోంది. ఈ పాలక వర్గాలు అభివృద్ధి ముసుగులో ఆదివాసీలను అంతం చేసే దిశగా వడివడిగా అడుగులు వేస్తోంది. పాలకవర్గ రాజకీయాలు,ఆ రాజకీయాల ప్రయోజనాల ఆధారంగా చేపట్టే బాక్సైట్ ఖనిజాల వెలికితీత, ఆదివాసీల అస్తిత్వాన్ని ప్రమాదంగా మార్చేస్తున్నాయి. అమానవీయమైన చంద్రబాబు ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా తమ అస్థిత్వాన్ని ఆత్మగౌరవ పోరాటాల వారసత్వాన్ని కొనసాగిస్తూ జల్, జంగల్, జమీన్, ఇజ్జత్, అధికారంకై సాయుధంగా సమైఖ్యంగా సంఘటితంగా పోరాడదాం. బో

వర్గపోరాటాల చరిత్ర భారత కార్మికవర్గానికి కూడా ఉన్నది. అది బ్రిటిష్ వలసకాలం నుండి నేటివరకు వీరోచితమైన ఆర్థిక పోరాటాలు చేస్తూనే ప్రజాస్వామిక పోరాటాలలో భాగస్వామ్యం అవుతుంది. ఇక్కడ జరిగిన చారిత్రాత్మకమైన రైల్వే, జూట్‌మిల్స్, స్పిన్నింగ్ మిల్లుల సమ్మెలల్లో వీరోచితంగా పోరాడి తమ హక్కులను సాధించుకున్నది. కనీస వేతనాల చట్టం, కాంట్రాక్టు కార్మికుల క్రమబద్ధీకరణ చట్టం, ప్రావిడెంట్ ఫండ్ చట్టం, కార్మికుల నష్టపరిహారాల చట్టం, పారిశ్రామిక వివాదాల చట్టం లాంటి అనేక కార్మిక చట్టాలను పోరాడి సాధించుకున్నది. సమ్మె హక్కు, పని భద్రతల హక్కులను కూడా ప్రజా ఉద్యమాల ద్వారానే సాధించుకున్నది. ఇది తమ ఉపాధి భద్రత కోసం నిరంతరం పోరాడుతూనే సమాజ విముక్తి కోసం నేడు నిజమైన ప్రజాస్వామ్యం కోసం జరుగుతున్న వర్గపోరాటాలలో భాగస్వామ్యం అవుతూ నాయకత్వం కూడా వహిస్తున్నది. మొన్న ఈస్ట్ ఇండియా కంపెనీ చేతుల్లో, నిన్న అధికార మార్పిడి తర్వాత ఏర్పడిన అతి బలహీనమైన (వెన్నుపూస లేని) పారిశ్రామిక అధిపతుల చేతుల్లోనూ నేడది సామ్రాజ్యవాద బహుళజాతి కంపెనీల, భారత బడా పారిశ్రామిక అధిపతుల కాళ్ళకింద నలిగిపోతూ విలవిలలాడుతున్నది. అది పుట్టిననాటి నుండి నేటివరకు నిలువెల్లా శ్రమ దోపిడీకి గురవుతూనే ఉన్నది. చేతులు తప్ప ఆస్తులులేని వేతన బానిసలుగా మిగిలి చావుబతుకులతో ఏటికి ఎదురీదుతున్నది.

ఒకవైపు రవిఅస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యవాదం రెండవ ప్రపంచ యుద్ధంలో కుప్పకూలిపోయి వలసలను కొనసాగించే స్థితిని కోల్పోయింది. మరోవైపు దేశంలోని యువజన, విద్యార్థి, కార్మిక, ఆదివాసీ, రైతాంగం చేసిన మిలిటెంట్ ఉద్యమాల ప్రజాగ్రహానికి బ్రిటిష్ వలస పాలకులు తమ వలస సామ్రాజ్యాన్ని వదులుకోక తప్పలేదు. కానీ పరోక్షంగానైనా దేశాన్ని తమ అదుపాజ్ఞల్లో ఉంచుకోవడానికి తమ తాబేదారులైన ఇక్కడి దళారులకు అధికారాన్ని అప్పగించింది. అప్పటినుండి ఇక్కడి భూస్వామ్య, దళారీ, నిరంకుశ బడా బూర్జువా వర్గం చేతుల్లోకి పరిపాలనా పగ్గాలు చేరాయి. బ్రిటిష్ వలస నుండి భారత్ నయావలస రూపంలోని అర్థవలస, అర్థభూస్వామ్య వ్యవస్థగా ఆవిర్భవించింది. అప్పటినుండి పాలన అంతా సామ్రాజ్యవాదులు భారత బడా బూర్జువా, భూస్వామ్య వర్గాలను కాపాడుకుంటూ కార్మికవర్గాన్ని నిట్టనిలువునా దోపిడీ చేస్తున్నది. భారత బడా బూర్జువా వార్గానికి ప్రతినిధి అయిన దేశ తొలి ప్రధాని జవహర్‌లాల్‌నెహ్రూ "దేశాన్ని సోషలిస్టు దేశంగా మారుస్తాను, నేనూ సోషలిస్టునే" అంటూ ఊకదంపుడు ఉపన్యాసాలు ఇస్తూ ఆచరణలో సామ్రాజ్యవాద, భూస్వామ్య, బడా బూర్జువా వర్గాలకు సేవలందించాడు. ప్రధాని నెహ్రూ 1948 ఫిబ్రవరి 17 నాటి ఒక ప్రకటనలో "నవభారత ఆర్థిక నిర్మాణంలో ఎలాంటి మార్పులు ఉండవు. అన్ని వ్యవస్థలను ప్రభుత్వమే నిర్వహిస్తుంది" అంటూ 50 రోజులు గడవకుండానే గొంతు సవరించుకొని 1948 ఏప్రిల్ 6న "ఆయుధ సామాగ్రి రైల్వేలు, విద్యుత్, అణుశక్తి తప్ప మిగిలిన పారిశ్రామిక రంగం అంతటా సాధారణంగానే ప్రైవేటు పెట్టుబడులకు అవకాశం ఉంటుంది"అని ప్రకటించి తన నిజస్వరూపాన్ని బహిర్గతపరుచుకున్నాడు. అంటే ఆది నుండి భారతపాలక వర్గాలలో ఉన్నది దళారీ స్వభావమే అనడంలో ఎటువంటి బిన్నాభిప్రాయాలకు తావేలేదు. నేటికి స్వపరిపాలన, స్వావలంబన, స్వభావంలేని భారత బూర్జువాపాలన కార్మిక వ్యతిరేకమైనది. ఎల్.పి.జి విధానాలకు అనుకూలమైనది. 1954 నెహ్రూ ప్రవేశపెట్టిన మిశ్రమ ఆర్థిక విధానం పబ్లిక్, ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ (పి.పి.పి)కి పునాదులు వేసిందని చెప్పవచ్చు. ఎందుకంటే అప్పటివరకు అతి బలహీనంగానే ఉన్న భారత బడా పారిశ్రామిక వేత్తలకు ప్రభుత్వం అనేక సౌకర్యాలను కల్పించింది. వారికి పరిశోధన మరియు అభివృద్ధి (రిసెర్చ్ అండ్ డెవలంప్‌మెంట్)తో పాటు వారు ఉత్పత్తి చేసే వస్తువులకు ప్రభుత్వమే మార్కెట్ కల్పించింది. అంతేకాక ప్రభుత్వ బ్యాంకుల ద్వారా పెద్దఎత్తన ఋణాలనూ, సబ్సిడీలనూ, ఒ.డి లను కల్పించింది. భారత పీడిత ప్రజలను నిలువునా దోచి బడా పారిశ్రమికవేత్తల జేబులు నింపింది. పారిశ్రామిక అభివృద్ధి ఫలాలతో బడా పారిశ్రామికవేత్తల బొక్కసాలును నింపి కార్మికులను ప్రైవేటు పారిశ్రామిక యాజమాన్యం కింద వేతన బానిసలను చేసింది.

1973లో ఇంధిరాగాంధీ ప్రవేశపెట్టిన "మోనోపలీస్ అండ్ రిస్ట్రిక్టివ్ ట్రెడ్ ప్రాక్టిసెస్ ఆక్ట్" బడా పారిశ్రామికవేత్తలను ఒక మేరకు కట్టడి చేసిందని చెప్పవచ్చు. అప్పటి వ్యాపార లావాదేవీలన్ని ప్రభుత్వ దయాదాక్షిన్యాల మీద ఆధారపడి నడిచేవని ఒక వాధన. కానీ యూ.సి.సి (యూనియన్ కార్బైడ్ కార్పోరేషన్) విషయంలో తీసుకున్న నిర్ణయానికి పై వాధనకు ఎలాంటి పొంతన లేదు. యూ.సి.సి లో ప్రభుత్వ భాగస్వామ్యం, జోక్యం, పర్యవేక్షణ ఏమి లేకుండానే విదేశీ ప్రత్యక్ష పెట్టుబడికి తలుపులు తెరిచింది. అమెరికన్ బహుళజాతి సంస్థ అయిన యూ.సి.సి ఏర్పాటుకు మధ్యప్రదేశ్‌లోని బోపాల్ నగరంలో భూమిని కేటాయించింది. దానికి అవసరమైన అన్నిరకాల అనుమతులను కట్టబెట్టింది. యూ.సి.సి బహుళజాతి సంస్థలో జరిగిన విస్పోటన ఎంతమంది కార్మికుల, సామాన్య ప్రజల ఉసురు పోసుకుందో మనకు తెలియనిది కాదు. ఎమర్జెన్సీ తరువాత అధికారం కోల్పోయి తిరిగి 80లో అధికారంలోకి వచ్చిన ఇంధిరాగాంధీ పాతవిధానాలకు స్వస్థి పలికి 1970లో బ్రిటన్‌కు చెందిన మార్గరేట్ థాచ్చర్, అమెరికాకు చెందిన రోనాల్డ్ రిగన్‌లు తీసుకువచ్చిన స్వేచ్ఛావాణిజ్య విధానాన్ని అతి వేగంగా అవగాహణ చేసుకున్నది. వెంటనే "సిమెంట్ పరిశ్రమిల డి రెగ్యూలేషన్" పేరుతో విదేశీ కంపెనీలు మనదేశ కంపెనీలతో కలిసి జాయింట్ వెంచర్స్ చేపట్టడానికి అవకాశం కల్పించింది.

రెండు ప్రపంచ యుద్ధాలతో తీవ్రాతి తీవ్రమైన ద్రవ్యసంక్షోభంలో కూరుకుపోయిన సామ్రాజ్యవాద అగ్రరాజ్యాలు వారి సంక్షోభ నివారణ కోసం వెనకబడిన మూడవ ప్రపంచ దేశాలను నిలువునా దోచుకోవడమే ప్రధాన వనరుగా ఎంచుకున్నాయి. అందులో భాగంగానే ఏర్పర్చబడిన ఇంటర్నేషనల్ మానీటరీ ఫండ్

(ఐ.ఎమ్.ఎఫ్), ప్రపంచ బ్యాంకు (డబ్ల్యూ.బి), ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూ.టి.ఒ) ల రుణాల, గ్రాంటుల, పేటెంట్ హక్కుల కొరడాలతో వెనకబడిన దేశాలను నియంత్రించడం మొదలుపెట్టినాయి.

***1991లో పి.వి నరసింహరావు నేతృత్వంలోని కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానికి సామ్రాజ్యవాదులు విధించిన మూడు కీలకమైన షరదులు***

1. మార్కెట్‌పై నియంత్రణ ఎత్తివేసి స్వేచ్ఛా వాణిజ్య వ్యాపార విధానాన్ని అమలు చేయాలనీ,

2. ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరించాలనీ,

3. ప్రజాసంక్షేమ కార్యక్రమాల్లో కోత విధించాలనే షరదులతో కూడిన అవమానకరమైన ఒప్పందాలపై సంతకాలు చేసి ఐ.ఎమ్.ఎఫ్, డబ్ల్యూ.బి నుండి 23వేల కోట్ల రూపాయలు అప్పు తీసుకువచ్చారు. అప్పటి ఆర్థికమంత్రి మన్‌మోహన్‌సింగ్ జులై 25న తన తొలి బడ్జెట్ ప్రవేశపెట్టిన ఆమోదంతో భారతదేశంలో ఎల్.పి.జి(లిబర్లైజేషన్, ప్రైవేటైజేషన్, గ్లోబలైజేషన్) విధానాలు ప్రవేశించాయి. అందులో భాగంగానే 1994లో భారత ప్రభుత్వం డబ్ల్యూ.టి.ఒ విధించిన మరో షరతు "ప్రభుత్వం ఎలాంటి వ్యాపారం చేయకూడదు" అనే విధాన పరమైన ఒప్పందాలపై సంతకం చేయడంలో దేశంలోని ఉత్పత్తి యూనిట్‌లు అమ్మివేయాలని వ్యూహరచన మొదలైంది. అక్కడినుండే భారత కార్మికవర్గ పరిస్థితిని పెంకమీద నుండి పోయిలో పడేసారు. ఇక నష్టాల పేరుతో లాక్‌ఔట్‌లు, రిట్రిచ్‌మెంట్‌లు, లే-ఆఫ్‌లు ప్రకటించి కార్మికులనూ, ఉద్యోగులను వాలెంటీర్ రిటైర్‌మెంట్ స్కీమ్ (వి.ఆర్.ఎస్), కంపల్‌సరి రిటైర్‌మెంట్ స్కీమ్(సి.ఆర్.ఎస్)ల పేరుతో గోల్డన్ షేక్‌హ్యాండ్ కార్మికులకు బంగారు కరచాలనమంటూ భ్రమలు కల్పించి ఇష్టం ఉన్నా లేకపోయినా బలవంతంగా గేటు బయటకు గెంటేసారు. వ్యవస్థాగత సర్దుబాట్ల కార్యక్రమాన్ని రూపొందించి కొన్ని ప్రభుత్వరంగ యూనిట్‌లను నిర్దాక్షిణ్యంగా మూసివేయుటకు వ్యూహరచన చేసి కొన్నింటిని మూసివేసారు, కొన్నింటిని ఖాయిలా పడేసారు, మరికొన్నింటిలో ఉత్పత్తిని నిలిపివేసారు. క్రమంగా పి.ఎస్.యులు దివాలా తీసే పథకాన్ని రూపొందించి ఒక్కొక్కటిగా మూసివేస్తూ కార్మికుల జీవితాలను రోడ్డున పడేసారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్.పి.జి విధానాలను మొట్టమొదట భావజాల రంగంలో అమలులోకి తీసుకువచ్చింది. 1992లో ప్రైవేట్ బ్రాడ్‌క్యాస్టర్ అయినా "జి టెలీఫిలిమ్స్" అనే సంస్థకు పర్మిషన్లు ఇచ్చింది. అక్కడి నుండి వందలాది ప్రైవేట్ టీ.వి చానళ్ళు రంగప్రవేశం చేసాయి. మొదట ప్రజల మెదళ్ళపై దాడి చేసి తరువాత సర్వం దోచుకోవాలనే వారి వ్యూహం ఫలించిది. ఆ చానల్‌ల్లో సామ్రాజ్యవాద, భూస్వామ్య విషసంస్కృతులను వెదజల్లుతూ ప్రజలను ఒక క్షణమైనా సమస్యల కోసం ఆలోచించనివ్వకుండా చేయడంలో దోపీడీ దారులకు గొప్ప ఫలితాలనే ఇచ్చాయనే చెప్పవచ్చు. 1992లో విమానయాన రంగంలో జట్‌ఎయిర్‌వేస్‌కు అవకాశం కల్పించారు. 1994లో టెలికాం రంగంలో భారత్ సంచార్ నిగామ్ లిమిటెడ్ (బి.ఎస్.ఎన్.ఎల్) సేవలలో వారి సృజనకు అడ్డుకట్ట వేసి ప్రైవేటు టెలిఫోన్ ఆపరేటరయిన భారతి ఎయిర్‌టెల్‌కు అవకాశం కల్పించారు. క్రమంగా రిలయన్స్, టాటా, హచ్, వొడాఫోన్, యూనినార్ లాంటి బహుళజాతి సంస్థలకు స్పెక్ట్రంను ధారాదత్తం చేసారు. 1994లో బ్యాంకింగ్ రంగంలోకి ఐ.సి.ఐ.సి.ఐ, యూ.టి.ఐ (ప్రస్తుతం ఆక్సిస్ బ్యాంక్) ప్రవేశించడంతో ప్రభుత్వ బ్యాంకుల ఉనికి క్రమంగా దెబ్బతింటూ వచ్చింది. ఇవాలా దేశీయ అంతర్జాతీయ స్థాయిలోని వందలాది కార్పొరేట్ బ్యాంకులు వాటి బ్రాంచీలు రాజ్యమేలుతున్నాయి. ఇక పి అండ్ టి విషయానికి వస్తే దీనికి పోటీగా ట్రాన్స్‌పోర్ట్, కొరియర్ సర్వీస్, పార్సిల్ సర్వీసులు కుప్పలు తెప్పలుగా ఏర్పడినాయి. వీటి దెబ్బకు తపాలవ్యవస్థ ఉక్కిరిబిక్కిరైపోయింది. వీరికి చేతినిండా పని ఉండటం లేదని చివరికి వీరి చేత దిపావళి టపాకాయలు, రంజాన్ హలీమ్‌లు కూడా అమ్మిపిస్తున్నారంటే కార్మికవర్గం పట్ల ఎంత దుర్మార్గమైన పద్ధతులు అవలంబిస్తున్నారో యావత్తు సమాజం అర్థం చేసుకోవలసిన అవసరం ఉంది. ఇందులో ప్రతి ఏటా రిటైర్ అవుతున్న ఖాళీ స్థానాలను భర్తీ చేయకుండా ఆ పనులన్నీ ఔట్ సోర్సింగ్ కార్మికుల చేత చేయిస్తున్నారు. పోస్టల్ అండ్ టెలిగ్రామ్స్ రంగం నుండి క్రమంగా ప్రభుత్వం వైదొలగుతుంది. బ్యాంకింగ్, ఇన్సురెన్స్ రంగాల విషయానికొస్తే వీటికి హద్దులే లేవని చెప్పవచ్చు.

1961లో ప్రజారోగ్యరక్షణ కోసం నిర్మించబడిన సేవారంగ ఐ.డి.పి.ఎల్ (హైదరాబాద్) పరిశ్రమను కొన్ని నష్టాల సాకుతో మూసివేసి సుమారుగా 7వేల మంది కార్మికులను వి.ఆర్.ఎస్, సి.ఆర్.ఎస్‌లతో ఇంటికి పంపించారు. దేశవ్యాప్తంగా దీని స్థానంలో దేశీయ కంపెనీలైన రెడ్డి ల్యాబ్స్, జి.వి.కె ఫార్మా, అరబిందో ఫార్మా, అమెరికాకు చెందిన హెటిరో ఫార్మా, అలక్జండెరీయా, బ్రిటన్‌కు చెందిన సిప్లా, ఇతర సంపన్న దేశాలకు చెందిన రాంబాక్సి లాంటి బడా ఫార్మా కంపెనీలకు పర్మిషన్‌లు కట్టబెట్టి కార్మికులను ప్రైవేటు యాజమాన్యం కాళ్ళకిందకి గెంటేసారు. నిన్నటి అవిభజిత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రాగాటూల్స్, ఆల్విన్ బస్ బిల్డింగ్, ఆల్విన్ వాచెస్, డి.బి.ఆర్ మిల్స్, రిపబ్లిక్ ఫోర్జ్, ఎ.పి స్కూటర్స్, సి.సి.ఐ సిమెంట్ ఫ్యాక్టరీ, అదిలాబాద్ వంటి వాటిని నిర్దాక్షిణ్యంగా మూసివేసారు. హిందుస్తాన్ కేబుల్స్ లిమిటెడ్, హిందుస్తాన్ ఫర్టిలైజర్స్, హిందుస్తాన్ ఫోటో ఫిలిమ్స్, హిందుస్తాన్ ఫ్లోరా కార్బన్, హిందుస్తాన్ ఆర్గానిక్ కెమికల్స్, తుంగబద్ర స్టీల్స్, హెచ్.ఎమ్.టి వాచెస్, హెచ్.ఎమ్.టి బేరింగ్స్‌లను ఖాయిలా పడేసారు. కంపెనీల మూసివేతల, ఖాయిలాల నడుమ వేలాదిమంది కార్మికుల నోటికాడి బువ్వను కొల్లగొట్టారు. 90ల తర్వాత కేంద్రంలో ఏర్పడిన కాంగ్రెస్, నేషనల్ ఫ్రంట్, ఎన్.డి.ఎ, యూ.పి.ఏ-1,2 నేటి ఎన్.డి.ఎ దాకా ఏ ప్రభుత్వాలు, ఏ ఐక్య కూటములు అధికారంలోకి వచ్చినా ఎల్.పి.జి విధానాల అమలు విషయంలో అందరి వైఖరి ప్రజావ్యతిరేకమైనదే. ఎందుకంటే అవన్నీ ఒకే తానులోని ముక్కలే. మోడీ అధికారంలోకి వచ్చిన మూడు నెలలలోపే 43వేల కోట్ల

రూపాయల ప్రభుత్వ రంగ వాటాలను టోకున ప్రైవేటు కార్పోరేట్ కంపెనీలకు అమ్మివేసారు. యూ.పి.ఎ ప్రభుత్వం ఇది వరకే ఖాయిలా పడేసిన 79 పబ్లిక్ సెక్టార్ యూనిట్ల మూసివేతకు ఎన్.డి.ఎ ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ ప్రస్తుతం 5 పబ్లిక్ సెక్టార్ యూనిట్లను (హెచ్.ఎమ్.టి బేరింగ్స్, హెచ్.ఎమ్.టి వాచెస్, హెచ్.ఎమ్.టి చినార్, తుంగబంద్ర స్టీల్స్, హిందుస్తాన్ కేబుల్స్ లిమిటెడ్) నిర్వహణకోసం ఇప్పటికే 400కోట్లు ఖర్చు చేశామనీ, ఇక ఎంతమాత్రం వాటిని నడపలేమని బాహాటంగానే ప్రకటిస్తున్నాడు. 5 పి.ఎస్.యూలలోనే మైనారిటీ వాటాలను విక్రయించడం ద్వారా 41వేల కోట్లు వ్యూహాత్మక వాటాలను విక్రయించడం ద్వారా 29వేల ఐదువందల కోట్లు మొత్తం 69వేల ఐదువందల కోట్ల రూపాయలను 2015 ఆర్థిక సంవత్సరంలోనే సంపాదించుకుంటామని కార్యాచరణలోకి దిగారు. పై 5 పి.ఎస్.యూలను మూసివేయడం ద్వారా మరో 2,800మంది కార్మికులు రోడ్డున పడి అసంఘటిత రంగంలో చేరిపోతారు. ప్రజాసంక్షేమమే మా ధ్యేయమంటూ ప్రభుత్వరంగ సంస్థలను పరాయీకరిస్తున్నారు. కార్మికుల శ్రమ ఫలితమైన పరిశ్రమల స్థిర, చరాస్తులను అప్పనంగ అమ్మివేస్తూ ఆర్థిక వనరులు సమకూర్చుకుంటున్న పాలకుల వైఖరిని ప్రజలందరూ గమనిస్తూనే ఉన్నారు.

దేశవ్యాపితంగా ఉన్న 4.7కోట్ల చిన్న తరహా కార్మాగారాలు, 10కోట్ల అరవై లక్షల మంది కార్మికులకు ఉపాధినిస్తూ 6వేల రకాల దేశీయ ఉత్పత్తులను ఉత్పత్తి చేసేవి. ఇందులో పని చేసే కార్మికులకు పని భద్రత లేకపోయినా రెగ్యులర్ కార్మికులకుండే ఏ సౌకర్యాలు లేకపోయినా కనీసం ఒక పూట తిండయిన దొరికేది. కానీ ఈ రెండున్నర దశాబ్దాల కాలంలో కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ఎల్.పి.జి విధానాలు యూ.పి.ఎ ప్రభుత్వం తీసుకొచ్చిన సెజ్‌ల చట్టంతో దేశంలోకి వేలాది బహుళజాతి సంస్థలు అడుగుపెట్టాయి. అనేక కంపెనీలు పెట్టుబడుల ఏకీకరణ పేరుతో బడా పారిశ్రామిక సంస్థలుగా అవతరించాయి. ఎమ్.ఎన్.సిలు, ఎస్.ఇ.జడ్‌లు, ఈ.పి.జడ్‌లు ఉత్పత్తి చేస్తున్న బహుళ ఉత్పత్తుల (మల్టీ బ్రాండెడ్) దెబ్బకు చిన్న తరహా పరిశ్రమలన్ని కుప్పకూలిపోతున్నాయి. అందులో పని చేసే కార్మికుల బతుకులు చినిగిన విస్తరిలా తయారవుతున్నాయి. నిన్నటి అవిభజిత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో చిన్న తరహా పారిశ్రామిక రంగం తీవ్ర సంక్షోభానికి గురై సుమారుగా 5లక్షల మంది కార్మికులు ఉపాది కోల్పోయి రోడ్డున పడ్డారు. రెండున్నర దశాబ్దాలుగా అమలవుతున్న ప్రపంచీకరణ విధానాలు చిలికి చిలికి గాలివాన అయినట్లు చిన్నతరహా పారిశ్రామికరంగం ఉనికి ప్రశ్నార్థకంగా మిగిలిపోయింది.

సంఘటితమైన కార్మికవర్గం రోజురోజుకు ఘనీభవిస్తుంటే అసంఘటిత కార్మికవర్గం సంఖ్య కుప్పలు తెప్పలుగా పెరిగిపోతుంది. ఒకవైపు వ్యవసాయ రంగంలో వస్తున్న సంక్షోభాల కారణంగా లక్షలాది మంది పట్టణాలకు వలసబోయి అసంఘటిత రంగంలో చేరిపోతుంటే మరోవైపు గ్లోబలైజేషన్ ప్రభావంతో ఏర్పడుతున్న పారిశ్రామిక సంక్షోభం కారణంగా లక్షలాది మంది రెగ్యులర్ కార్మికుల కొలువులు పోయి రోజుకూలీ, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులుగా చివరికి నిర్మాణరంగంలో పారకాళ్ళుగా మారి అసంఘటిత రంగంలో చేరిపోతున్నారు. మొత్తం దేశ జనాభాలో ఈ రంగం 40కోట్లకు చేరుకున్నది. అందులో 3.1కోట్లమంది కేవలం భవన నిర్మాణ రంగంలోనే పని చేస్తున్నారనేది బూర్జువా ప్రభుత్వాల గణాంకాలే తెలియజేస్తున్నాయి. ఈ రంగంలోని కార్మికులు సుమారుగా 120 రకాల వృత్తులలో పని చేస్తున్నారని తెలుస్తుంది. మహానగరాలు, చిన్న, మధ్య రకమైన పట్టణాలలో స్థిరపడుతున్న అసంఘటిత కార్మికవర్గం సంఖ్య రీత్యా అత్యధికమైనది. దేశంలోని మొత్తం కార్మిక జనాభాలో 93 శాతం మంది అసంఘటిత కార్మికులేనని తాజా గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఇది తీవ్రమైన వివక్ష, శ్రమ దోపిడీకి గురవుతూ ఆర్థికంగా, సామాజికంగా, సాంస్కృతికంగా అత్యంత దుర్భరమైన జీవనం గడుపుతున్న వర్గంగా ఆవిర్భవించింది. వీరి దుర్భర జీవితానికి ముంబాయి, సూరత్, బీవాండీ, ఢిల్లీ రైల్వే పట్టాల వెంబడి వుండే 'జోప్డి పట్టీలు' ఇంకా అనేక మురికివాడల జీవితాలే సాక్ష్యం. దేశ స్థూల జాతీయాదాయం(జి.డి.పి)లో వీరి వాటా 62.3 శాతం వున్నప్పటికీ వీరి సామాజిక భద్రత మాత్రం ఎడారిలో నీళ్ళను వెతికినట్లుగా ఉంది. వీరిలో కేవలం 0.4 శాతం మంది కార్మికులు మాత్రమే పి.ఎఫ్ సదుపాయాలు పొందుతున్నారు. ఈ రంగానికి సామాజిక భద్రత కల్పించాలని 10వ పంచవర్ష ప్రణాళిక(2002-2007)లో ప్రస్తావించారు. కానీ అప్పటినుండి చట్టసభలలో సుమారుగా 40 బిల్లులు చట్టరూపం తీసుకున్నారు. కానీ వీరి సామాజిక భద్రతకు సంబంధించిన బిల్లు మాత్రం చట్టానికి నోచుకోలేదు. అసంఘటిత కార్మికులను ప్రజాపోరాటాల నుండి పక్కదోవ పట్టించడానికి వృత్తుల వారిగా సంక్షేమ బోర్డులు ఏర్పాటు చేసి నిప్పులపై నీళ్ల చల్లుతున్నారు. ఇది పుట్టిన నాటి నుండి ఏలుబడిలోకి వచ్చిన ప్రభుత్వాలన్ని దానిపై సవితితల్లి ప్రేమను చూపిస్తూ నిర్లక్ష్యానికి గురి చేస్తున్నారు. అందుకే తీవ్రమైన వివక్ష, నిర్లక్ష్యం, దోపిడీకి గురవుతున్న అసంఘటిత కార్మికవర్గం విప్లవానుకూలమైనది. ఇది దేశంలో కార్మిక రిజర్వు సైన్యంగా ఆవిర్భవిస్తున్నది.

రెండంకెల అభివృద్ధి, నల్లధనం వెలికితీత వంటి నినాధాలతో సామ్రాజ్యవాదుల దేశ బడా బూర్జువా వర్గాల అండదండలతో 2014లో అధికారంలోకి వచ్చిన ఎన్.డి.ఎ నరేంద్రమోడి ప్రభుత్వం 18 నెలల పరిపాలనను గమనిస్తే పరాయికరణే ప్రథమ స్థానంలో ఉంటుంది. అందులో భాగమే డిజిటల్ ఇండియా, మేక్ ఇన్ ఇండియా, స్కిల్ ఇండియా, డెవలపింగ్ ఇండియా కార్యక్రమాలను తీసుకొని ప్రపంచ దేశాలను పర్యటిస్తూ దేశంలోని సహజ, మానవ వనరులను టోకున అమ్మివేయడం, తాకట్టు పెట్టడమే ప్రధాన ధ్యేయంగా పెట్టుకున్నాడు. ఇవన్నీ సామ్రాజ్యవాద, బడా బూర్జువా

వర్గాల అభివృద్ధి కోసం తీసుకొస్తున్నవే. అందుకే ఇవన్నీ కార్మిక వ్యతిరేకమైనవే. మోడీ న్యూయార్క్ మ్యాడిసన్ స్కయర్ గార్డెన్ నుండి మొదలుకొని లండన్‌లోని వింబ్లి స్టేడియం వరకు చేసిన 23 ప్రసంగాలలో "మీరు మీ పెట్టుబడులు భారత్‌లో పెట్టండి. ఇండియాలో తయారు చేయండి. మీ వాణిజ్య వ్యాపారాలకు అడ్డంకిగా ఉన్న కార్మిక, న్యాయ, పర్యావరణ పరమైన అడ్డంకులన్నింటిని వెంటనే తొలగిస్తాం. మా దేశం అతి వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశం. మా దగ్గర సహజ, మానవ వనరులకు కొదవే లేదు" అంటూ బాజాలు బజాయిస్తున్నాడు. ఒకవైపు దేశాన్ని అమ్మే ప్రయత్నాలు సుడిగాలి కంటే వేగంగా చేపడుతూనే మరోవైపు మేక్ ఇన్ ఇండియా వల్ల లక్షలాది ఉద్యోగాలు దొరుకుతాయని అసత్యాలు ప్రచారం చేస్తున్నాడు. నైపుణ్య భారత్ పేరుతో భారత్‌ను మానవ వనరుల కేంద్రంగా తయారు చేస్తాం. 2022 నాటికి 40కోట్ల మందికి నైపుణ్య శిక్షణ ఇచ్చి వారికి ఉపాధి అవకాశాలు కల్పిస్తామని ప్రజల్ని మభ్యపెడుతున్నాడు. స్కిల్ ఇండియా అంటే మేక్ ఇన్ ఇండియాలో భాగంగా ఇక్కడికి వచ్చే సామ్రాజ్యవాద, బహుళజాతి కంపెనీలకు నోరులేని బానిస కార్మికులను తయారు చేసి అప్పగించడమే. ఇప్పటికే దేశంలో ప్రతి ఏటా లక్షలాది మంది యువత ఇంజనీరింగ్ కోర్సులను పూర్తిచేసుకొని, పట్టాలు చేత పట్టుకొని ఉద్యోగాల వేటలో కంపెనీల చుట్టూ గిరికీలు కొడుతున్నారు. ఒక ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే ప్రతి ఏటా 4వేల మంది చదువుకున్న యువత ఉపాధి అవకాశాలు లేక బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. డిగ్రీలు పొందిన యువ ఇంజనీర్‌లను పక్కన పెట్టి ప్రాథమిక ఐ.టి.ఐ స్థాయిలోని నైపుణ్యాలను అందించి ఉద్యోగాలు కల్పిస్తామంటున్నారు. నిజంగానే కంపెనీలకు కావలసింది డిగ్రీలు పూర్తి చేసుకున్న మాస్టర్ ఇంజనీర్లు కాదు, వాళ్ళ యంత్రాలను అర్థం చేసుకుని వాటిని నడపగలిగే ఎట్టి బానిసలే. అందుకే సామ్రాజ్యవాద కంపెనీలకు మరయంత్రాలను తయారు చేసి అప్పగించే నైపుణ్య భారత్ చాలా ప్రతిష్టాత్మకమైందని మోడి పదే పదే అంటున్నాడు.

ఇక డిజిటల్ ఇండియా విషయానికొస్తే ఇది ప్రపంచ బ్యాంకు సూచనల్లో ఒకటి. బ్రాడ్ బ్యాండ్ సేవలను 10శాతం పెంచగల్గితే దేశం రెండంకెల అభివృద్ధికి చేరుకుంటుందని డిజిటల్ ఇండియా లక్ష్యం. 2019 నాటికి దేశంలోని సగం జనాభాకు డిజిటల్ సేవలందించాలని 1.13లక్షల కోట్ల పెట్టుబడితో 2.5లక్షల గ్రామాలకు ఆప్టికల్ ఫైబర్ కేబుల్‌ను అందించే లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు. ఇది విజయవంతమైతే నామమాత్రపు చార్జిలకే ఐ స్పీడ్ ఇంటర్‌నెట్‌తో పాటు విద్య, వైద్య, ఈ పాలన, ఎలక్ట్రానిక్ వస్తువుల తయారీ, ఉద్యోగ కల్పన, వ్యవసాయం, ఐ.టి, డి.టి.హెచ్ లాంటి సౌకర్యాలు వేగం పుంజుకుంటాయని గోబెల్స్ ప్రచారం చేస్తున్నారు. వీరి విధానాలు "మింగ మెతుకు లేదు గానీ మీసాలకు సంపెంగనూనే అన్న చందగా ఉన్నాయి. 70 శాతంగా ఉన్న భారత రైతాంగం అన్నమో రామచంద్ర అని అలమటిస్తూ బిక్కు బిక్కుమని బతుకెళ్ళదీస్తున్నారు. పంటలకు పెట్టుబడి లేక, పండిన పంటకు రేట్లు రాక, అమ్మిన పైసలు చేతికి రాక, చేసిన అప్పులు కట్టలేక అడ్డకత్తెరలో పోకచెక్కలై నలిగిపోతున్నారు. ఈ రెండున్నర దశాబ్దాల కాలంలో దేశవ్యాపితంగా 3.5లక్షల మంది రైతులు పురుగుల మందులు తాగి ఉరి తాళ్ళకు వేలాడి బలన్మరణాలకు పాల్పడుతూ పుట్టెడు బాధతో బతుకు బండిని లాగుతున్నారు. రైతాంగ సమస్యలను పరిష్కరించి వారికి పిడికెడు అన్నం పెట్టలేని పాలకులు రైతాంగానికి భూమి, ప్రజాస్వామ్యమనే రెండు మౌళిక సమస్యలు పరిష్కరించలేని పాలకులు గ్రామ గ్రామానికి డిజిటల్ సేవలను అందిస్తామనడంలో ఏ వర్గ ప్రయోజనాలు దాగి ఉన్నాయే అర్థం చేసుకోవచ్చు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి ఏటా లక్షలాది ఖాళీ ఉద్యోగాలను చెత్త బుట్టలో పడేసి ప్రైవేటు కంపెనీలు వారి లాభాల కోసం విసిరేసే నామమాత్రపు అగ్రిమెంటెడ్, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలను తామే కల్పిస్తున్నామంటూ రాజకీయ గారడీలు చేస్తున్నారు. దేశ పాలకులు ఇవాలా సామ్రాజ్యవాద బహుళజాతి కంపెనీలకు మానవ, సహజ వనరులను కారుచౌకగా అందించే ఫెసిలిటేటర్లుగా, బ్రోకర్లుగా చెలామణి అవుతున్నారు.

మేక్ ఇన్ ఇండియా వల్ల పెద్ద ఎత్తున ఉద్యోగాలు వస్తాయనీ, 2019 నాటికి దేశంలో నిరుద్యోగులే ఉండరని పాలకులు అంటున్నదాన్ని నమ్మడం అమాయకమే. పెట్టుబడులు భారత్‌కు రావడం అనేది 'నభూతో నభవిష్యత్' ఇప్పటివరకు విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులన్ని రియల్ ఎస్టేట్, షేర్ మార్కెట్ (మట్కా వ్యాపారం) ఇన్సురెన్స్, బ్యాంకింగ్, ఐ.టి రంగాలలోకే వస్తున్నాయి. ఎఫ్.ఐ.ఐలు దేశాన్ని దోచుకోవడానికి అవసరమైన రోడ్లు, రైల్వేలైన్లు, ఓడరేవులు, విమానాశ్రయాల కోసమే వస్తున్న పెట్టుబడులు. ఈ పెట్టుబడుల వల్ల కార్మికులకు ఒరిగేదేమిలేదు. ఉదాహరణకు స్టార్టప్‌ల అభివృద్ధికి పెట్టుబడులు పెడతానని క్వాల్కమ్. 5లక్షల గ్రామాలకు బ్రాడ్‌బాండ్ సేవలందిస్తానని మైక్రోసాఫ్ట్, డిజిటల్ అక్షరాస్యతతోపాటు 500ల రైల్వేస్టేషన్లలో వై.ఫై సదుపాయం కల్పిస్తామని గూగుల్‌లు ముందుకు వచ్చాయి. ఇవేవి కూడా తయారీ రంగంలో పెట్టుబడులు పెట్టడం కోసం రావడం లేదు. వారి దగ్గరున్న పరిజ్ఞానంతో దేశ ప్రజలను దోచుకోవడానికే వస్తున్నాయి. మోడీ విదేశీ పర్యటనలోని ప్రధాన ఒప్పందాలన్నీ అణు, రక్షణ, వైమానిక, ఆయుధ, రవాణా, డి.టి.హెచ్, రియల్‌ఎస్టేట్, విద్య, వైద్యం, పర్యాటక, సాంస్కృతిక రంగాలలో ఎఫ్.డి.ఐల ప్రవేశం కోసమే. ఎన్.డి.ఎ పరిపాలన మొదలైన తరువాత నిర్మాణరంగంలో ఎఫ్.డి.ఐలకు పరిమితిని పూర్తిగా తొలగించారు. రక్షణ, ప్రాంతీయ ఏయిర్‌లైన్స్, రైల్వే, భీమా, చిల్లర వర్తకంలో 49శాతం, కేబుల్ డి.టి.హెచ్ రంగాలలో 100శాతం, లోకల్ ప్రైవేట్ బ్యాంకులలో 74శాతం ఎఫ్.డి.ఐలకు అవకాశం కల్పిస్తూ కేంద్రప్రభుత్వ ఆమోదం తెలిపింది. ఒకటి అర కంపెనీలో తయారీ రంగంలోకి వచ్చినా అవి భారీ శాస్త్ర సాంకేతికతలతో నిర్మించబడేవే. వాటికి మానవ వనరుల అవసరం చాలా పరిమితమే. ఇదంతా అభివృద్ధి చెందిన అమెరికా, రష్యా,

జపాన్, జర్మనీ, ఫ్రాన్స్‌లాంటి అనేక దేశాల్లో వచ్చిన అనుభవమే. హై మెకనాయిజ్డ్ కంపెనీల అభివృద్ధి అక్కడి లక్షలాది మంది కార్మికులను రోడ్డున పడేసింది. ఆ కార్మికులంతా ఉద్యోగ రక్షణ కోసం పోరాటాల బాట పట్టిన చరిత్రను మనం చూస్తూనే ఉన్నాం. దేశాన్ని పరాయీకరించే విషయంలో పాలకులకు ఉన్న నిర్మాణాత్మకమైన శ్రద్ధ కార్మిక, కర్షకుల అభివృద్ధి పట్ల వీసమెత్తయిన లేదని చెప్పవచ్చు. ఎఫ్.డి.ఐలు, ఎఫ్.ఐ.ఐలు, స్టార్టప్‌లు, ఒకటిఅర తయారీ రంగంలో పెట్టుబడులను పెట్టే సంస్థలను చూపించి ఇదంతా దేశంలోని నిరుద్యోగ యువత, కార్మికుల ఉపాధి కోసమేనని ప్రజలను నమ్మబలకచూస్తున్నారు. ఇవన్నీ ప్రజావ్యతిరేక, కార్మికవ్యతిరేక విధానాలే.

మోదీ విదేశీ పర్యటనలల్లో చేసుకున్న రవాణా రంగ ఒప్పందాల అమలు కోసమే రైల్వేలను పునర్వవస్థీకరించడం అనేది తెర మీదికి తెచ్చాడు. రైల్వేల పునర్వవస్థీకరణపై అధ్యయనం చేయడానికి నీతి ఆయోగ్ (అవినీతి ఆయోగ్) సభ్యుడైన బిబేక్ దేబ్రాయ్ నేతృత్వంలో ఒక సంఘాన్ని ఏర్పర్చింది. ఆ సంఘం 300ల పేజీలతో కూడిన నివేధికను కేంద్ర క్యాబినేట్‌కు సమర్పించింది. అందులో

1. రైల్వేలో ప్రైవేటు సంస్థలకు ప్రవేశం కల్పించాలి.

2. అనుబంధ సేవలైన స్కూళ్ళు, హాస్పిటళ్ళు, క్యాటరింగ్, స్థిరాస్తి అభివృద్ధి, లోకోమోటివ్, రైల్‌బోగి తయారీలను రవాణా సేవల నుండి వేరు చేయాలి.

3. స్వాతంత్ర నియంత్రణ పరిధిలోకి వచ్చే విధంగా ప్రైవేటు సంస్థల ప్రవేశానికి అవకాశం కల్పించాలి.

4. రైల్వేల నిర్మాణ కార్యక్రమాలు, రైలు కార్యకలాపాలు, రైళ్ళ తయారీ యూనిట్‌లను వేరు చేయాలి.

5. రైల్వే రక్షణ బలగాలను ప్రధాన బలగాల నుండి వేరు చేయాలి.

6. రైల్వే భద్రతకు ప్రైవేటు బలగాలను ఉపయోగించేలా జనరల్ మ్యానేజర్ అభిప్రాయాలను తీసుకురావాలి.

7. ఈ సిఫార్సులను 5సం॥లు అమలు చేస్తే తరువాత కాలంలో రైల్వేల కోసం ప్రత్యేకమైన బడ్జెట్‌లను కేటాయించుకోవలసిన అవసరం ఏమి ఉండదని సిఫార్సు చేసింది.

పై ఏడు సిఫార్సులను గనక అమలు చేస్తే భారతదేశంలోని అతి పెద్ద సంఘటితమైన రైల్వే కార్మికవర్గం ఉనికి ప్రశ్నార్ధకంగా మారుతుంది. అందులోని వర్క్‌షాప్ కార్మికులు, టీచర్లు, డాక్టర్లు, క్యాటరింగ్ వర్కర్లు, కార్యనిర్వహణ ఉద్యోగులు ఆర్.పి.ఎఫ్ పోలీసుల జీవితాలు రోడ్డున పడతాయి. తస్మత్ జాగ్రత్త !

కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు ఎల్.పి.జి విధానాలను అమలు చేయడంలో భాగంగా వాటి పరిధిలోనే వివిధ కార్మిక చట్టాలను సవరించడంపై దృష్టి సారించారు. కార్మికులు వీరోచితంగా పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలలోని 44 చట్టాలను సవరిస్తూ 5 ఏకీకృత చట్టాలుగా రూపొందించడానికి ఎన్.డి.ఎ ప్రభుత్వం ప్రయత్నాలను వేగవంతం చేస్తుంది. ఎందుకంటే మేక్ ఇన్ ఇండియాలో భాగంగా దేశానికి వచ్చే నామమాత్రపు పెట్టుబడులకు, ఎఫ్.డి.ఐలకు ఇక్కడి కార్మిక చట్టాలు అడ్డంకి. వాళ్ళకు నోరు మూసుకొని సచ్చిన పేనులాగా పడుండి చమటను దారపోసే బానిసలు కావాలి. కార్మికుల హక్కుల పేరుతో సమ్మెలు, పోరాటాలు చేస్తే వారి పెట్టుబడి సంచాయనం స్థంబిస్తుంది. అందుకనే సామ్రాజ్యావాద బహుళజాతి కంపెనీల పెట్టుబడి సంచాయనానికీ, దోపిడీకి అడ్డంకి అనుకునే ప్రతి చట్టాన్ని సవరించి వారికి అనుకూలమైన విధానాలను రూపొందించడంలో దేశ దళారీ బూర్జువా వర్గం 'జీ హుజూర్' అంటూ వారి ఆజ్ఞలను శిరసా వహిస్తుంది.

'నవ్యాంధ్ర నిర్మాణమే ధ్యేయం, ప్రజల సంక్షేమమే మా లక్ష్యం' అంటూ ఉపన్యాసాలను ఊదరగొడుతున్న తెలుగుదేశం ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాసి పెట్టుబడి అనుకూల విధానాలను ముందుకు తెస్తున్నది. విశాఖలో సి.ఐ.ఐ పేరుతో తెలుగుదేశం నిర్వహించిన పబ్లిక్, ప్రైవేట్ భాగస్వామ్య సదస్సులో దేశీయ, సామ్రాజ్యావాద బడా కంపెనీలతో 4.1 లక్షల, కోట్ల డాలర్ల పెట్టుబడితో కూడిన 331ఒప్పందాలపై సంతకం చేసింది. ఈ కంపెనీల ఒప్పందాలన్ని దోపిడీకి మార్గం సుగమం చేసి అవసరమైన సౌకర్యాలు కల్పించడానికే కార్మిక, పర్యావరణ చట్టాలలో అనేక సవరణలు చేయడానికి పరుగులు పెడుతున్నది. అందులో భాగంగానే విద్యుత్‌తో నడిపే సంస్థలలో 10 మంది కార్మికులు, విద్యుత్ లేకుండా నడిపే సంస్థలలో 25 మంది కార్మికులు ఉంటే దాన్ని కర్మాగారం అనాలని పారిశ్రామిక విధానాల చట్టం చెబుతుంది. ఎ.పి ప్రభుత్వం దాన్ని సవరిస్తూ 10 మంది స్థానంలో 20 మందిని, 25 స్థానంలో 40 మందికి పెంచింది. ఈ సవరణతో రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది మంది కార్మికులకు పారిశ్రామిక విధానాల చట్టం వర్తించదు. ఒక్క శ్రీకాకుళం జిల్లాలోనే 33వేల మంది జి.డి పిక్కల కార్మికులు వేలాది మంది బియ్యం, నూనెమిల్లు కార్మికులతో పాటు ఇటుక పరిశ్రమ, కంచు, ఇత్తడి, కొబ్బరి, వెదురు కార్మికులకు ఈ చట్టం వర్తించదు. వీళ్ళందరూ యాజమాన్యం కింద ఏ హక్కులు లేని బానిసలవలె పని చేయవలసిందే. గత చట్టంలో వంద మంది పని చేసే పరిశ్రమను యజమాన్యం మూసివేయాలనుకుంటే రాష్ట్ర ప్రభుత్వ అనుమతి తీసుకోవాలి. కంపెనీ ఎందుకు మూసివేస్తున్నారో కారణాలు చెప్పాలి. కార్మికులకు చట్టప్రకారం నష్టం జరగకుండా అన్ని చర్యలు తీసుకోవాలి. దాన్ని 300ల మందికి పెంచుతూ సవరణ చేయబోతున్నాయి. ఈ సవరణ గనక జరిగితే 299లోపు పని చేసే ఏ పరిశ్రమనైనా ఎటువంటి ప్రభుత్వ అనుమతులు లేకుండానే లాకౌట్ చేసి కార్మికులను నిర్ధాక్షిణ్యంగా ఇంటికి పంపించవచ్చు. 2014లో తూర్పు గోదావరిలోని ఈస్ట్ కోస్ట్ జూట్ మిల్లుకు లేఆఫ్ ప్రకటించి 2015 డిసెంబర్‌లో మూసివేసారు. విజయనగరంలోని అరుణ్ జూట్ మిల్లును కార్మిక చట్టాలకు విరుద్ధంగా ఒక నెల ముందు లేఆఫ్ ప్రకటించి వెంటనే మూసివేసారు. నోవర్క్–నోపే అంటూ కార్మిక చట్టాల్లో ఎక్కడా లేని తప్పుడు

విధానాలను ముందుకు తెచ్చి 5900ల మంది కార్మికులను నిర్ధాక్షిణ్యంగా ఇంటికి పంపించారు. ఈ పరిశ్రమలు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై ప్రభుత్వం, కోర్టు కనీసంగానైనా జోక్యం చేసుకోలేదు. ఎందుకంటే కోర్టులు, చట్టాలు, ప్రభుత్వాలన్నీ కలిగినోళ్ళకు చుట్టాలే గనక.

60 ఏండ్ల ప్రజల వీరోచిత ప్రజల పోరాటల ద్వారా సాధించుకున్న తెలంగాణా రాష్ట్రాన్ని 'బంగారు తెలంగాణ'గా అభివృద్ధి చేస్తానంటూ ఊకదంపుడు ఉపన్యాసాలిస్తున్న కె.సి.ఆర్ ఉమ్మడి రాష్ట్రంలో మూతబడిన అనేక ప్రభుత్వ రంగ సంస్థలను (రాష్ట్ర పరిధిలోనివి) తెరిచి తెలంగాణలో నిరుద్యోగ యువతకు, గతంలో కొలువులు పోయిన కార్మికులకు ఉపాధి కల్పించవలసిన టి.ఆర్.ఎస్ ప్రభుత్వం తెలంగాణ నూతన పారిశ్రామిక విధానాన్ని ముందుకు తెచ్చింది. కోటి 50 లక్షల ఎకరాల వ్యవసాయ భూములను బంగారు పళ్ళెంలో పెట్టి పారిశ్రామిక అధిపతుల చేతులకు అందించి కార్మికుల నోట్లో మట్టి కొడుతున్నది. కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు ఎల్.పి.జి విధానాలను అమలు చేయడం కోసం ప్రభుత్వ రంగ సంస్థలను దివాళా తీయిస్తూ చిన్న, మధ్య తరహా సంస్థల ఉనికిని ప్రశ్నార్థకంగా తయారు చేస్తున్నారు. కార్మిక చట్టాలనూ, హక్కులను తిరగరాస్తూ మేమే నిజమైన కార్మిక శ్రేయోభిలాషులమని ఆమ్ ఆద్మి యోజన, అటల్ పెన్షన్ యోజన, ప్రధానమంత్రి సురక్ష భీమా యోజనా లాంటి రకరకాల పథకాలను ముందుకు తెస్తూ కార్మికులను ప్రజా పోరాటాలనుండి పక్కదారి పట్టిస్తున్నారు. ప్రభుత్వ వ్యతిరేక సమ్మెలలో, పోరాటాలలో పాల్గొనే కార్మికులపై ఎస్మా చట్టాన్ని ప్రయోగిస్తూ కోర్టుల చుట్టూ తిప్పుతున్నారు, జరిమానాలు విధిస్తున్నారు. చివరికి జైలు శిక్షలకు కూడా వెనకాడకుండా సంఘటిత, అసంఘటిత కార్మిక పోరాటాలపై ఉక్కుపాదం మోపుతున్నారు.

కేంద్రరాష్ట్ర ప్రభుత్వాల మధ్యన అధికార ప్రతిపక్షాల మధ్యన ఉన్న బిన్నాభిప్రాయాలన్ని చట్టసభల్లో వారు చేసే ముష్టి యుద్ధాలకే పరిమితం. అవి వాళ్ళ అధికారం కోసం వేసే ఎత్తుగడలు మాత్రమే. ఎల్.పి.జి విధానాల అమలు విషయంలో వారి మధ్యన ఎటువంటి బిన్నాభిప్రాయాలుగానీ, వైరుధ్యాలు గానీ లేవు, ఉండబోవు. ఈ విషయంలో రాజకీయ పార్టీలందరిదీ ఒకే వైఖరి. ప్రజలను నిట్టనిలువునా దోపిడీ చేసే వర్గాల మధ్యనే ఇంత ఐక్యత ఉంటే అడుగడుగునా శ్రమ దోపిడీకీ, వివక్షకు గురవుతున్న సంఘటిత, అసంఘటిత కార్మిక రంగాల మధ్య రెట్టింపు ఐక్యతా, సమన్వయం మైత్రి పెరిగి సంఘటిత శక్తిగా నిలబడాల్సిన అవసరం మన ముందున్నది. అప్పుడే తమ ఆర్థిక సమస్యలను ప్రజాపోరాటాల ద్వారా పరిష్కరించుకుంటూ ఆర్థిక పోరాటాలను రాజకీయ పోరాటాలుగా మలిచి కార్మిక వ్యతిరేకమైన ఎల్.పి.జి విధానాలను ప్రతిఘటించగల్గుతాం. భారత కార్మికోద్యమ చరిత్రలో రెండు పంథాల మధ్య పోరాటం నిరంతరంగా కొనసాగుతూనే ఉంది. నిజమైన విప్లవ పంథా కార్మికులనూ, కార్మికోద్యమాన్ని నిజమైన విప్లవమార్గం వైపు నడిపిస్తుంటే అందులోని రివిజనిజం కార్మికవర్గాన్ని పీకలలోతు రివిజనిస్టు బురదగుంటలోకి గుంజుకుపోతున్నది. కార్మికవర్గాన్ని తప్పుదోవ పట్టిస్తున్నది. విప్లవానికి అడ్డంకిగా నిలబెడుతున్నది. అది నాడు నేడు రేపు ఎప్పుడైనా కార్మిక, విప్లవ వ్యతిరేకమైనదే. అందుకే కార్మిక వ్యతిరేకమైన రివిజనిస్టు పంథానూ, దానికి నేతృత్వం వహిస్తున్న రివిజనిస్టులను బహిర్గతం చేసి దీనిపై నిరంతరం పోరాడినప్పుడే నికార్సయిన విప్లవ కార్మికవర్గంగా నిలబడి విప్లవమార్గం వైపు ప్రయాణించగలుగుతాము.

రోజురోజుకు ప్రపంచ వ్యాప్తంగా సామ్రాజ్యవాదుల మధ్య తీవ్రతరమవుతున్న ఆర్థిక, రాజకీయ సంక్షోభాలు ప్రపంచ విప్లవ పరిస్థితులు అనుకూలంగా వున్నాయని తెలియజేస్తున్నాయి. సామ్రాజ్యవాద దేశాలలోని ఆర్థిక సంక్షోభాల ప్రభావానికి భారత ప్రజలు సైతం అడ్డు అదుపు లేకుండా దోపిడీకి గురవుతున్నారు. ఈ దేశ దళారీ బూర్జువా వర్గపు 60 ఏండ్ల పరిపాలన 25 ఏండ్ల గ్లోబలైజేషన్ విధానాల అమలు ప్రజల, కార్మికుల బతుకులను దుర్భరమైన దారిద్ర్యంలోకి నెట్టేసింది. లక్షలాది మంది ప్రజలను నిర్వాసితులను చేసింది. లక్షలాది మంది కార్మికులను ఉపాధి నుండి గెంటివేసింది. కోట్లాది మంది పీడితులను బలోన్మరణాలపాలు చేసింది. భారత పార్లమెంటరీ రాజకీయాల పట్ల ప్రజల తీవ్రమైన వ్యతిరేకత, నిరసన, అసహ్యం, అసహనం బద్ధలవుతున్నాయి. ప్రజల ప్రతిఘటన లేని రోజులులేవు. ప్రతి వర్గానికి వుండే సమస్యలు ప్రజా ఉద్యమాల ద్వారానే పరిష్కరించుకుంటున్నారు. ప్రతిఘటించడమనేది ప్రజల రోజువారి దినచర్యగా మారిపోయింది. భారత కార్మికవర్గానికి బూర్జువావర్గం పట్ల భ్రమలు ఆరంభంలోనే తొలగిపోయాయి. అందుకే కార్మికవర్గం నాటి నయా రివిజనిజాన్ని బద్దలు కొట్టి నిజమైన విప్లవశక్తిగా నక్సల్బరీ నిప్పురవ్వలు రాజుకున్నాయి. కార్మికవర్గమే సమాజాన్ని విముక్తి చేస్తుందనే నమ్మకం ప్రజల్లో బలపడింది. నాటి నుండి భారత కార్మికవర్గం అనన్యమైన త్యాగాలకు వెరవకుండా వీరోచితమైన ప్రజాపోరాటాలను నిర్వహిస్తున్నది. నేటి అగ్రరాజ్యాల ఆర్థిక సంక్షోభం విప్లవానుకూల పరిస్థితుల్లో వర్గపోరాటాన్ని ఉధృతం చేయవలసిన బాధ్యత భారత కార్మికవర్గంపై మరింత పెరుగుతున్నది. కార్మికవర్గానికి ప్రపంచంలో రెండు సోషలిస్టు విప్లవాల (1917 నాటి రష్యా సోషలిస్టు విప్లవం, 1945 నాటి చైనా విప్లవం)ను విజయవంతం చేసిన చరిత్ర ఉన్నది. ఎందుకుంటే కార్మికవర్గం వర్గచైతన్యం కలిగినది. క్రమశిక్షణా, సమయపాలన, ధృడసంకల్పం, సమిష్టితత్వం కలిగినది. మరీ ముఖ్యంగా ఇది సొంత ఆస్తిపట్ల మమకారం లేనటువంటిది. అందుకే కార్మికవర్గమే విప్లవానికి నాయకత్వం వహించాలని మన మార్క్సిస్టు మహోపాధ్యాయులు నొక్కి చెప్పారు. రష్యా, చైనాల కార్మికవర్గం వలనే భారత కార్మికవర్గం తనను తాను విముక్తి చేసుకుంటూ సమాజాన్ని విముక్తి చేస్తుంది. బూర్జువా రాజ్యాంగ యంత్రాన్ని ధ్వంసం చేసి నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని అనంతరం సోషలిస్టు విప్లవాన్ని సాధిస్తుంది. ఇది ఒక చారిత్రక నియమం. బో

# ఒక చిన్న నిప్పురవ్వ బ్రహ్మాండమయిన దావానలాన్ని సృష్టించగలదు

## (జనవరి 5, 1930)

ప్రస్తుత పరిస్థితిని, దానికి సంబంధించిన సమస్యలను పరిష్కరించుటకు, సరిగ్గా అంచనా వేయటంలోనూ, ఎలాంటి చర్యలు తీసుకోవాలో నిర్ణయించుకోవటంలోనూ, కొంత మంది కామ్రేడ్స్ ఇప్పటికీ విఫలమవుతున్నారు. విప్లవ పెను తుఫాను వచ్చి తీరుతుందని వారు నమ్ముతున్నప్పటికీ, అది కొద్ది రోజులలోనే వచ్చి తీరుతుందని వారు విశ్వసించటం లేదు. అందువల్లే కియాంగ్సీని ఆక్రమించుటకు వేసిన ప్లానును వ్యతిరేకిస్తున్నారు. ఫుకియెన్, క్వాంటుంగ్, నికియాంగ్సీ సరిహద్దులలో మూడు ప్రాంతాలలోనూ, తిరుగుబోతు గెరిల్లా చర్యలను వారు ఆమోదిస్తున్నారు. అదే సమయంలో గెరిల్లా ప్రాంతాలలో కమ్యూనిస్టుల నాయకత్వాన రాజకీయాధికారాన్ని స్థాపించుకోవటం యొక్క ప్రాముఖ్యతను లోతుగా అర్థం చేసుకోకపోవటం వల్ల, విముక్తి ప్రాంతాన్ని బలపర్చుకొని, విస్తృతపరుచుకోవటం ద్వారా దేశవ్యాపిత విప్లవోధృతిని వేగిరపరచాలనే భావాన్ని లోతుగా అర్థం చేసుకోలేకపోతున్నారు. విప్లవోద్యమం వున్నత దశకు చేరుకోవడం దగ్గరి భవిష్యత్తులో జరుగదని, అందువల్ల చాలా కష్టపడి విప్లవ కేంద్రాన్ని ఒకచోట స్థాపించడం అవసరమైన శ్రమ అనే భావించుతారు. నిలకడలేని గెరిల్లా చర్యలు అనే సులభమైన పద్ధతి ద్వారా, రాజకీయ పలుకుబడిని విస్తృత పరుచుకోవాలని సూచిస్తున్నారు. దేశ వ్యాప్తంగా ప్రజలందరినీ, లేదా దాదాపు అందరినీ మనవైపు తిప్పుకున్న తర్వాత, దేశవ్యాపిత సాయుధ తిరుగుబాటుకు ప్రయత్నించాలని, అందులో ఎర్రసైన్యం పాల్గొనడం ద్వారా అది దేశవ్యాపిత విప్లవంగా రూపొందుతుందని, వీరు భావించుతున్నారు. దేశవ్యాపితంగానూ, అన్ని ప్రాంతాలలోనూ, మొదట ప్రజలను మనవైపు తిప్పుకోవాలని, ఆ తర్వాత రాజకీయాధికారాన్ని స్థాపించుకోవాలని సూచించే వీరి సిద్ధాంతము, చైనా విప్లవం యొక్క వాస్తవ పరిస్థితులకు ఏ మాత్రం సరిపడదు. చైనా అర్ధవలస దేశమని, దీనిపై పెత్తనాలకు వివిధ సామ్రాజ్యవాదులు పోటీ పడుతున్నారని, వీరు స్పష్టంగా అర్థం చేసుకోక పోవటంవల్లనే, అ సిద్ధాంతము వుత్పన్నమవుతుంది. దీనిని స్పష్టంగా అర్థం చేసుకుంటే చైనాలో మాత్రమే, పాలక వర్గాల మధ్య క్లిష్టమైన దీర్ఘకాల యుద్ధం ఎందుకు చెలరేగుతున్నది, ఈ యుద్ధంలో రోజు రోజుకు తీవ్రమై విస్తృతమగుతుండేది, దేశం మొత్తంపై అధికారం కలిగిన ఒకే ప్రభుత్వం ఎందుకు లేకుండా పోయింది, సులభంగానే అర్థం చేసుకోగలుగుతాం. రెండవది: రైతు సమస్య యొక్క తీవ్రతను అర్థం చేసుకోగలుగుతారు. దేశవ్యాపితంగా ఈ రైతాంగ తిరుగుబాట్లు ఈనాటి స్థాయికి ఎలా అభివృద్ధి చెందాయో, అర్థం చేసుకోగలుతారు, మూడవది: కార్మికుల, రైతుల ప్రజాస్వామిక రాజకీయాధికారం స్థాపించాలనే నినాదం సరైనదని గుర్తించగలుగుతారు. నాల్గవది: చైనాకున్న ప్రత్యేక స్వభావం – ఎర్రసైన్యం, గెరిల్లా దళాలు – దళాలు ఏర్పడి వృద్ధి చెందటం, దీనితోపాటు దోపిడివర్గ ప్రభుత్వంతో చుట్టివేయబడిన విముక్తి ప్రాంతాలుండటం, అర్థం చేసుకోగలుగుతారు. మొదటి కారణం నుండే ఇది ఉద్భవించింది. (పాలక వర్గాల మధ్య క్లిష్టమయిన, దీర్ఘమయిన యుద్ధ పరిస్థితి చైనాలో మాత్రమే వుండటం.) ఐదవది: ఎర్రసైన్యం, గెరిల్లా దళాలు, విముక్తి ప్రాంతాలు ఏర్పడి వృద్ధి పొందటం, కార్మికవర్గ నాయకత్వాన సాగుతున్న రైతు పోరాటం యొక్క అత్యున్నత దశయని, అర్ధ వలస దేశంలో రైతు పోరాటం విధిగా ఈ రూపం తీసుకుంటుందని, ఈ పోరాట రూపం దేశవ్యాపిత విప్లవోద్యమాన్ని తీవ్రపరిచే అతి ముఖ్యమైన సాధనమని తప్పక గుర్తించగలుగుతారు. ఆరవది: ఎక్కడా కాలూనకుండా, ఎల్లప్పుడు ఒక చోటనుండి మరొక చోటికి పరుగెత్తుతూ సాగించే గెరిల్లా కార్యక్రమం దేశవ్యాపిత విప్లవోద్యమాన్ని పెంచుటకు తోడ్పడదని కామ్రేడ్స్ ఛూటే, మావో–సే–టుంగ్, పాంగ్–చి–మిన్‌ల పంథా ఒక్కటే సరైందని గుర్తించగలుగుతారు. విప్లవ స్థావరాల నేర్పరుచుటకు, ఒక క్రమపద్ధతిన రాజకీయాధికారాన్ని స్థాపించుటకు, వ్యవసాయిక విప్లవాన్ని తీవ్రపరుచుటకు, ఆ తర్వాత పట్టణ రెడ్‌గార్డ్సు దళాలు, జిల్లా రెడ్‌గార్డ్సు కౌంటీ రెడ్ గార్డ్సు, స్థానిక ఎర్రసైన్యం, రెగ్యులర్ ఎర్రసైన్యం – ఈ క్రమంలో ప్రజాసైన్యాన్ని క్రమబద్ధంగా పెంచుకోవడం, అలలు అలలుగా ప్రజారాజకీయాధికారాన్ని విస్తృతపరుచుకోవటం ఈ పంథా సరైందని గుర్తించగలుగుతారు. సోవియట్ యూనియన్ ప్రపంచం అంతటిలోని విప్లవ ప్రజల విశ్వాసాన్ని సంపాదించుకున్నట్లుగానే, ఈ పంథా ద్వారా చైనా విప్లవ ప్రజలందరి విశ్వాసాన్ని సంపాదించగలుగుతుంది. ఈ పద్ధతి ద్వారా అభివృద్ధి నిరోధక పాలకవర్గాలకు తీవ్రమైన కష్టాలు కలిగించగలుగుతాయి. వారి పునాదులు కదిలించివేసి, వారి పతనాన్ని త్వరితం చేయగలుగుతాం. ఈ పద్ధతి ద్వారానే, ఎర్రసైన్యాన్ని భవిష్యత్తు విప్లవానికి ప్రధాన సాధనంగా రూపొందించగలుగుతాము. ఒక్క మాటలో చెప్పాలంటే ఈ పద్ధతి ద్వారానే విప్లవోధృతిని త్వరితం చేయగలుగుతాం.

విప్లవ అసహనాన్ని ప్రదర్శించే కామ్రేడ్స్, ప్రతీఘాత విప్లవ శక్తుల బలాన్ని తక్కువ అంచనావేసి, విప్లవ శక్తుల బలాన్ని ఎక్కువ అంచనా వేస్తారు. స్వీయాత్మక ఆలోచన వల్లనే, ఇలాంటి అంచనాలు తయారవుతాయి. అంతిమాన ఇలాంటి అంచనా దుందుడుకు విధానానికి దారితీస్తుంది. మరొకవైపు విప్లవ శక్తుల బలాన్ని తక్కువ అంచనా వేయటం వల్ల, ప్రతీఘాత విప్లవ శక్తుల బలాన్ని ఎక్కువ అంచనా వేయడం వల్ల కూడా మరొక రకమైన తప్పులు దొర్లుతాయి. కనుక చైనాలోని ప్రస్తుత రాజకీయ పరిస్థితిని అంచనా వేయటంలో ఈ కింది విషయాలను దృష్టిలో వుంచుకోవాలి.

1. చైనా విప్లవ శక్తుల బలం ప్రస్తుతం బలహీనంగా వున్న మాట వాస్తవమే. అదే సమయంలో పాలకవర్గాలకు చెందిన అన్ని నిర్మాణ సంస్థలు కూడా (రాజకీయ ప్రభుత్వ యంత్రాంగ, సైన్యం, రాజకీయ పార్టీలు) బలహీనంగానే వున్నాయి. వెనుకబడిన, సాంఘీకంగా, ఆర్థికంగా, బలహీనమైన చట్రం మీద ఇవి ఆధారపడి

వుండటం వల్ల బలహీనంగా వున్నాయి. పశ్చిమ యూరోపులో, చైనాలో కంటే విప్లవ శక్తులు బలంగా వున్నప్పటికీ, అక్కడ అభివృద్ధి నిరోధక పాలకవర్గాలు, అక్కడి విప్లవ శక్తులకంటే, అనేక రెట్లు బలంగా వుండటం వల్ల, ఆ దేశాలలో విప్లవాలు ప్రారంభం కావటంలేదు. చైనా విప్లవ శక్తులు ప్రస్తుతం బలహీనంగా వున్నప్పటికీ, ప్రతీఘాత విప్లవ శక్తులు కూడా సాపేక్షికంగా బలహీనంగా వుండటం వల్ల, చైనా విప్లవం ఉధృతంగా పెరిగి తీరుతుంది.

2. 1927 విప్లవం ఓడిపోవటంతో విప్లవ శక్తులు చాలా బలహీనపడటం వాస్తవమే. మిగిలిన విప్లవ శక్తులు బలహీనంగానే వున్నాయి. ఈ పరిస్థితి మాత్రమే చూసి కొందరు నిరుత్సాహ పడుతుంటారు. కానీ ప్రధాన విషయాలన్నీ పరిశీలించినపుడు పరిస్థితి మరొక విధంగా వుంటుంది. "ఒక చిన్న నిప్పురవ్వ బ్రహ్మాండమయిన దావానలాన్ని సృష్టించగలదు.'' అన్న చైనా సూక్తి మనకు అన్వయించుతుంది. మరొక మాటలో చెప్పాలంటే, మన శక్తులు బలహీనంగా వున్నప్పటికీ, అవి చాలా త్వరగా పెరిగి తీరుతాయి. ప్రస్తుత చైనా పరిస్థితుల్లో అవి పెరగటానికి అవకాశముండటమే కాదు, అవి పెరిగి తీరుతాయి కూడానూ. మే 30 ఉద్యమం, ఆ తర్వాత వచ్చిన గొప్ప విప్లవం దీనినే రుజువు పరుస్తాయి. ఒక విషయాన్ని పరిశీలించేటప్పుడు దాని మూల సారాంశాన్ని పరిశీలించాలి. కానవచ్చే విషయం లోపలికి వెళ్లుటకు తలుపు దగ్గర వుండే ద్వారపాలకుడు మాత్రమే, ఈ తలుపు దాటిన వెంటనే ప్రధానాంశాన్ని పట్టుకోవాలి. ఇదొక్కటే నమ్మదగిన శాస్త్రీయ పరిశీలనా పద్ధతి.

3. అదేవిధంగా ప్రతీఘాత విప్లవ శక్తులను అంచనా వేసుకోవడంలో, వాటి పై ఆకారాన్ని మాత్రమే చూడకూడదు. వాటి ప్రధానాంశాన్ని పరిశీలించాలి. హూనాన్, కియాంగ్సీ సరిహద్దు ప్రభుత్వం ఏర్పడిన ప్రారంభ రోజుల్లో వర్గ శత్రువు యొక్క బలాన్ని హూనాన్ రాష్ట్ర కమిటీ పూర్తిగా తక్కువ అంచనా వేసింది. గడ్డి పోచతో పోల్చింది. ఇది పూర్తిగా తప్పు అంచనా. కొంత మంది కామ్రేడ్స్ నిజంగానే ఈ అంచనాతో ఏకీభవించారు. ఆ సమయంలో (1928 మే నుండి జూన్ వరకు) హూనాన్ పాలకుడు టాటీ-పింగ్‌ను గురించి అంచనా వేస్తూ "అతి బలహీనుడని" "అతి భయస్తుడని" వర్ణించింది. ఇప్పటికీ ఈ పదాలు పరిహాస పదాలుగా మిగిలిపోయాయి. ఇలాంటి అంచనా రాజకీయ రంగంలో విధిగా దుందుడుకు విధానాలకు దారి తీసింది. కానీ ఆ సంవత్సరం నవంబరు నుండి 1929 ఫిబ్రవరి వరకు, ఆ నాలుగు నెలల కాలంలో (చాంకై-షేక్, క్వాంగ్సీ సైనిక భూస్వాముల మధ్య యుద్ధం ప్రారంభం కాకముందు) చింగ్‌కాంగు పర్వతాలపై శత్రువు యొక్క "సంయుక్త అణచివేత దాడి"ని ఎదుర్కోవలసి వచ్చినపుడు, కొంత మంది కామ్రేడ్స్ "ఎర్రజెండాను ఎంతకాలం నిలబెట్టగలుగుతాం?" అని ప్రశ్నించారు. వాస్తవానికి, ఆ సమయంలో, చైనాలో, బ్రిటన్, అమెరికా, జపాన్‌ల మధ్య బహిరంగంగా తగాదా ప్రారంభమయింది. చాంకై-షేక్, క్వాంగ్సీ ముఠా పెంగ్‌యా సియాంగ్‌ల మధ్య క్లిష్టమయిన యుద్ధ పరిస్థితి రాజుకుంటూ వుంది. ప్రతీఘాత విప్లవం తగ్గు ముఖం పట్టిన కాలమిది విప్లవ పరిస్థితి పెరుగుతున్న కాలమిది. అయినా ఎర్రసైన్యంలోనూ, స్థానిక పార్టీలోనూ, నిస్పృహతో కూడిన భావాలు తలయెత్తాయి. కేంద్ర కమిటీ కూడా, పైకి కనపడే విషయాలే చూచి, నిస్పృహతో కూడిన విధానాన్ని చేపట్టింది. కేంద్ర కమిటీ యొక్క ఫిబ్రవరి లేఖ పార్టీలో ఆనాడున్న నిస్పృహతో కూడిన పరిశీలనకు దృష్టాంతం.

4. ఉపరితలాన్ని మాత్రమే చూచి, తన ముందున్న ప్రధానాంశాన్ని గుర్తించలేని కామ్రేడ్స్ తప్పులు చేసే ప్రమాదముంది. ప్రస్తుత భౌతిక పరిస్థితి అలాంటిది. ముఖ్యంగా ఎర్రసైన్యం యుద్ధంలో ఓడిపోయినపుడు, లేదా చుట్టి వేయబడినపుడు, లేదా బలమైన శత్రు సైన్యం చేత తరమబడినపుడు వారు తమకున్న ద్రవ్య కొరతను, పరిమితమయిన, నిర్దిష్టమయిన పరిస్థితిని అతిగా అంచనా వేసుకొంటూ, నిరుత్సాహానికి గురవుతారు. దాని నుండి చైనాలో పరిస్థితి, ప్రపంచ పరిస్థితి మొత్తంగా నిరుత్సాహంగా వున్నట్లుగానే భావించుతూ వుంటారు. అంతేగాక, విప్లవ విజయానికి గల అవకాశాలను తక్కువ అంచనా వేస్తుంటారు. మొత్తం పరిస్థితి యొక్క సారాంశాన్ని గురించి శాస్త్రీయ పరిశీలన లేకపోవటంవల్ల, ఉపరితలాన్ని మాత్రమే చూచి సారాంశాన్ని తోసి వేయడం జరుగుతూ వుంటుంది. విప్లవం వున్నత దశకు అభివృద్ధి చెందుటకు తోడ్పడే వైరుధ్యాలు పెరుగుతున్నాయా? లేదా? అనే అంశంపై చైనాలో విప్లవం వున్నత దశకు త్వరలో చేరుకుంటుందా? లేదా? అనే సమస్య ఆధారపడుతుంది. సామ్రాజ్యవాద దేశాల మధ్య, సామ్రాజ్యవాదులకు - వారి దేశాల్లోని కార్మికులకు మధ్య, వైరుధ్యాలు ప్రపంచ వ్యాపితంగా పెరుగుతున్నాయి. అందువల్ల చైనాపై ఆధిపత్యం సంపాదించుకోవడానికి సామ్రాజ్యవాద దేశాల మధ్య ఘర్షణ తీవ్రంగాక తప్పదు. చైనాపై పెత్తనం కొరకు సామ్రాజ్యవాదుల మధ్య ఘర్షణ పెరిగేకొద్దీ, సామ్రాజ్యవాదానికి మొత్తం చైనా జాతికి మధ్య వైరుధ్యమూ సామ్రాజ్యవాదుల మధ్యనే వైరుధ్యాలు ఒకే సమయంలో పెరుగుతాయి. తత్ఫలితంగా చైనా అభివృద్ధి నిరోధక పాలకవర్గాల వివిధ ముఠాల మధ్య క్లిష్టతరమయిన యుద్ధం రోజు రోజుకు పెరిగి విస్తృతమవుతుంది, వారి మధ్య వైరుధ్యాలు ఇంకా పెరగడానికి దోహదం చేస్తుంది. చైనా అభివృద్ధి నిరోధక పాలకవర్గ ముఠాల మధ్య వైరుధ్యాలు, క్లిష్టతరమయిన యుద్ధ పరిస్థితి తీవ్రమయ్యే కొద్దీ ప్రజలపై పన్నుల భారం పెరుగుతుంది. ఇది అభివృద్ధి నిరోధక పాలకవర్గాలకు, పన్నులు కట్టే విస్తృత ప్రజానీకానికి మధ్య వైరుధ్యాలను తీవ్రం చేస్తుంది. సామ్రాజ్యవాదానికి, చైనా జాతీయ పరిశ్రమలకు మధ్య గల వైరుధ్యం వల్ల, చైనా పెట్టుబడిదారులు సామ్రాజ్యవాదుల నుండి తమకు అనుకూలమైన సదుపాయాలను పొందలేరు. అందువల్ల చైనా పెట్టుబడిదారులు కార్మికులను తీవ్రంగా దోచుకోవడం ద్వారా బయటపడాలని చూస్తారు. దీనిని కార్మికులు ప్రతిఘటించ పూనుకుంటారు. తత్ఫలితంగా, చైనా బూర్జువా వర్గానికి, కార్మిక వర్గానికి మధ్య వైరుధ్యం తీవ్రమవుతుంది. సామ్రాజ్యవాదుల వ్యాపార దాడి తీవ్రం కావటంతో, పెట్టుబడిదారి వ్యాపారస్తుల దోపిడి తీవ్రం కావటంతో ప్రభుత్వ పన్నుల భారం పెరగటంతో, భూస్వామ్య వర్గానికి, రైతులకు మధ్య వైరుధ్యం తీవ్రమవుతుంది. కౌలు రేటు, వడ్డీ రేటు దోపిడీ తీవ్రమవుతుంది. భూస్వాముల ఎడల రైతుల ద్వేషం పెరుగుతుంది. విదేశీ వస్తువుల ఒత్తిడి, కార్మిక రైతు ప్రజాసామాన్యం యొక్క కొనుగోలు శక్తి క్షీణించటం, ప్రభుత్వ పన్నులు పెరగటం వీటి వల్ల చైనాలోని సొంత వస్తూత్పత్తిదారులు దివాళా తీస్తున్నారు. ఆహార పదార్థాలు, నిధులు కొరతగా వున్నప్పటికీ, అభివృద్ధి నిరోధక

ప్రభుత్వం తన సైన్యాలను పెంచుతూ, యుద్ధాన్ని విస్తృత పరుస్తున్నది. అందువల్ల, సాధారణ సైనికులు ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రభుత్వ పన్నులు పెరగటం, భూస్వాముల కౌలు, వడ్డీ రేటు పెరగటం, యుద్ధ విధ్వంసకాండ రోజూ విస్తృతం కావడం, ఎక్కడ చూచినా, కరువు, దొంగతనాలు విస్తృతం అవటం వల్ల, పట్టణ పేద ప్రజల జీవితం దుర్భరమవుతున్నది. అనేక స్కూళ్లు డబ్బు కొరత వల్ల మూసివేయబడి, తమ విద్యకు అంతరాయం ఏర్పడుతుందని విద్యార్థులు భయపడుతున్నారు. ఉత్పత్తి విధానం వెనుకబడి వుండటం వల్ల అనేక మంది పట్టభద్రులకు వుద్యోగావకాశాలు లేవు. ఈ వైరుధ్యాలన్నింటిని మనం అర్థం చేసుకోగలిగితే, చైనా ఆర్థిక పరిస్థితి ఎంత నిరాశా జనకంగా, ఎంత అరాచకంగా తయారైందో స్పష్టమవుతుంది. సామ్రాజ్యవాదులకు, సైనిక ప్రభువులకు, భూస్వాములకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున విప్లవం వచ్చి తీరుతుందని, అది చాలా త్వరలోనే వస్తుందని కూడా మనం అర్థం చేసుకోగలం. చైనా అంతటా ఎండుగడ్డి పరచబడి వుంది. అది మండటానికి సిద్ధంగా వుంది. "చిన్న నిప్పురవ్వ బ్రహ్మాండమైన దావానలంగా మారుతుంది." అనే సామెత ప్రస్తుత చైనా పరిస్థితికి సూటిగా సరిపోతుంది. అనేక ప్రదేశాల్లో చెలరేగిన కార్మిక సమ్మెలు, రైతుల తిరుగుబాట్లు, సైనిక తిరుగుబాట్లు, విద్యార్థుల తిరుగుబాట్లు గమనించితే, ఒక ''నిప్పురవ్వ'' బ్రహ్మాండమయిన దావానలాన్ని సృష్టించగలదని స్పష్టమగుతుంది.

1929 ఏప్రిల్ 5వ తేదీన ఫ్రంటు కమిటీ కేంద్ర కమిటీకి రాసిన లేఖలో పై విషయం యొక్క సారాంశం ఈ కింది విధంగా చెప్పబడింది.

"కేంద్ర కమిటీ లేఖ" (ఫిబ్రవరి 9, 1929) నిరాశలతో గూడిన అంచనాలతో వుంది. భౌతిక పరిస్థితులను, మన శక్తుల బలాన్ని తక్కువగా అంచనా వేస్తుంది. చింగ్‌కాంగ్ పర్వతాలపై కొమింటాంగ్ మూడవ "అణచివేత" దాడి, ప్రతీఘాత విప్లవం యొక్క అత్యున్నత దశ. అయితే, దీనితో అది ఆగిపోయింది. అప్పటి నుండి, ప్రతీఘాత విప్లవ వుధృతం క్రమంగా తగ్గింది. విప్లవ ఉధృతి పెరిగింది. కేంద్ర కమిటీ వివరించిన ప్రకారం పార్టీ పోరాట శక్తి, నిర్మాణ బలం బలహీనపడినప్పటికీ, వాటిని త్వరలోనే పునరుద్ధరించుకోగలం. ప్రతీఘాత విప్లవం తగ్గుముఖం పట్టే కొద్దీ మన కామ్రేడ్స్‌లోని స్థబ్దత త్వరలోనే తొలగిపోతుంది. ప్రజలు మనవైపుకు వచ్చి తీరుతారు. కొమింటాంగ్ అమలు జరుపుతున్న హత్యాకాండ విధానం వల్ల "చేపలు ఇంకా లోతు నీళ్లలోకి" వెళ్లిపోతాయి. సంస్కరణవాదం ప్రజలను ఇంకా ఏ మాత్రం ఆకర్షించలేదు. ప్రజలను తనవైపు తిప్పుకోవడంలో ప్రస్తుత పరిస్థితుల్లో కమ్యూనిస్టు పార్టీతో పోటీ చేయగలిగిన మరొక పార్టీ లేదు. పార్టీ ఆరవ జాతీయ కాంగ్రెసు నిర్ణయించిన రాజకీయ పంథా నిర్మాణ పంథా సరైనవి... ప్రస్తుత విప్లవ దశ సోషలిస్టు దశ కాదు. అది ప్రజాస్వామిక విప్లవ దశ. పార్టీ యొక్క కర్తవ్యం (ఇక్కడ పెద్ద పట్టణాలు అని చేర్చి వుండవలసింది.) తక్షణ సాయుధ తిరుగుబాట్లకు ప్రయత్నించడం కాకుండా, ప్రజలను మనవైపు తిప్పుకోవడానికి కృషి చేయాలి. అయినా విప్లవ పరిస్థితి త్వరత్వరగా అభివృద్ధి చెందుతుంది. సాయుధ తిరుగుబాట్ల కొరకు అవసరమైన ప్రచారం చేయాలి. ఏర్పాట్ల కొరకు మనం ఇప్పటి నుండి పూనుకోవాలి. ప్రస్తుత అరాచక పరిస్థితుల్లో సరైన నినాదాలు, సరైన దృక్పథం ద్వారానే మనం ప్రజలకు నాయకత్వం వహించగల్గుతాం. అలాంటి దృక్పథం తీసుకోవడం ద్వారానే, మన పార్టీ పోరాట శక్తిని తిరిగి పునరుద్ధరించుకోగల్గుతాం. విప్లవంలో విజయం సాధించడానికి కార్మికవర్గ నాయకత్వం మాత్రమే కీలకపాత్ర నిర్వహించగలుగుతుంది. ప్రస్తుత దశలో ముఖ్య పారిశ్రామిక కేంద్రాలలో పార్టీ శాఖలు ఏర్పరచటం పార్టీకి కార్మికవర్గ పునాదిని తయారు చేసుకోవటం ముఖ్యమైన నిర్మాణ కర్తవ్యాలు, పట్టణాలలో పీడిత ప్రజల పోరాటాలను అభివృద్ధి పరచడానికి, విప్లవ ఉధృతి పెంచటానికి, విప్లవ ప్రాంతాలలో పోరాటాన్ని అభివృద్ధి పరచడం, చిన్న చిన్న ప్రాంతాలలో విముక్తి స్థావరాలను ఏర్పరచుకోవటం, ఎర్రసైన్యాన్ని సృష్టించుకొని, విస్తృతం చేసుకోవటం-ప్రధాన పాత్ర వహించుతాయి. అందువల్ల పట్టణాల్లో పోరాటం వదులుకోవటం తప్పు. అదే సమయంలో, పల్లె ప్రాంతంలో రైతు ఉద్యమం పెరిగితే, రైతు బలం పెరిగి, కార్మిక బలం తరుగుతుందని, తద్వారా, విప్లవానికి నష్టం వాటిల్లుతుందని, మన పార్టీ సభ్యులు భయపడటం కూడా తప్పు. అర్ధవలస చైనా దేశంలో, కార్మికవర్గ నాయకత్వం లేకపోతే, రైతు పోరాటాలు విఫలమయి తీరుతాయి. కానీ, కార్మిక పోరాటం కంటె రైతు పోరాటాలు ఎక్కువ బలంగా పెరిగితే, విప్లవానికి ఎలాంటి నష్టం జరగదు.

**ఎర్రసైన్యం యొక్క పోరాట ఎత్తుగడల సమస్యపై ఆ లేఖలో జవాబు**

"ఎర్ర సైన్యాన్ని కాపాడటానికి, ప్రజలను ఉత్తేజ పరచడానికి, మన బలగాలను చిన్న చిన్న గ్రూపులుగా విడగొట్టాలని, పల్లె ప్రాంతంలో విస్తృతమయిన ప్రాంతంలో వాటిని వికేంద్రీకరణ చేయాలని, శత్రు దాడికి ప్రధానంగా గురవుతున్న కామ్రేడ్స్ మావో-సే-టుంగ్, ఛూటేలను రంగం నుండి మార్చాలని కేంద్ర కమిటీ సూచించింది. ఇది అవాస్తవికమైన దృక్పథం. 1927-28 చలికాలంలో మన సైన్యాన్ని చిన్న చిన్న గ్రూపులుగా విడగొట్టి, విస్తృతమయిన గ్రామీణ ప్రాంతంలో వికేంద్రీకరణ చెయ్యాలని, ప్లానులు తయారుచేశారు. ప్రతి కంపెనీ లేక బెటాలియన్ స్వతంత్రంగా పోరాటం జరపాలని, ప్రజలను ఉత్తేజ పరచడానికి గెరిల్లా పోరాట ఎత్తుగడలను అవలంభించాలనీ, శత్రు దాడికి గురికాకుండా తప్పుకోవాలని నిర్ణయించి, అనేకసార్లు అమలుజరుప ప్రయత్నించాం. కానీ ప్రతిసారి విఫలమయ్యాం. ఇందుకు కారణాలు. 1) ఎర్రసైన్యం సైనికుల్లో ప్రధాన భాగం బయటి నుండి వచ్చినవారు. వారి గత జీవితం, అనుభవాలు, స్థానిక రెడ్‌గార్డ్సు యొక్క జీవితం, అనుభవాలకు భిన్నమైనవి. 2) చిన్న చిన్న గ్రూపులుగా విడిపోవటం వల్ల నాయకత్వం బలహీనపడుతుంది. క్లిష్ట పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కోలేం. అపుడు సులభంగా ఓటమికి గురవుతాం. 3) శత్రువు మన చిన్న యూనిట్లను విడి విడిగా, ఒకదాని తర్వాత మరొక దానిని తుడిచివేయగలుగుతాడు. 4) క్లిష్ట పరిస్థితులు తీవ్రమయ్యే కొద్దీ, మన పోరాట శక్తులను కేంద్రీకరించవలసిన అవసరం, నాయకులు పోరాటంలో దృఢంగా నిలువటం అత్యంతావశ్యకం. ఆ విధంగానే శత్రువుకు వ్యతిరేకంగా, మన ఆంతరంగిక ఐక్యత సాధించగలుగుతాం. పరిస్థితులు అనుకూలంగా వున్నపుడే, మన శక్తులను గెరిల్లా చర్యల కొరకు చిన్న చిన్న గ్రూపులుగా విడగొట్టడం సాధ్యమవుతుంది. అపుడు మన నాయకులు సైనికుల వెంటనే వుండవలసిన అవసరం లేదు. పరిస్థితులు వ్యతిరేకమయినపుడు నాయకులు సైనికుల వెంటనే

వుండి తీరాలి.

ఇందులో ఒక బలహీనత వుంది. మన శక్తులను చిన్న చిన్న గ్రూపులుగా విడగొట్టడం వల్ల వచ్చే కష్టాలు చెప్పబడ్డాయి. అంతే చాలదు, మన శక్తులను కేంద్రీకరించటం వల్ల వచ్చే లాభాలు వివరింపబడలేదు. మన శక్తులను కేంద్రీకరించడం వల్ల శత్రు సైన్యం యొక్క పెద్ద యూనిట్లను తుడిచివేయగలుగుతాం. పట్టణాలను ఆక్రమించుకోగలుగుతాం. శత్రువు యొక్కపెద్ద యూనిట్లను ధ్వంసం చేసిన తర్వాతనే పట్టణాలను ఆక్రమించుకొన్న తర్వాతనే, విస్తృత భూభాగంలో ప్రజలను ఉత్తేజపరచగలుగుతాం. పక్కన వున్న అనేక కౌంటీలకు రాజకీయాధికారాన్ని విస్తృతం చేయగలుగుతాం. ఆ విధంగా మాత్రమే మనం విస్తృతమైన ప్రాంతంలో ప్రభావాన్ని (రాజకీయ పలుకుబడిని విస్తృతం చేయుట) కలుగజేయగలుగుతాం. విప్లవ ఉధృతిని త్వరితం చేయగలుగుతాం. రెండు సంవత్సరాల క్రితం హునాన్-కియాంగ్సీ సరిహద్దు ప్రాంతంలోనూ, గత సంవత్సరం పశ్చిమ ఫుకియేన్ లోనూ మన మేర్పరచిన ఈ రెండు ప్రభుత్వాల స్థాపన మన సైన్యాల కేంద్రీకరణ వల్లనే సాధ్యమయింది. ఇది సాధారణ సూత్రం. మన శక్తులను ఎపుడూ విభజించమా? తప్పకుండా విభజించుతాం. చిన్న ప్రాంతంలో మన శక్తులను చిన్న చిన్న గ్రూపులుగా విడగొట్టడం గురించి, ఎర్ర సైన్యం యొక్క గెరిల్లా ఎత్తుగడలను గురించి ఫ్రంట్ కమిటీ, కేంద్ర కమిటీకి రాసిన లేఖ ఈ విధంగా చెప్పింది.

గత 3 సంవత్సరాల పోరాటం నుండి మనం నేర్చుకుని, అవలంభించిన ఎత్తుగడలు గత చరిత్రలో గాని, ఆధునిక చరిత్రలోగాని, చైనాలోగాని, మరి ఇతర దేశాలలోగాని అమలు జరుపబడి వుండలేదు. మన ఎత్తుగడల ద్వారా ప్రజలను పోరాటానికి అంతకంత ఎక్కువ విస్తృతంగా ఉత్తేజపరచగల్గుతాం. ఎంత బలవంతమైన శత్రువునైనా ఎదిరించి, నిలువగలుగుతాం. మనవి గెరిల్లా ఎత్తుగడలు, అవి ఈ కింది విధంగా వుంటాయి :

"ప్రజలను ఉత్తేజపరచడానికి మన బలాలను విభజించాలి. శత్రువుపై దెబ్బ తీయడానికి మన బలాలను కేంద్రీకరింపచేయాలి."

"శత్రువు ముందుకు వచ్చినపుడు మనం వెనక్కు తగ్గుతాం. శత్రువు విశ్రాంతి తీసుకుంటున్నప్పుడు చికాకు పరుస్తాం. శత్రువు అలసినపుడు మనం దాడి చేస్తాం. శత్రువు వెనకడుగు వేసినపుడు మనం వెంటబడి తరుముతాం."

"మన స్థిరత్వం కల్గిన విప్లవ కేంద్రాలను విస్తృత పరచుకొనుటకు అలలు అలలుగా ముందుకు కొనసాగే విధానాన్ని అవలంభించాలి. బలమైన శత్రువు వెంటబడి తరిమినపుడు వాటిని చుట్టివేసే విధానాన్ని అవలంభించాలి."

"అతి తక్కువ కాలంలో వీలయిన మంచి పద్ధతుల ద్వారా, అత్యధిక ప్రజలనుత్తేజపరచాలి."

ఈ ఎత్తుగడలు వలను పన్నుట లాంటిది. ఏ సమయంలోనైనా, వలను విసరడానికి, వలను లాగడానికి సిద్ధంగా వుండాలి. ప్రజలను మనవైపు తిప్పుకోవటానికి వలను వేయవలసి వుంటుంది. శత్రువుపై దెబ్బతీయడానికి వలను లాగవలసి వుంటుంది.

**గత 3 సంవత్సరాలలో మనం అవలంభించిన ఎత్తుగడలు ఇవి :**

ఇక్కడ "వలను విసరడం" అంటే ఒక చిన్న ప్రాంతంలో మన శక్తులను గ్రూపులుగా విడగొట్టడం. ఉదాహరణకు హునాన్-కియాంగ్సీ సరిహద్దులో యెంగ్‌షీన్ కౌంటీ పట్టణాన్ని పట్టుకున్నపుడు మన 29-31 రెజిమెంట్లను యెంగ్‌షీన్ సరిహద్దు ప్రాంతంలో చిన్న చిన్న గ్రూపులుగా విడగొట్టాం. మూడవసారి యెంగ్‌షీన్ పట్టణాన్ని పట్టుకున్నప్పుడు, తిరిగి మన సైన్యాలను చిన్న చిన్న గ్రూపులుగా విడగొట్టాం. ఆన్ పు సరిహద్దు ప్రాంతానికి 31వ రెజిమెంటును, విన్ హువాకు 29వ రెజిమెంటును, కియాన్ సరిహద్దు ప్రాంతానికి 31వ రెజిమెంటును పంపించాం. గత ఏప్రిల్, మే నెలల్లో దక్షిణ కియాంగ్సీ కౌంటీలలోనూ, గత జూలైలో పశ్చిమ ఫుకియెన్ కౌంటీలలోనూ మన సైన్యాలను తిరిగి విడగొట్టాం. పరిస్థితులు మనకు అనుగుణంగా ఉన్నపుడు, నాయకత్వ సంస్థలు బలంగా వున్నప్పుడు మాత్రమే విస్తృతమైన ప్రాంతంలో, మన సైన్యాలను చిన్న చిన్న గ్రూపులుగా విడగొట్టగలుగుతాం. ప్రజలను మన వైపు తిప్పుకోవడం, వ్యవసాయిక విప్లవాన్ని తీవ్రపరచడం రాజకీయాధికారాన్ని స్థాపించడం, ఎర్ర సైన్యాన్ని స్థానిక సాయుధ దళాలను పెంచుకోవటం - ఈ కర్తవ్యాలను సాధించాలంటే, మన సైన్యాలను చిన్న చిన్న గ్రూపులుగా విడగొట్టవలసి వుంది. ఈ కర్తవ్యాలు సాధించలేనపుడు, మన సైన్యాలను విడగొట్టగూడదు. అలా విడగొట్టితే మనకు ఓటమి తప్పదు. ఎర్ర సైన్యం బలహీనపడుతుంది. చెంగ్ - చౌపై దాడి చెయ్యడానికి హునాన్-కియాంగ్సీ సరిహద్దు ప్రాంతంలో రెండు సంవత్సరాల క్రితం, ఆగస్టులో మన సైన్యాలను విడగొట్టడం వల్ల మనకు ఓటమి తప్పలేదు. పై రెండు పరిస్థితులుంటే మాత్రం, మన బలాలను విభజించవచ్చు. అపుడు మన బలాలు కేంద్రీకరణ కంటే, విభజనే ఎక్కువ లాభకరం.

కేంద్ర కమిటీ ఫిబ్రవరి లేఖ సరైందికాదు. నాల్గవ సైన్యంలో చాలా మంది కామ్రేడ్స్ పైన చెడ్డ ప్రభావం కలుగజేసింది. ఆ సమయంలో కేంద్ర కమిటీ చాంకై-షేక్, క్వాంగ్సీ సైనిక ప్రభువుల మధ్య యుద్ధం రాకపోవచ్చునని కూడా చెప్పివేసింది. అయినా, తర్వాత కాలంలో, కేంద్ర కమిటీ ఇచ్చిన అంచనాలు, సూచనలు సరిగ్గానే వున్నాయి. తప్పుడు అంచనాలు సరిదిద్దుతూ కేంద్ర కమిటీ మరొక లేఖ పంపింది. ఎర్ర సైన్యానికి కేంద్ర కమిటి రాసిన తప్పులు సవరించకపోయినప్పటికీ, తర్వాత పంపిన లేఖల్లో నిరాశతో కూడిన అంచనాలు లేవు. ఎర్ర సైన్యం యొక్క పోరాట ఎత్తుగడలపైన ప్రస్తుతం కేంద్ర కమిటీ అంచనాలు మన అంచనాలతో దాదాపు అంగీకరిస్తున్నాయి. అయినా ఈ లేఖ కొంత మంది కామ్రేడ్స్‌లో కలిగించిన తప్పుడు ప్రభావం ఇంకా కొనసాగుతూ వుంది. అందువల్ల ఈ విషయమై మరికొంత వివరణ ఇవ్వవలసి వుందని నేను భావించుతూ వున్నాను.

గత ఏప్రిల్ నెలలో, ఒక సంవత్సరంలో కియాంగ్సీ రాష్ట్రాన్ని స్వాధీన పరచుకోవాలని, ఫ్రంట్ కమిటీ, కేంద్ర కమిటీకి ప్రతిపాదించింది. తర్వాత యూటూలో ఆ ప్రతిపాదన అంగీకరిస్తూ ఈ సమస్యపై ఒక నిర్ణయం కూడా చేయబడింది. కేంద్ర కమిటీకి రాసిన లేఖలో ఈ కింది కారణాలున్నాయి.

"చాంకై-షేక్, క్వాంగ్సీ సైనిక ప్రభువుల సైన్యాలు, కియాంగ్ సమీపంలో, ఒక దానిని మరొకటి సమీపించుతున్నాయి. రెండింటి మధ్య యుద్ధం త్వరలో సంభవించనున్నది. ప్రజా పోరాటాల

పునఃప్రారంభము వల్ల, అభివృద్ధి నిరోధక పాలకవర్గాల్లో ఘర్షణలు తీవ్రం కావడం వల్ల, త్వరలో విప్లవ వుధృతి పెరుగుతుంది. ఇలాంటి పరిస్థితుల్లో మన పని ఎలా వుండాలి? దక్షిణ ప్రాంతాలకు సంబంధించినంత వరకు క్వాంటుంగ్, హూనాన్ రాష్ట్రాలలోని దళారి బూర్జువా-భూస్వాముల సైన్యాలు బలంగా వున్నాయి. అంతేగాక హూనాన్‌లో మన దుందుడుకు ఎత్తుగడల ఫలితంగా పార్టీ లోపలా, బయటా మన ప్రజా పునాది పోగొట్టుకున్నాం. ఫుకియేన్, కియాంగ్సీ, చెకియాంగ్ మూడు రాష్ట్రాలలోనూ పరిస్థితి భిన్నంగా వుంది. మొదటిది, మిలిటరీ రీత్యా అక్కడ శత్రువు చాలా బలహీనంగా వున్నాడు. చియాంగ్ పో, చెంగ్ నాయకత్వం కింద చెకియాంగ్‌లో ఒక చిన్న రాష్ట్ర సైన్యం మాత్రముంది. ఫుకియేన్‌లో ఐదు శత్రు గ్రూపులకు చెందిన సైన్యాలు ఇప్పటికే ధ్వంసం చేయబడి వున్నాయి. చెన్‌కో-హుయి, లూసింగ్ నాయకత్వం కింద సైన్యాలు, బందిపోటు దొంగలు. వీటి పోరాట శక్తి చాలా తక్కువ. సముద్రతీర ప్రాంతంలో వుంచబడిన రెండు నావికా బ్రిగేడ్లు ఇప్పటికీ ఎలాంటి పోరాటంలో పాల్గొనలేదు. నిస్సందేహంగా వాటి పోరాట పటిమ ఎక్కువగా లేదు. చాంగ్-చెన్ మాత్రమే కొంత వరకు పోరాడగల్గుతాడు. అయినా, ఫుకియెన్ రాష్ట్ర కమిటీ పరిశీలన ప్రకారం ఇతని దగ్గర కూడా బలమైన రెండు రెజిమెంట్లు మాత్రమే వున్నాయి. దీనికి తోడుగా ఫుకియెన్‌లో అంతటా అరాచకం, గందరగోళం, అనైక్యత తాండవిస్తున్నాయి. కియాంగ్సీలో చూపీ-టే సీ-ఆన్ షి-హుయిల నాయకత్వం కింద 16 రెజిమెంట్లున్నాయి. ఫుకియెన్ లేక చెకియాంగ్‌లలో వున్న సాయుధ బలాలకంటే, కియాంగ్సీ బలాలు ఎక్కువ బలంగా వున్నాయి. రెండవది, ఈ మూడు రాష్ట్రాలలో దుందుడుకు తప్పులు తక్కువగా జరిగాయి. చెకియాంగ్ పరిస్థితి గురించి స్పష్టంగా తెలియదు. హూనాన్‌లో కంటె, కియాంగ్సీ ఫుకియెన్‌లలో పార్టీ నిర్మాణరీత్యా, ప్రజా పునాదిరీత్యా బలంగా వుంది. ఉదాహరణకు, కియాంగ్సీ పరిస్థితి చూడండి. ఉత్తర కియాంగ్సీలో టెహన్, సియూషుయి, టంగ్‌కూలలో ఇప్పటికీ ప్రజాపునాది మిగిలి వుంది. పశ్చిమ కియాంగ్సీలో నింగ్‌కాంగ్, యెంగ్‌షీన్, లేన్‌హువా, షీచు-ఆన్‌లలో పార్టీ, రెడ్‌గార్డ్సు దళాల బలం ఇప్పటికి కొంత నిలబడి వుంది. ఎర్ర సైన్యపు 2-4 రెజిమెంటులు కియాన్, యెంగ్‌ఫెంగ్, వంగ్‌కో కౌంటీలలో బలం పెంచుకుంటూ వుండటం వలన, దక్షిణ కియాంగ్సీలో పరిస్థితులు మెరుగ్గా వున్నాయి. ఇంకా విశేషమేమిటంటే, వాంగ్-చీ-మిన్ నాయకత్వం కింద వున్న ఎర్ర సైన్యం ఇంకా మిగిలి వుంది. ఈ పరిస్థితులన్నీ నాంచాంగ్‌పై దాడి చేయుటకు మంచి అవకాశాలు కల్గిస్తున్నాయి. 'కొమింగ్‌టాంగ్ సైనిక ప్రభువుల మధ్య దీర్ఘకాల యుద్ధం కొనసాగుతున్న సమయంలో, కియాంగ్సీ రాష్ట్రం కొరకు పశ్చిమ ఫుకియేన్, చెకియాంగ్‌ల కొరకు గూడ మనం చాంగ్‌కైషేక్, క్వాంగ్సీ ముఠాలతో పోరాడాలని మేము కేంద్ర కమిటీకి రెకమెండ్ చేస్తున్నాం. ఈ మూడు రాష్ట్రాల్లో ఎర్ర సైన్యాన్ని విస్తృత పరచుకోవాలి. ప్రజల స్వతంత్ర ప్రభుత్వాన్ని స్థాపించుకోవాలి. ఈ ప్లానును ఒక్క సంవత్సరం లోపల పూర్తి చెయ్యాలి.

కియాంగ్సీని పట్టుకోవడానికి చేసిన ప్రతిపాదనలలో ఒక్క సంవత్సరం గడువు విధించటం ఒక్కటే తప్పు. రాష్ట్రంలోని అంతరంగిక పరిస్థితులపైనే గాక, దేశవ్యాపితంగా త్వరలో విప్లవం ఉధృతంగా వస్తుందనే అంచనాపై ఆధారపడి ఈ నిర్ణయం చేయబడింది. విప్లవోద్యమం ఉధృతి త్వరలో పెరుగుతుందని మనకు నమ్మకం కలిగి వుండకపోతే, కియాంగ్సీని పట్టుకోవడానికి ఒక్క సంవత్సరం గడువు విధించి వుండేవారం కాదు. ఆ ప్రతిపాదనలో సంవత్సరం గడువు విధించటం ఒక్కటే తప్పు. అది చేసి వుండవలసింది కాదు. "త్వరలో విప్లవం ఉధృతంగా వస్తుంది" అన్న వాక్యంలో త్వరలో అన్నమాట అసహనానికి చిహ్నం. కియాంగ్సీలోని భౌతిక పరిస్థితులను స్వీయ నిర్మాణ శక్తిని గురించి అంచనాలు జాగ్రత్తగా పరిశీలించాలి. కేంద్ర కమిటీకి రాసిన లేఖ వివరించిన స్వీయాత్మక పరిస్థితులేగాక, మూడు భౌతిక పరిస్థితులను స్పష్టంగా చూడవలసి వుంది. మొదటిది కియాంగ్సీ ప్రధానంగా ఫ్యూడల్ ఆర్థిక విధానం కలది. వ్యాపార పెట్టుబడిదారీవర్గం సాపేక్షికంగా బలహీనంగా వుంది. దక్షిణ రాష్ట్రంలోని ఇతర అన్ని రాష్ట్రాలకంటే భూస్వాముల సైనిక బలాలు బలహీనంగా వున్నాయి. రెండవది:- కియాంగ్సీకి స్వంత రాష్ట్ర సైన్యం లేదు. ఇతర రాష్ట్రాల సైన్యాలు ఎప్పుడూ దాని రక్షణకొరకు వుంచబడుతూ వున్నాయి. "కమ్యూనిస్టుల అణచడానికి" "బందిపోటుల అణచడానికి" పంపబడుతున్న ఈ సైన్యాలకు స్థానిక పరిస్థితులు తెలియవు. స్థానిక సైన్యాలలాగా ఈ సైన్యాలకు ఇక్కడ స్వీయప్రయోజనాలు లేవు. అందువల్ల, ఈ పోరాటంలో వారికీ సహజంగానే ఉత్సాహంలేదు. మూడవది:- క్వాంటుంగ్, హాంకాంగ్‌కు సమీపంలో వుంది. దాదాపు అన్ని విధాలా బ్రిటీష్‌వారి ఆధిపత్యంలో వుంది. కియాంగ్సీ అలా కాదు. కియాంగ్సీ సామ్రాజ్యవాదుల పలుకుబడికి సాపేక్షంగా దూరంగా వుంది. ఈ మూడు విషయాలు స్పష్టంగా గ్రహించితే ఇతర అన్ని రాష్ట్రాలకంటే, కియాంగ్సీలోని రైతాంగ తిరుగుబాట్లు ఎందుకు విస్తృతంగా వస్తూండేది. ఎర్ర సైన్యం, గెరిల్లా దళాలు ఎందుకు ఎక్కువ సంఖ్యలో వుండేదీ మనకు బోధపడుతుంది.

"త్వరలో విప్లవ ఉధృతం వస్తుంది" అనే వాక్యంలోని "త్వరలో" అన్న మాటను ఎలా అర్థం చేసుకోవాలి? కామ్రేడ్స్ తరచుగా ఈ ప్రశ్న వేస్తూ వున్నారు. మార్క్సిస్టులు జ్యోతిష్యం చెప్పేవారు కాదు. భవిష్యత్తు పరిణామాలను, మార్పుల యొక్క సాధారణ మార్గాన్ని సూచించుతారేగాని, యాంత్రికంగా ఏ రోజున, ఏ గంటకు, ఏది జరుగుతుందో చెప్పరు; చెప్పకూడదు. కానీ చైనాలో త్వరలో విప్లవం ఉధృతంగా వస్తుందని నేనంటున్నానంటే, కొందరు అంటున్నట్లుగా, "రావచ్చునని" మాత్రంకాదు. అది భ్రమకాదు. అసాధ్యమయినది కాదు. కార్యాచరణకు ప్రాముఖ్యత లేనిదికాదు. సముద్ర తీరం నుండి చూస్తే, దూరంగా, కొద్దిగా, చివర మాత్రం అగుపడుతున్న ఓడలాంటిది. పర్వతాగ్ర భాగం నుండి, తూర్పుదిక్కును చూస్తే కనపడే లేత కిరణాలను వెదజల్లుతున్న ఉదయభానుడులాంటిది. తల్లి గర్భంలో బయటికి రావడానికి కదలాడుతున్న బిడ్డలాంటిది.

బో

కరపత్రం

## కా॥చారు మజుందార్ అమరుడైన జూలై 28ని అమరుల సంస్మరణ దినంగా
## ఆగష్టు 3 వరకు సంస్మరణ వారంగా జరుపుకుందాం!
## శత్రువు బూటకపు సంస్కరణలను, లొంగుబాట్ల పథకాన్ని తిప్పికొడదాం!!
## దోపిడి వర్గాల అధికారాన్ని ధ్వంసం చేసి భారత విముక్తిని వేగవంతం చేద్దాం!!!

*ప్రియమైన ప్రజలారా...*

భారత దేశంలో మహత్తర నక్సల్బరీ సాయుధ రైతాంగ తిరుగుబాటు నుండి మొదలుకుని గత 48 సంవత్సరాలుగా కొనసాగుతున్న నూతన ప్రజాస్వామిక విప్లవ క్రమంలో మన పార్టీ సంస్థాపకులు, గొప్ప నాయకులు, అమరులు కా॥చారుమజుందార్, కా॥కన్హయ్ చటర్జీలు రూపొందించిన దీర్ఘకాలిక ప్రజాయుద్ధ మార్గంలో లక్ష్య సాధనకై ముందుకు సాగుతూ 10 వేలకు పైగా మన ప్రియతమ కామ్రేడ్స్, ప్రజలు గొప్ప త్యాగాలు చేసారు. 2004 సిపిఐ (మావోయిస్టు) ఆవిర్భవించిన గత దశాబ్ద కాలంలో పొలిట్‌బ్యూరో సభ్యుల నుండి సాధారణ ప్రజల వరకు 2400 మంది భారత పీడిత ప్రజల ఉత్తమ పుత్రికలు, పుత్రులు తమ అమూల్యమైన ప్రాణాలను అర్పించారు.ఆ అమరుల సాహసాన్ని, దృఢ సంకల్పాన్ని త్యాగాలను స్మరించుకుందాం.

ఎఒబిలో గత 32 సం॥ల కాలంలో వందల సంఖ్యలో కామ్రేడ్స్ అమరులైనారు. గత సంవత్సర కాలంలో ఈస్టు డివిజన్ విశాఖ మన్యంలో కా॥శరత్ (జిల్లా కమిటి సభ్యుడు), కా॥గణపతి (ప్రజా సంఘ నాయకుడు), బైపరిగూడ ఎన్‌కౌంటర్‌లో కా॥లాలు (ఎసి మెంబర్), మల్కనగిరి జిల్లా పొడియా ఏరియా కమిటి సభ్యుడు కా॥జోగాల్, బొడిగట్టకు చెందిన ఆర్‌పిసి అధ్యక్షుడు కా॥శంకర్, కటాఫ్ ఏరియా గొబరిపడ ఎన్‌కౌంటర్‌లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన విద్యార్థి నాయకుడు కా॥సోనులు తమ నులివెచ్చని రక్తాన్ని ధారపోసారు. ఆంధ్రప్రదేశ్ ఉద్యమంలో తిరిగి విప్లవ బీజాలు వెదజల్లే కృషిలో ఉన్న కా॥అశోక్, కా॥భారతి, కా॥విమలలను చంద్రబాబు హయాంలో బూటకపు ఎన్‌కౌంటర్‌లో కాల్చి చంపారు.

శ్రీకాకుళం-కొరాపుట్ డివిజన్‌లో నారాయణపట్నా ఆదివాసీ రైతాంగ పోరాటంలో ఆదివాసీ నాయకులు కా॥సింగన్న, ఆంధ్రులు నేలకొరిగారు. శత్రువుతో వీరోచితంగా పోరాడుతూ పిఎల్‌జిఎ రీజనల్ 2వ కంపెనీ కమిస్సార్, ఎస్‌జడ్‌సి మెంబర్ కా॥సూర్యం, డివిజన్ ఉద్యమంలో క్రియశీల పాత్ర పోషించిన సీనియర్ కామ్రేడ్స్ శ్యాం (నరేందర్), కా॥దుంబ్రి ( మహేందర్) లతో పాటు పదుల సంఖ్యలో పిఎల్‌జిఎ సభ్యులు, మిలీషియా, ప్రజాసంఘ కార్యకర్తలు ప్రాణ త్యాగం చేసారు. 30 సంవత్సరాల పాటు విప్లవోద్యమ అభివృద్ధికి విశేష కృషి చేసిన విప్లవ మేధావి కా॥గంటి ప్రసాదాన్ని 60 ఏళ్ళ వయసులో ప్రభుత్వ కిరాయి గూండాలు హత్య చేసారు. భారత విప్లవంలో నేలకొరిగిన ఈ అమరులందరికీ తలవంచి వినమ్రంగా శ్రద్ధాంజలి ఘటిద్దాం. వారి సాహసాన్ని, దృఢ సంకల్పాన్ని, త్యాగాలను స్మరించుకుందాం. వారు నడిచిన ప్రజాయుద్ధ బాటే మన దేశ విముక్తికి మార్గమని ఎలుగెత్తి చాటుదాం.

భారత దేశంలో అర్థవలస-అర్థ భూస్వామ్య సమాజాన్ని ధ్వంసం చేసి నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని, సోషలిస్టు సమాజాన్ని, అంతిమంగా కమ్యూనిజాన్ని స్థాపించే లక్ష్యంతో సిపిఐ (మావోయిస్టు) నేతృత్వంలో ప్రజలు వీరోచితంగా పోరాడుతున్నారు. ఛత్తీస్‌ఘడ్, బీహార్, జార్ఖండ్ రాష్ట్రాలలో ప్రజాయుద్ధం ఉన్నత స్థాయిలో కొనసాగుతున్నది. దేశంలో బలమైన విప్లవ ప్రవంతులు, విప్లవ శక్తులు ఏకమై మార్గదర్శక కేంద్రంగా పార్టీ ఏర్పడింది. పార్టీ నాయకత్వంలో పిఎల్‌జిఎ విప్లవోద్యమానికి వెన్నెముకగా నిలిచింది. వివిధ సమస్యల మీద, వివిధ స్థాయిలలో ఎత్తుగడల ఐక్యసంఘటనలు ఏర్పడ్డాయి. డికె, బీహార్, జార్ఖండ్, ఎఒబిలలో ప్రజల అధికార అంగాలైన ఆర్‌పిసిలు సంఘటిత పడుతున్నాయి. ఈ విధంగా గొప్ప విజయాలతో పార్టీ భారత పీడిత ప్రజల ఆశాజ్యోతిగా నిలిచింది.

భారత పాలక వర్గాలు పార్టీని నిర్మూలించటానికి బహుముఖ దాడిని కొనసాగిస్తున్నాయి. గ్రీన్‌హంట్ పేరుతో ప్రజలపై యుద్ధాన్ని కొనసాగిస్తున్నారు. ఛత్తీస్‌ఘడ్, బీహార్, జార్ఖండ్ ఉద్యమాలను లక్ష్యంగా చేసుకుని ఛత్తీస్‌ఘడ్‌లో జంగల్ వార్‌ఫేర్ ట్రైనింగ్ సెంటర్‌ను ఏర్పరిచి మిలటరీ బలగాలను మొహరిస్తున్నారు. హెలీకాప్టర్లు, డ్రోన్స్‌తో వైమానిక దాడులకు సిద్ధమవుతున్నారు. ఒక్క ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోనే 3.50 లక్షల కోబ్రా, సిఆర్‌పిఎఫ్, బిఎస్‌ఎఫ్ వంటి పారా మిలటరీ, కమాండో బలగాలను దింపి భీభత్సాన్ని సృష్టిస్తున్నారు. దేశంలో అన్ని పోరాట ప్రాంతాలపైన కేంద్ర-రాష్ట్రాల నిర్బంధకాండ కొనసాగుతోంది.

కొరాపుట్ జిల్లా నారాయణపట్న భూసమస్య పైన, విస్తాపనకు వ్యతిరేకంగా మాలి, దేవ్‌మాలి, దంగుదేవుల, చైనామట్టి తదితర ప్రాంతాలలో ప్రజలు తీవ్రంగా పోరాడుతున్నారు. ఈ పోరాటాలను అణచి వేయడంలో భాగంగానే నారాయణపట్న-బందుగాంలలో బిఎస్‌ఎఫ్ బలగాల కార్పెట్ సెక్యూరిటిని ఏర్పరిచారు. పోలీసుల అండతో భూస్వాములు తిరిగి ప్రజల భూములను ఆక్రమించు కుంటున్నారు. మద్యాన్ని ఏరుల్లా పారిస్తున్నారు. మహిళలపై పోలీసుల, గూండాల అత్యాచారాలు, లూటీలు, గృహదహనాలు నిత్యకృత్యం అయ్యాయి. ప్రజలు సాధిస్తున్న విజయాలను వమ్ము చేసేందుకు ప్రభుత్వం "లొంగుబాట్ల పథకాన్ని'' ఎత్తుగడగా తెచ్చి ప్రజలను బలవంతంగా లొంగదీసుకుంటున్నారు. ప్రజలను పోరాటాల నుండి పక్కదారి పట్టించేందుకు, ప్రభుత్వ, పోలీసు సంస్కరణలు జోరందుకున్నాయి. జనసంపర్క్ శిభిర్‌లు ఏర్పరిచి, యువతను ప్రలోభ పెట్టి ఇన్‌ఫార్మర్ నెట్‌వర్క్‌ను, కోవర్టు యంత్రాంగాన్ని ఏర్పర్చుకోవటానికి, విప్లవ

ప్రతీఘాతుకత్వాన్ని పెంచటానికి ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నిస్తున్నది. ఈ ప్రభుత్వ కుట్రను తిప్పికొడదాం. లొంగిపోవటం కన్నా చావటం మేలు అనే విప్లవ స్ఫూర్తితో అమరుల త్యాగాల సాంప్రదాయాన్ని కాపాడుదాం. లొంగుబాట్లను అసహ్యించుకుంటూ అమరవీరుల సంస్మరణ వారం సందర్భంగా ప్రతిజ్ఞ చేయాల్సిందిగా శ్రీకాకుళం-కొరాపుట్ డివిజనల్ కమిటి ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నది.

కేంద్రంలో నరేంద్రమోడి ప్రభుత్వ పాలనలో కార్పొరేట్ అనుకూల, ప్రజా వ్యతిరేక విధానాలు బహిర్గతం అవుతున్నాయి. దేశాన్ని ఏకైక హిందూ మత దేశంగా చేసే లక్ష్యంతో నరేంద్రమోడి ఆర్ఎస్ఎస్, విఎచ్‌పిల ఎజెండాను అమలు చేస్తున్నాడు. నల్లధనం వెలికితీత, ధరల తగ్గింపు, ఉద్యోగాల కల్పన, వ్యవసాయ రంగాన్ని మెరుగుపర్చటం వంటి ఎన్నికల వాగ్ధానాలన్ని మాయమాటలేనని రుజువయ్యాయి. మతఘర్షణలను రెచ్చగొట్టి హిందూ మతోన్మాదం, బ్రాహ్మణవాదంలో మత మైనార్టీలపై దాడులను చేస్తున్నారు. ఈ మతోన్మాద ప్రమాదాన్ని పీడిత ప్రజలు ఐక్యంగా తిప్పికొట్టాల్సిందిగా, విద్యార్థులు, టీచర్లు, కార్మికులు, మత మైనార్టీలు మరింత సంఘటితంగా ఉద్యమించాల్సిందిగా కోరుతున్నాం.

ఒడిశాలో నవీన్ పట్నాయక్ ప్రభుత్వం వేదాంత, పోస్కో, జిందాల్ తదితర కంపెనీలకు ప్రజల ఆస్తులను తాకట్టు పెడుతున్నది. లక్షలాది రైతాంగం విస్తాపనకు గురౌతున్నారు. నేడు ఎస్సార్ కంపెనీ ఇనుప ఖనిజ తరలింపు కొరకు ఛత్తీస్‌ఘడ్ నుండి ఎన్‌హెచ్ 26 వెంబడి కొరాపుట్ మీదుగా విశాఖ వరకు పైపులైన్ ఏర్పాటుకు పథకం సిద్ధమైంది. పొట్టంగి పరిసరాలలో నేవికి చెందిన ఆయుధ గోడౌన్ నిర్మాణానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఒడిశాలోని వివిధ సెక్షన్ల ప్రజలు పోరాడుతున్నారు.

ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు పాలనలో నూతన రాజధాని, విమానాశ్రయం ఏర్పాటు పేరుతో వేలాది ఎకరాల ప్రజల భూములు ఆక్రమిస్తున్నాడు. ఈ భూ ఆక్రమణను ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. విశాఖ జిల్లా మన్యం ప్రజలు బాక్సైట్‌కు వ్యతిరేకంగా వీరోచితంగా పోరాడుతున్నారు. ఈ విధంగా కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలను తిప్పికొడుతూ జరుగుతున్న అన్ని ప్రజా పోరాటాలకు మా పార్టీ సంపూర్ణ మద్దతు తెలియచేస్తున్నది.

భూస్వామ్య, దళారీ నిరంకుశ బూర్జువా, సామ్రాజ్యవాదుల అధికారాన్ని ధ్వంసం చేసి, పీడిత ప్రజల అధికారాన్ని సాధించటం కోసం, నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేయటం కోసం పీడిత ప్రజలంతా ప్రజాయుద్ధంలో భాగస్వాములు కావాల్సిందిగా, యువతీ, యువకులంతా పిఎల్‌జిఎలో చేరాల్సిందిగా శ్రీకాకుళం-కొరాపుట్ డివిజన్ కమిటి పిలుపునిస్తున్నది.

- ♦ **అమరవీరుల సంస్మరణ వారాన్ని స్ఫూర్తి దాయకంగా జరుపుకుందాం !**
- ♦ **అమరుల త్యాగాల బాటలో ముందుకు సాగుదాం !!**
- ♦ **శతృవు గ్రీన్‌హంట్ ఆపరేషన్‌ను ఓడిద్దాం !**
- ♦ **ప్రజాయుద్ధాన్ని పురోగమింప చేద్దాం !!**

**విప్లవాభినందనాలతో**

**శ్రీకాకుళం-కొరాపుట్ డివిజన్ కమిటి**

28-7-15 **సి.పి.ఐ (మావోయిస్టు)**

బో



ఏ యుద్ధంలోనైనా గానీ యుద్ధరంగంలో రక్తాన్ని చిందించే ప్రజల నైతిక సైర్యం మీదనే అంతిమ విజయం ఆధారపడి ఉంటుంది. ప్రజలు యుద్ధం యొక్క ఆశయాలను, లక్ష్యాలను అర్థం చేసుకోవడం అనే విషయానికి అపారమైన ప్రాముఖ్యత ఉంది. అది విజయాన్ని గ్యారంటీ చేస్తుంది.

- కా॥ లెనిన్

బోల్షెవిక్ పత్రికను చదవండి, చదివించండి. చదువురానివాళ్ళు చదివించుకోండి.
తదుపరి మీ సూచనలు, సలహాలు ఇవ్వండి. - సం॥

## ఆపరేషన్ బ్లూ మూన్ ప్రభుత్వ పాలనా యంత్రాంగ కొత్తనాటకం !

## నారాయణపట్నా, బందుగాం ఆదివాసీల భూమిసమస్య పరిష్కారం అయ్యేవరకు పోరాడదాం !

## ప్రజలను నిర్వాసితులను చేస్తున్న గనులను వ్యతిరేద్దాం !

## జల్, జంగల్, జమీన్‌పై హక్కుకోసం పోరాడదాం !

## ప్రజాపోరాటల్లో పాల్గొని పోరాడే ప్రజలపై పోలీసు అణచివేతను ఎదుర్కొందాం !

***ప్రియమైన ప్రజలారా ...***

కోరాపుట్ జిల్లా కలెక్టర్ బి.ఉదయ్‌కుమార్ 2015 ఆగస్టు నుండి నారాయణట్నం, బందుగాం బ్లాకలలో ప్రభుత్వ సంస్కరణలు వేగవంతం చేయడానికి ఆపరేషన్ బ్లూ మూన్‌ను ముందుకు తీసుకువచ్చాడు. రెండు నెలలు నారాయణపట్నం, బందుగాం బ్లాక్‌లలో స్వయంగా కలెక్టరే ప్రజల వద్దకు వారి సమస్యలను తెలుసుకొని అర్జీలను స్వీకరించాడు. కానీ వాటికి పరిష్కారం కోసం ఎంతకాలం పడుతుందని మాత్రం చెప్పలేదు. ప్రస్తుతం నారాయణపట్నంలో 130 అర్జీలు, బందుగాంలో 105 అర్జీలను స్వీకరించామని గొప్పలు చెప్పుకుంటున్నాడు. కానీ వాస్తవంగా నారాయణపట్నం, బందుగాం ప్రజల మౌళిక సమస్య ఏమిటి? ప్రజలు ఏం కోరుకుంటున్నారు? ఆపరేషన్ బ్లూ మూన్ ప్రజల భూమి సమస్యకు పరిష్కారం చూపుతుందా? భూమి సమస్యపై ప్రభుత్వ వైఖరి ఏమిటనేది ప్రజలకు స్పష్టమే.

నారాయణపట్నం, బందుగాంలోని ఆదివాసీ రైతాంగం అనేక సంవత్సరాల నుండి ఆదివాసేతర భూస్వామ్య, నుండి షావుకారులు, ప్రభుత్వం, ఫారెస్టు ఆఫీసర్ల దోపిడీ దౌర్జన్యాలు, అత్యాచారాలకు వ్యతిరేకంగా పోరాడుతున్నారు. భూమి కొరకు కోర్టులకెక్కారు. బి.డి.ఒ (బ్లాక్ డెవలప్‌మెంట్ ఆఫీసర్) కలెక్టర్ ఆఫీసుల చుట్టూ తిరిగి వందలాది అర్జీలు పెట్టుకున్నారు. ధర్నాలు, ర్యాలీలు, నిరాహార దీక్షలు చేసారు. చివరికి ఎన్నికలను కూడా బహిష్కరించారు. కానీ ప్రజల ఏ సమస్యను కూడా ప్రభుత్వాలు పట్టించుకోలేదు. తర్వాత వేలాదిమంది ఆదివాసీలు ఒక్కటై భూపోరాటం చేసి 3500 ఎకరాల భూమిని స్వాధీనపర్చుకున్నారు. నారాయణపట్నం భూపోరాటం దేశవ్యాపిత ఉద్యమానికి ప్రేరణగా నిలిచింది. "అప్నాబరీ సప్నాబరీ, నక్సల్బరీ" అన్నట్లు నారాయణపట్నం దారే మా దారి అనే నినాదం మొత్తం ఒడిశా ప్రజల నినాదంగా మారింది. ప్రభుత్వాలు సంవత్సరాలుగా పరిష్కరించలేని భూమి సమస్యను ప్రజలే పోరాడి పరిష్కరించుకున్నారు. ఒడిశాలోని నవీన్‌పట్నాయక్ ప్రభుత్వం సామ్రాజ్యవాద, భూస్వామ్య, దళారీ నిరంకుశ బూర్జువా వర్గాల స్వార్థప్రయోజనాల కోసం వేలాదిమంది పోలీసు పారామిలటరీ బలగాలతో పోరాటాన్ని అణచివేసింది. భూపోరాటానికి నాయకత్వం వహించిన సింగన్న, ఆంధ్రు, తేలి, కాత్రు, గంగులు, రత్న వంటి ఆదివాసీలను, ఆదివాసీ నాయకులను అతి ధారుణంగా హత్యలు చేసారు. ప్రజలపై విచక్షణారహితంగా కాల్పులు జరిపారు. వందలాది మంది ప్రజలను అరెస్టు చేసి జైళ్ళలో బంధించారు. కూంబింగ్‌ల పేరుతో గ్రామాలపై దాడులు చేస్తూ మహిళలను హత్యాచారం చేస్తున్నారు. ప్రజల ఇండ్లు, పంటలు, ఆస్తులను ధ్వంసం చేస్తున్నారు. ప్రజలను బలవంతపు లొంగుబాట్లు చేయిస్తున్నారు. ఆదివాసీ ప్రజలు రక్తతర్పణ చేసి సాధించుకున్న భూములను తిరిగి భూస్వాములు స్వాధీనం చేసుకుంటున్నారు. నారాయణపట్నం ప్రజా సమస్యల పట్ల బూర్జువా ప్రభుత్వాలకు చిత్తశుద్ధే లేదు. అందుకే భూమి సమస్య ఏండ్ల తరబడి పరిష్కారం కాకుండా మిగిలిపోయింది. భూస్వాములు, ప్రభుత్వం కలిసిమెలిసి ప్రజల న్యాయమైన ఉద్యమాన్ని అతి ధారుణంగా అణచివేసి రక్తపుటేరుల్లో ముంచారు. కలెక్టర్, ప్రభుత్వ అధికారులు వచ్చి సమస్యను పరిష్కారం చేస్తామని వాగ్దానాలు చేయడం ఎంత బూటకమో ప్రజలు తెలుసుకోవాలి. ప్రభుత్వ పాలనాయంత్రాంగం నారాయపట్నం, బందుగాం ప్రజలను ఉద్ధరిస్తామని చెప్పడం పచ్చి అబద్ధం, మోసమే. ప్రజల అభివృద్ధి పేరుతో రోడ్లు, సెల్‌టవర్లు, బ్రిడ్జీలు, పోలీస్‌క్యాంపులు నిర్మించడానికి కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తూ సామ్రాజ్యవాద, భూస్వామ్య, దళారీ బడా బూర్జువా వర్గాల ప్రయోజనాలను నెరవేర్చుతున్నారు. మరొకపక్క ఈ ప్రాంత ప్రజల భూమి, ప్రకృతి, సహజ సంపదలను అమ్మివేస్తున్నారు. ప్రభుత్వం చేస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమాలు చేయకుండా ఉండటానికి 'ఆపరేషన్ బ్లూ మూన్' పేరున సంస్కరణలు ప్రవేశపెట్టి ప్రజలను పక్కదారి పట్టిస్తున్నారు.

కేంద్రంలో నరేంద్రమోడీ ప్రధానమంత్రి అయినప్పటినుండి ఇవాల్టి దాకా 30దేశాల పర్యటనలు చేసాడు. ఈ పర్యటనలల్లో దేశంలోని భూమి, ప్రకృతి, ఖనిజ సంపదలనూ, మానవ వనరులను కారుచౌకగా సామ్రాజ్యవాద బహుళజాతి కంపెనీలకు అమ్మివేయడమే లక్ష్యంగా పెట్టుకొని ఇదే "మేక్ ఇన్ ఇండియా" అంటున్నాడు. సామ్రాజ్యవాద, భూస్వామ్య, దళారీ నిరంకుశ బడా బూర్జువా వర్గాల స్వార్థప్రయోజనాల కోసమే, భూ అధిగ్రహణ్ ఆర్డినెన్స్, ఎఫ్.డి.ఐల ప్రవేశం, కార్మిక చట్టాల సవరణలు అమలు చేస్తున్నారు. ప్రజలను స్వావలంబన నుండి పరాధీనత వైపు గెంటివేస్తున్నారు. హిందుత్వ బ్రాహ్మణీయ మతోన్మాద ఫాసిస్టు విధానాలతో పీడిత ప్రజల, మైనార్టీ ప్రజలపై దాడులను తీవ్రతరం చేస్తున్నారు. నరేంద్రమోడీ బాటలోనే ఒడిశా ముఖ్యమంత్రి నవీన్‌పట్నాయక్ కూడా సామ్రాజ్యవాద అనుకూల విధానాలను అమలు చేస్తున్నాడు.

ఒడిశా రాష్ట్రం కోరాపుట్ జిల్లాలో పుష్కలంగా వున్న సహజ ప్రకృతి ఖనిజ సంపదలను ప్రభుత్వం వేదాంతా, పోస్కో, జిందాల్, టాటా, ఎస్.ఆర్ వంటి బహుళజాతి కంపెనీలకు దారాదత్తం చేసి ఆదివాసీలను నిర్వాసితులను చేస్తున్నది. నిర్వాసిత సమస్య వలన పొట్టంగి బ్లాక్‌లో బాగ్‌డొంగర్, కోరాపుట్‌లో దొంగుదేవులా, ఎచ్.ఎ.ఎల్, మాలి, దేవమాలి, కొండమాలి, షేరుబంధా, చైనాక్లే మొదలైన సమస్యలపై ఆదివాసీలు పెద్దఎత్తున ఉద్యమిస్తున్నారు. దీనివల్ల కార్మికులు, రైతాంగం, మధ్యతరగతి ప్రజలు, దళితులు, ఉద్యోగులు, ఆదివాసీలు, మహిళలు మొత్తం పీడిత ప్రజలు వివిధ సమస్యలపై నిరంతరంగా పోరాటాలు చేస్తున్నారు. ఈ మొత్తం ఉద్యమాలకు మావోయిస్టు పార్టీ సంపూర్ణ మద్ధతు ఇస్తుంది. దోపిడీకి గురవుతున్న ప్రజల పక్షాన నిలిచి పోరాడుతున్న మా పార్టీని నిర్మూలించడానికి దోపిడీ పాలకవర్గాలు ఆపరేషన్ గ్రీన్‌హంట్ 3వ దశను అతి వేగంగా అమలు చేస్తున్నది. సామాన్య ప్రజలపై దాడులు, హత్యలు చేసి భయభ్రాంతులకు గురి చేయడమే ప్రభుత్వలక్ష్యంగా పెట్టుకున్నది. రెండోవైపు ప్రజలను పోరాటమార్గం నుండి పక్కదోవ పట్టించడానికి కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు బూటకపు సంస్కరణలను అమలు చేస్తున్నాయి. వాటిలో భాగమే కోరాపుట్ జిల్లా కలెక్టర్ ఆడుతున్న ఆపరేషన్ బ్లూ మూన్ నాటకం. ఈ సంస్కరణలు ఏవి కూడా పీడిత ప్రజల కోసం తెస్తున్నవి కావు. ఇవి దోపిడీ వర్గాలు చేస్తున్న దోపిడీని కప్పిపుచ్చుకొని మరింత వేగం చేయడం కోసమే. అందుకే ఆపరేషన్ బ్లూ మూన్ పేరుతో వచ్చే అధికారులను నిలదీయాలి. ఆపరేషన్ బ్లూ మూన్‌ను బహిష్కరించాలి. అమాయక ఆదివాసీలపై పోలీసు బలగాలు చేస్తున్న అమానవీయ దాడులనూ, బూటకపు ఎన్‌కౌంటర్లనూ, అక్రమ అరెస్టులను ఖండించి ప్రజాపోరాటాలను సమర్ధించాలని శ్రీకాకుళం–కోరాపుట్ డివిజనల్ కమిటీ ప్రజలకూ, ప్రజాస్వామికవాదులకూ, మేధావులకూ, విద్యార్ధులకూ, ఉద్యోగులకు విజ్ఞప్తి చేస్తున్నది. అంతిమంగా ఈ దోపిడీ వ్యవస్థను కూల్చకుండా పీడిత ప్రజలు విముక్తి కాజాలరు. సమస్త పీడిత ప్రజల విముక్తికై వర్గపోరాటాన్ని అభివృద్ధి చేస్తూ ప్రజాయుద్ధం ద్వారా సామ్రాజ్యవాద, భూస్వామ్య, దళారీ, బడా బూర్జువా వర్గాల రాజ్యాంగ యంత్రాంగాన్ని ధ్వంసం చేసి ప్రజల ప్రజాస్వామిక రాజ్యాన్ని నిర్మించుకుందామని ప్రజలకు పిలుపునిస్తుంది.

**డిమాండ్‌లు**


- ఆపరేషన్ బ్లూ మూన్ ను వ్యతిరేకిందాం.
- దున్నేవారికే భూమి అనే నినాదంతో నారాయణపట్నం, బందుగాం భూమిని తిరిగి స్వాధీనం చేసుకొని ఆదివాసీలకు పంచాలి.
- మాలి,దేవమాలి, షేర్‌బంధా,దంగుదేవులా,బాగ్‌డొంగర్ ఒప్పందాలను రద్దు చేయాలి.
- నాల్కో, హెచ్.ఎ.ఎల్ నిర్వాసిత ప్రజల డిమాండ్‌లను పరిష్కరించి నిర్వాసిత ప్రజలకే ఉద్యోగాలు ఇవ్వాలి. మిగిలిన భూములను వారికే పంచాలి.
- నూకదొర (మూకదొర) కుమ్మరులను ఆదివాసీలుగా గుర్తించాలి.
- పోలీసు క్యాంపులను ఎత్తివేసి కూంబింగ్ పేరుతో ప్రజలపై చేస్తున్న దాడులనూ, హత్యలనూ, అత్యాచారాలను నిలిపివేయాలి.
- పోరాడే ప్రజలపై పెట్టిన కేసులన్నింటిని ఎత్తివేసి సింగన్న, ఆంధ్రు ఎన్‌కౌంటర్ల నిజానిజాలను బయటపెట్టాలి.

**విప్లవాభివందనాలతో**

**శ్రీకాకుళం–కోరాపుట్ డివిజన్ కమిటీ**

**సి.పి.ఐ (మావోయిస్టు)**

1-10-2015



*"ప్రస్తుతం ఉద్యమం లక్షణాలు ఏవి? దాని సూత్రాలు ఏవి? దానికి ఎలా దిశా నిర్దేశం అందించాలి? ఇవన్నీ ఆచరణాత్మకమైన సమస్యలు. ఉద్యమం అభివృద్ధి అవుతుంది. నూతన విలువలు ఇంకా పుట్టుకొచ్చేది ఉంది. ఇవి నిరంతరాయంగా పుట్టుకొస్తునే వున్నాయి. ఈ ఉద్యమాన్ని సమగ్రంగానూ అభివృద్ధి చెందుతున్నక్రమంలోనూ అధ్యయనం చేయడం అనేది మనం నిరంతరం శ్రద్ధ వహించవలసిన ఒక గొప్ప కర్తవ్యం. ఈ సమస్యను జాగ్రత్తగా సీరియస్‌గా అధ్యయనం చేయ నిరాకరించేవారు మార్క్సిస్టులేకారు"*

– కా॥ మావో

# అమర వీరుల సంస్మరణ వారాన్ని (జులై 28-ఆగస్టు) గ్రామ గ్రామాన విజయవంతం చేద్దాం!

# వారి త్యాగాల సాంప్రదాయాన్ని ఎత్తిపడుతూ ఘనమైన విప్లవ నివాళులర్పిద్దాం!!

**అమరవీరులారా !**

**భారతమాత విముక్తికై**

**మీరు చేసిన పెనవేల త్యాగాలు**

**విముక్తి గాయాలై**

**శ్రమ విముక్తికై**

**మీరు చేసిన సాయుధ సంగ్రామాలు**

**విజయ కేతనాలై**

**విరజిమ్మెను దేశ నలుదిశలు**

**వికసించెను విశ్వశాంతివీరులై...!!**

*ప్రియమైన ప్రజలారా...*

భారతదేశ విప్లవోద్యమ చరిత్రలో జులై 28కు చాలా విలువైన ప్రాముఖ్యత ఉంది. భారతమాతను దోపిడీ పీడనలనుండి విముక్తి చేయడం కోసం మనిషిని మనిషి దోచుకునే వ్యవస్థను ధ్వంసం చేయడం కోసం ఎంతో మంది భారతమాత పుత్రులు, పుత్రికలు తమ నులివెచ్చని నెత్తుటిని ధారపోశారు, పోస్తున్నారు. ఆ విప్లవ వీరులను, వారి నిస్వార్థ త్యాగాలను, వారి ఆదర్శ జీవితాలను స్మరించుకునే అత్యంత ఉద్వేగభరితమైన దినం. భారతదేశ విప్లవోద్యమంలో వసంత మేఘగర్జనగా పేరు గాంచిన నక్సల్బరీ పోరులో సరైన పంథాను నిర్దేశించిన కామ్రేడ్ చారుమజుందార్ అమరత్వం చెంది ప్రజల గుండెల్లో శాశ్వతంగా నిలిచిన దినం. తమ ప్రియతమ అమరుల త్యాగాల బాటలో ముందుకు నడుస్తామని వారు కన్న కళలను నిజం చేస్తామని భారత విప్లవ ప్రజానీకం ప్రతిజ్ఞ చేసే ఉత్తేజభరితమైన దినం. 1967 నాటి పోరాట కాలంలో ప్రారంభమైన త్యాగాల బాటలో దేశవ్యాపితంగా ఇప్పటివరకు వేలాదిమంది నాయకులు, కార్యకర్తలు, పి.ఎల్.జి.ఎ కమాండర్లు, యోధులు మరియు విప్లవ ప్రజలు తమ ప్రాణాలను అర్పించి భారతదేశ నూతన ప్రజాస్వామిక విప్లవం విజయవంతానికి ఎర్రబాటలు వేసారు. వారందరికి ఎమ్.కె.వి.బి-డి.వి.సి దృఢసంకల్పంతో పిడికిలి బిగించి జోహార్లర్పిస్తుంది. ప్రతి సంవత్సరం లాగానే ఈ సారి కూడా అమరుల నిస్వార్థపూరిత ఆలోచనలను అచరణను వారి అంకుటిత దీక్షను దృఢసంకల్పాన్ని వారి ధైర్యసాహసాలను స్మరించుకుంటూ వారికి తలవంచి వినమ్రంగా జోహార్లు అర్పిస్తూ అమరవీరుల సంస్మరణవారాన్ని విజయవంతం చేయాలని ప్రజలకు పిలుపునిస్తుంది.

కేంద్రంలో మోదీ, ఒడిశాలో నవీన్‌పట్నాయక్, ఎ.పిలో చంద్రబాబునాయుడు ఫాసిస్టు ప్రభుత్వాలు ఏర్పడిన నాటి నుండి దళారీ నిరంకుశ బూర్జువా, భూస్వామ్యవర్గాల కొమ్ముకాస్తూ సామ్రాజ్యవాదులకు ఊడిగం చేస్తూ ఆపరేషన్ గ్రీన్‌హంట్-3ను తీవ్రతరం చేస్తున్నాయి. జల్, జంగల్, జమీన్, ఇజ్జత్, అధికార్ నినాదంతో జరుగుతున్న ప్రజా ఉద్యమాలపై తీవ్ర పాశవిక సాయుధ అణచివేతను ప్రయోగిస్తున్నాయి. మన డివిజన్ ప్రాంతంలో సుదీర్ఘకాలంగా భూమి, భుక్తి, విముక్తి కోసం, విస్తాపనకు వ్యతిరేకంగా, ప్రభుత్వ నిర్బంధానికి వ్యతిరేకంగా పోరాటాలు జరుగుతుండటంతో సహించలేని చంద్రబాబు, నవీన్‌పట్నాయక్ ప్రభుత్వాలు కేంద్రప్రభుత్వంతో మిలాఖతై ఆదివాసీ ప్రాంతాలన్నింటిని వేలాది ఖాకీ బలగాలతో నింపేస్తున్నారు. ఈ దోపిడీ పాలక వర్గాలు తమ అధికార బలంతో బహుముఖ రూపాల్లో ప్రజలపై నిర్బంధాన్ని ప్రయోగిస్తున్నాయి.

ప్రజాఉద్యమాలకు నాయకత్వం వహిస్తున్న పార్టీని తుదముట్టించాలనే తలంపుతో గత సంవత్సరం ఆగస్టులో మల్కనగిరి జిల్లా మాజీగూడ పంచాయితీ జామ్‌జోడి గ్రామ సమీపంలో స్థానిక దళాన్ని శత్రువు చుట్టుముట్టి కాల్పులు జరపగా వీరోచితంగా పోరాడుతూ కామ్రేడ్ లాలు (ఎ.ఎమ్.సి) అమరుడయ్యాడు. ఈ సంవత్సరం ఏప్రిల్ నెలలో తీవ్ర అనారోగ్యానికి గురై కామ్రేడ్ జోగాల్ అమరుడయ్యాడు. జనవరి నెలలో అపరేషన్ ఆలౌట్‌లో భాగంగా పడవపై ప్రయాణిస్తున్న ప్రజలపై శతృవు విచక్షణా రహితంగా కాల్పులు జరపగా నారింజోలా గ్రామానికి చెందిన బుద్దు అక్కడికక్కడే మృతి చెందాడు.

పార్టీ నాయకత్వంలో సామ్రాజ్యవాదానికి, భూస్వామ్యానికి, నిరంకుశ పెట్టుబడిదారి విధానాలకు వ్యతిరేకంగా దేశ వ్యాపితంగా విశాల ప్రజానీకం సమీకరించబడుతూ ప్రజా ఉద్యమాలు నడుస్తున్నాయి. విప్లవ ప్రజలు పి.ఎల్.జి.ఎతో జతకలిసి వర్గ శతృవులతో పోరాడుతూ అనేక త్యాగాలు చేసారు. ముఖ్యంగా దండకారణ్యంలో క్రాంతికారీ జనతన సర్కార్‌లు శతృ నిర్బందం మధ్యనే నిలదొక్కుకుంటూ ప్రజల అధికారాన్ని నిలబెడుతున్న క్రమంలో పి.ఎల్.జి.ఎ వీర గెరిల్లాలు విప్లవ ప్రజానీకం అమరులయ్యారు. బీహార్, జార్ఖండ్, తెలంగాణ, ఒడిశా, మహారాష్ట్ర తదితర విప్లవ ప్రాంతాల్లో అనేక మంది దేశభక్తులు ఈ కుళ్ళు వ్యవస్థను ధ్వంసం చేయడంలో భాగంగా మృత్యువును కూడా అహ్వానించారు. వారి మరణం భవిష్యత్ తరాలకోసమే. సమసమాజ స్థాపన కోసమే. వారందరికి పేరు పేరునా విప్లవ నివాళులర్పిద్దాం.

దేశం నేడు ఆర్.ఎస్.ఎస్ నాయకత్వంలో మోదీ ప్రభుత్వపు బ్రహ్మణీయ హిందూ ఫాసిజం ప్రమాదాన్ని ఎదుర్కొంటుంది. హిందీ-హిందూ-హిందుస్తాన్ అనే నినాదంతో ప్రభుత్వం దేశంలో అల్పసంఖ్యాక జాతులను, మతాలను, దళితులను, ఆదివాసీలను అభద్రతలోకి నెట్టివేస్తుంది. వీరిపై దాడులు రోజురోజుకు పెరుగుతున్నాయి. మతోన్మాద పాలకులు మన్, మానే విధానాలతో భారత మహిళల బతుకుల్ని చెప్పనలవిగానివిగా తయారు చేసారు. జాతీయత, స్వాదేశీయత, దేశభక్తి నినాదాలతో పదే పదే ఊదరగొట్టే బి.జె.పి, ఆర్.ఎస్.ఎస్, భజనలు పచ్చి బూటకం. ఆచరణలో స్వదేశీ, విదేశీ కార్పోరేట్ శక్తులకు సేవ చేయటమే తమ విధానం. అందుకు ప్రస్తుత దివాలాకోరు ప్రజావ్యతిరేక ఆర్థిక విదానాలే ప్రభల నిదర్శనం. నిర్దిష్టంగా మన డివిజన్‌లో భూమి, విస్తాపిత నిర్బంధం సమస్యల్ని అన్ని రకాల జాతులను, తెగలు సెక్షన్‌ల ప్రజలు సీరియస్‌గా ఎదుర్కొంటున్నారు. ప్రజల మౌళిక దైనందిన సమస్యల్ని

పరిష్కరించలేని బి.జె.డి, టి.డి.పి ప్రభుత్వాలు పోరాడుతున్న ప్రజలపై ఫాసిస్టు నిర్బంధాన్ని ప్రయోగిస్తున్నాయి. కార్పోరేట్లకు దోపిడీ మార్గాన్ని సుగమం చేసేందుకు రోడ్లు, కమ్యూనికేషన్, బ్రిడ్జిలు, పోలీసు క్యాంపులు నిర్వహిస్తుండటంతో ఆదివాసీ బ్రతుకులు అగమ్యగోచరంగా తయారయ్యాయి. ప్రస్తుత ఈ పరిస్థితిని అధిగమించేందుకు అమరుల పోరాట స్ఫూర్తితో ధైర్యసాహసాలతో ప్రజాయుద్ధంలో ముందుకు దూకటం తప్ప మరో మార్గం లేదు.


సామ్రాజ్యవాద కబంద హస్తల్లో నలిగిపోకుండా ప్రభుత్వాల దోపిడీ వెల్లువలో కొట్టుకుపోకుండా ఈ రోజు ఈ మాత్రమైన మనం (ఆదివాసీలం, పీడితప్రజలం) నిలబడ గలిగామంటే, ఆత్మగౌరవంతో బతుకుతున్నామంటే ఎంతో మంది అమరులు తమ రక్తాన్ని చిందించడం వల్ల విప్లవ ప్రజానీకం రోజువారిగా చేస్తున్న అత్యున్నత త్యాగాల వల్లనే అనే విషయాన్ని మనం మర్చిపోకూడదు. "కష్టాలకు జంకకూడదు, చావుకు వెరవద్దు" అనే కామ్రేడ్ మావో మాటలను తూ.చ తప్పకుండా పాటించిన అమరులు నిజమైన ప్రజావీరులు. వారి ప్రజాసేవా తత్పరత, త్యాగగుణం, సాహసం, పట్టుదల, తిరుగుబాటుతత్వం, విప్లవ కాంక్షా భావితరాలకు ఆదర్శం. వారి ఆదర్శ భావాలు ఆచరణ విప్లవకారులందరికీ అనుసరణీయమే.

ప్రజా రాజ్యధికారం కాంక్షతో కొనసాగుతున్న ఉద్యమాన్ని అణచివేసేందుకు మన ప్రియతమ కామ్రేడ్స్‌ను భౌతికంగా నిర్మూలించి తమ ఉనికిని కాపాడుకోవాలంటున్న దోపిడీ పాలక వర్గాల కుట్రలను భగ్నం చేద్దాం. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలతో నలిగిపోతున్న ప్రజలను విప్లవంలోకి విస్తృతంగా సమీకరిద్దాం. గెరిల్లా యుద్ధాన్ని తీవ్రతరం చేసి మాతృభూమిని దేశ సంపదను కాపాడుకుందాం. నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేసి అమరుల కళలను నిజం చేద్దాం. వారిని మృత్యుంజయులని చాటుదాం.

- **అమరుల త్యాగాలని ఎత్తిపడదాం-వారి ఆదర్శాలను ఆనుసరిద్దాం !**
- **పారుబోతుతనాన్ని ద్వేశిద్దాం-వీరుల త్యాగాల బాటల్లోనే నడుద్దాం !!**
- **ప్రజారాజ్యాధికారాన్ని సాదిద్దాం-అమరుల కళల్ని నిజం చేద్దాం !!!**

**విప్లవాభినందనాలతో**
**ఎమ్.కె.వి.బి డివిజనల్ కమిటీ**
**సి.పి.ఐ (మావోయిస్టు)**

బో



"మన పార్టీ అంతటిలోనూ 'ప్రజల నుండి ప్రజల వద్దకు' అనే సూత్రంపై ఆధారపడి మాత్రమే సరైన నాయకత్వం అభివృద్ధి చెందుతుంది. దీని అర్థం ప్రజలలో ఉండే భావాలను తీసుకోవాలి. వాటిని సమీక్షించాలి. అధ్యయనం ద్వారా వాటిని సమన్వయ పరిచి క్రమమైన భావాలుగా మలచాలి. తిరిగి ప్రజల వద్దకు తీసుకెళ్ళాలి. ప్రజలు వాటిని తమవిగా భావించి స్వీకరించే వరకు వాటికోసం నిలబడి కార్యాచరణకు ఉపక్రమించేటట్లు చేసేంతవరకు ఆ భావాలను ప్రజలలో ప్రచారం చేస్తూ వివరించాలి. ఈ భావాలు ఆచరణలో సరైనవో కావో పరిక్షించాలి. తర్వాత మళ్ళీ ప్రజల నుండి భావాలను గ్రహించి సమీక్షించి తిరిగి ప్రజల వద్దకు తీసుకెళ్ళి వారు హృదయపూర్వకంగా ఆ భావాలను ఆమోదించేలా చేయాలి. ఈ విధంగా మరలా మరలా ఎడతెరిపి లేకుండా చేయడం వల్ల ప్రతిసారి భావాలు మరింత సరైనవిగా మరింత శక్తివంతంగా మరింత సుసంపన్నంగా తయారు అవుతాయి ఇదే మార్క్సిస్టు జ్ఞాన సిద్ధాంతం"

- కా॥ మావో

**పత్రికా ప్రకటన**

# కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఆపరేషన్ గ్రీన్‌హంట్ పేరుతో ప్రజలపై అమలు జరుపుతున్న బహుముఖ దాడిని ప్రజాయుద్ధం ద్వారా ప్రతిఘటించి ఓడిద్దాం!

## జులై 1 నుండి 7 వరకు నిర్బంధ వ్యతిరేఖ నిరసన వారం పాటిద్దాం!

*ప్రియమైన ప్రజలారా...*

ప్రజలకోసమే పని చేస్తున్నామంటున్న ప్రభుత్వాలు పోలీసుల అర్థసైనిక బలగాలు ఈ దేశ ప్రజలపైననే ఎందుకు, ఎవరి ప్రయోజనాల కోసం అప్రకటిత యుద్ధాన్ని అమలు చేస్తున్నాయి? ఈ దాడిలో వారు ఎలాంటి క్రూరమైన, దుర్మార్గమైన, అమానవీయమైన పద్ధతులు అనుసరిస్తున్నారు? జీవించే హక్కును సైతం కాలరాస్తున్న అప్రజాస్వామిక అన్యాయమైన, నీచమైన ఈ యుద్ధం గురించి ప్రతిఒక్కరు ఆలోచించాలి, ప్రశ్నించాలి. ప్రతిఘటించడానికి ప్రజలు, ప్రజాస్వామిక వాదులు, విద్యార్థి, మేధావులు ఈ దేశ పౌరులందరూ ముందుకు రావలసిన సమయం ఆసన్నమైందని పిలుపునిస్తున్నాం.

సామ్రాజ్యవాదులు ప్రపంచంలో వెనకబడిన దేశాలను, ప్రజల శ్రమను, మార్కెట్‌ను దోచుకోవడానికి రూపొందించిన ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ, ఉదారీకరణ (ఎల్.పి.జి) విధానాలను మన దేశంలో అమలు చేయడానికి అనుగుణంగా ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక వ్యవస్థలను మలచడానికి ఈ దేశ పాలకులు నిసిగ్గుగా ఆమోదించారు. ఏ పార్టీ ప్రభుత్వం అధికారంలో ఉన్న ఈ విధానాలను పోటిపడి చట్టాలను, రక్షణ తదితర అన్ని వ్యవస్థలను సామ్రాజ్యవాద రథ చక్రాలకు కట్టి పడేసారు. దీని ఫలితంగా ప్రపంచ సామ్రాజ్యవాద ఆర్థిక వ్యవస్థలో ప్రతి ఒడిదుడుకులు సంక్షోభాలకు మన దేశ రాజకీయ, ఆర్థిక వ్యవస్థలు ప్రభావితం అవుతున్నాయి. ఈ దేశ ప్రజల ప్రయోజనాలను సామ్రాజ్యవాదులకు తాకట్టు పెట్టి కీలుబొమ్మలుగా పని చేస్తూ మన దేశ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధిలో ముందుకు దూసుకుపోతున్నామని ప్రజలను నమ్మించడానికి పడరాని పాట్లు పడుతున్నారు.

ప్రపంచాన్ని దోచుకుంటున్న ప్రజల నెంబర్-1 శత్రువైన అమెరికన్ సామ్రాజ్యవాదం అతిపెద్ద ఆర్థిక వ్యవస్థను కలిగి వుంటునే నిరంతరం సంక్షోభాన్ని ఎదుర్కొంటూ వస్తున్నది. అయితే అది 2008 నాటికి గొంతులోతు సంక్షోభంలోకి కూరుకుపోయింది. ఈ సంక్షోభం పరిష్కారానికి అది వెనకబడిన దేశాలను దోచుకోవడానికి మరింత బరితెగించింది. తమ మాట వినని దేశాలపై యుద్ధం ప్రకటించి దురాక్రమణకు పాల్పడటం, మరికొన్ని దేశాలలో అంతర్గత విషయాలలో జోక్యం కుట్రలకు పాల్పడటం, తిరుగుబాట్లు వేగవంతం చేయడం, కొందరిని లొంగదీసుకోవడం ద్వారా కీలుబొమ్మ ప్రభుత్వాలను ఏర్పాటు చేయడం, పోరాడుతున్న ప్రజలను, జాతులను విప్లవోద్యమాలను టెర్రరిస్టులుగా ముద్రవేసి ప్రపంచ టెర్రరిజాన్ని ఎదుర్కోవడం పేరుతో అన్ని దేశాలు ఐక్యం కావాలని పిలుపునిస్తున్నాయి. అన్ని పెట్టుబడిదారి వ్యవస్థలు ప్రపంచ ఆర్థిక సంక్షోభం సుడిగుండంలో చిక్కుకున్నాయి. అందులో మన దేశ ఆర్థిక వ్యవస్థ అతీతంగా లేదు. ఈ సంక్షోభ భారాన్ని ప్రపంచ ప్రజలపై మోపి వారిని దోచుకోవడం ద్వారా గట్టెక్కాలని చూస్తున్నారు.

సామ్రాజ్యవాదుల ప్రయోజనాలకు మన దేశ వనరులను, సంపదలను, ప్రజల శ్రమశక్తిని దోచిపెట్టడానికి మన పాలకులు సిద్ధపడి ప్రజావ్యతిరేక విధానాలను అమలు చేయడంలో పోటీ పడుతున్నారు. నరేంద్రమోడీ నాయకత్వంలో ఎన్.డి.ఎ ప్రభుత్వం మరింత బరితెగించి దేశాన్ని అమ్మకానికి పెడుతున్నది. "మేక్ ఇన్ ఇండియా'' (ఇండియాలో తయారీ చేయండి) నినాదంతో ప్రపంచమంతా తిరిగి కార్పోరేట్ సంస్థలకు స్వాగతం పలుకుతూ ఎర్రతివాచీ పరుస్తున్నారు. వారి పెట్టుబడుల ద్వారా దేశంలో ఉత్పత్తులు పెరిగి మన ఆర్థిక వ్యవస్థ చాలా అభివృద్ధి సాధిస్తుందనీ, ఉపాధి లభిస్తుందని ప్రజలను నమ్మించడానికి ప్రయత్నిస్తున్నారు. కార్పోరేట్ కంపెనీలకు మౌళిక వసతుల ఏర్పాటు, సబ్సిడీల కల్పన, అమ్మకపు పన్ను రద్దు, కార్మిక చట్టాలలో మార్పులు, ప్రభుత్వ రంగ సంస్థలలో పెట్టుబడులు ఉపసంహరణ ప్రజా ఉద్యమాల అణచివేతకు ఫాసిస్టు చట్టాల రూపకల్పనకు అంగీకారం తెలిపారు.

నూటికి డెబై మంది వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్న రైతాంగ దేశం మనది. "దున్నేవారికే భూమి కావాలి" అనే నినాదంతో దశాబ్దాలుగా పోరాడుతున్నారు. బడా భూస్వాముల కబంద హస్తాలలో వున్న భూములను పంపిణీ చేయకపోగా ప్రస్తుత భూసేకరణ చట్టంలో సవరణలు చేసి బలవంతంగా రైతాంగ పంట భూములను కార్పోరేట్ సంస్థలకు అప్పగించే నిర్ణయం తీసుకున్నారు. 2004-2009 నాటకి 14 కోట్లమంది రైతాంగం వ్యవసాయం వదులుకొని పట్టణాలకు వలస కూలీలుగా వెళ్ళారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం ఇప్పటికీ 12కోట్లమంది నిరుద్యోగులున్నారు. ప్రతి సంవత్సరం 1కోటి 20లక్షల మందికి కొత్తగా ఉపాధి కావాల్సి వస్తున్నది. 2014-2015 ఆర్థిక సంవత్సరంలో 5లక్షల 40వేల మందికి మాత్రమే ఉపాధి లభించింది. సామ్రాజ్యవాదులు పెట్టుబడులు పెడితే దేశం అభివృద్ధి చెందడం, ఉపాధి కల్పించడం కాదు కదా వున్న వనరులను, సంపదలను సామ్రాజ్యవాదులకు అప్పగించి ఉపాధి కోల్పోయి నిరుద్యోగులుగా చివరకు బానిసలుగా మారడం లేదా ఆత్మహత్యలే శరణ్యం అవుతాయి.

ఆదివాసీ ప్రాంతాలలో గనుల తవ్వకం, భారీ డ్యాంల నిర్మాణం ద్వారా భూములు సహజ వనరులను కోల్పొయి కోట్లాది మందిని నిర్వాసితులను చేసి ఎవరిని అభివృద్ధి చేస్తున్నారన్నది ప్రతి ఒక్కరు ఆలోచించాల్సిన అవసరం వుంది. "బడా బాబుల అభివృద్దే ఈ దేశ అభివృద్ధి అయితే అలాంటి అభివృద్ధి మాకొద్దు, మీరు మాకేమీ

ఇవ్వకండి కానీ మా అడవులను, సహజ వనరులను, ప్రకృతి పర్యావరణాన్ని ధ్వంసం చేయకండి'' అని ఆదివాసీలు పోరాడుతున్నారు. ఉపాధి లేని నిరుద్యోగులు, ఉద్యోగాలు కోల్పోయిన కార్మికలు, చాలి చాలని జీవితంతో బతుకెళ్లదీస్తున్న పిడికెడు మంది ఉద్యోగులు, అధిక ధరలపై గల భారం, నిత్యం అత్యాచారాలు, లైగింక వేధింపులకు వ్యతిరేకంగా మహిళలు, హిందూ మతోన్మాదానికి వ్యతిరేకంగా మత మైనార్టీలు, కులవివక్షకు వ్యతిరేకంగా దళితులు, హక్కుల కోసం కార్మికులు ప్రజాస్వామ్యం కోసం అన్ని వర్గాల ప్రజలు పోరాడుతున్నారు. సామ్రాజ్యవాదుల పాదసేవలో తరించిపోతున్న పాలకులు ప్రజల మౌళిక సమస్యలే కాదు కనీస ప్రాథమిక అవసరాలను కూడా తీర్చలేరని ఇన్నేళ్లుగా రుజువైంది. పైగా పోరాడుతున్న ప్రజలను వారికి నాయకత్వం లేకుండా చేయడానికే అణచివేతను ఏకైక సాధనంగా ఎంచుకున్నది.

2009లో ఆపరేషన్ గ్రీన్‌హంట్ పేరుతో ప్రారంభమైన బహుముఖ దాడి విప్లవోద్యమం నడుస్తున్న ఆదివాసీ ప్రాంతాలలో కేంద్రీకరించబడింది. ప్రతి 5-10కిలోమీటర్లకు ఒకటి చొప్పున పోలీసు క్యాంపులు పెట్టారు. వేలాది మంది బి.ఎస్.ఎఫ్, సి.ఆర్.పి.ఎఫ్, ప్రత్యేక బలగాలైన గ్రేహౌండ్స్, ఎస్.ఒ.జి, కోబ్రా బెటాలియన్‌లు మోహరించారు. కూంబింగ్‌ల పేరుతో అడవులను గాలింపు, గ్రామాలపై దాడులు, అక్రమ అరెస్టులు, రోడ్లపై తనికీలు నిత్యకృత్యమయ్యాయి. గత 4సంIIరాలలో లమ్తాపుట్ బ్లాక్‌లో పీతల వేటకు వెళ్ళిన లిటిపుట్ గ్రామస్తుడు గంగాధర్ కిర్సానే అనే వ్యక్తిని బి.ఎస్.ఎఫ్ జవాన్లు కాల్చి చంపారు. గుమ్మ బ్లాక్ రాళ్ళగడ్డ పంచాయితీలో రాత్రి సమయంలో వేటకు వెళ్ళిన రైతులను కాల్చి చంపి ఎన్‌కౌంటర్ అని ప్రకటించారు. వెలంపాక గ్రామస్తుడు వేణును ఇంటినుండి అరెస్టు చేసి తీసుకెళ్ళి లాకప్‌లో చంపి ఎన్‌కౌంటర్ అని ప్రకటించారు. ఈ సంవత్సరం జనవరిలో అపరేషన్ ఆల్ ఔట్ పేరుతో ఎ.పి-ఒడిశాలలో వేలాది మంది పోలీసు బలగాలతో చేపట్టిన అభియాన్‌లో చేపల వేటకు వెళ్ళిన నారింజోల గ్రామస్తుల పడవపై కాల్పులు జరిపి బుద్దానీసాను కాల్చి చంపి, ఒకరిని గాయపరిచి మరొకరిని అరెస్టు చేసారు. ఈ నాటికి వారిద్దరి ఆచూకీ లభించలేదు. విశాఖజిల్లా లువ్వసింగిలో ఇద్దరిని, కోటిపల్లె గ్రామంలో ముగ్గురు సామాన్య ఆదివాసీలను కాల్చిచంపి ఎన్‌కౌంటర్ కథనాలు చెప్పారు. మహిళలపై అత్యాచారాలకు అంతులేకుండా పోయింది. వందలాది మంది ఆదివాసీలపై తప్పుడు కేసులు బనాయించి జైళ్ళలో నిర్భంధించారు. పోలీసుల చేతిలో శారీరక చిత్రహింసలకు గురైనవారు తిరిగి పనులు చేసుకోలేకపోతున్నారు. ఎన్నో కుటుంబాలు చిన్నాభిన్నం అయిపోతున్నాయి. ఆదివాసీలు సాంప్రదాయ ఆయుధాలు ధరించడం ప్రభుత్వ దృష్టిలో నేరమయ్యింది. వాటిని కూడా స్వాధీనం చేసుకొని తప్పుడు కేసులు బనాయిస్తున్నారు. ప్రజలు సంతలకు, వైద్యం కొరకు, పిల్లలను పాఠశాలలకు పంపడం కొరకు, ప్రభుత్వ పథకాల నిధుల కోసం బయటకు వెళ్ళినప్పుడు, పంట పొలాలకు కాపలా వెళ్ళినప్పుడు, బంధువుల ఇళ్ళకు వెళ్ళిన సమయాలలో అరెస్టులు చేయడం, బెదిరించడం, లొంగదీసుకోవడం, ఇన్‌ఫార్మర్‌గా మారమని వత్తిడి చేయడం వంటివి చేస్తున్నారు. దీంతో ప్రజలు ఇంటిని, గ్రామాన్ని వదిలి కాలు బయట పెట్టడానికి జంకుతున్నారు. శతృవు సైన్యాల ధిగ్బంధంలో వున్న ప్రాంతాలలో జీవిస్తున్నట్లుగా ఉంది ప్రజల పరిస్థితి. గ్రామాలకు వస్తున్న అంగన్‌వాడీ, ఎ.ఎన్.ఎమ్స్, టీచర్లు తదితర ప్రభుత్వ ఉద్యోగులను పార్టీ సమాచారం సేకరించమని బలవంతం చేస్తున్నారు. గ్రామ పెత్తందార్లను, ప్రజావ్యతిరేకులను సమీకరించి ప్రజలకు, పార్టీకి వ్యతిరేకంగా నిలబెడుతున్నారు. మతం ముసుగులో శతృవు ఏజెంట్లను తెచ్చి విప్లవ వ్యతిరేక కార్యకలాపాలను ప్రోత్సహిస్తున్నారు. నిరుద్యోగులు, లుంపెన్ యువకులకు డబ్బు ఆశ చూపి కొందరిని ఇన్‌ఫార్మర్‌లుగా మార్చుకుంటున్నారు. విప్లవోద్యమం నుండి దిగజారిపోయిన మాజీలకు, విప్లవ ద్రోహులకు ఆయుధాలిచ్చి ప్రజలపై దాడులకు ముందు నిలుపుతున్నారు. ప్రభుత్వం పోలీసులపై ప్రజలలో పెరుగుతున్న వ్యతిరేకతను కప్పిపుచ్చుకోవడానికే జన సంపర్క శిభిరాలు(సివిక్ యాక్షన్ ప్రోగ్రామ్) నిర్వహించి వస్తువుల పంపిణీ, మెడికల్ క్యాంపులు పెట్టడం, పోలీసు అధికారులు, రాజకీయ నాయకులు గ్రామాలను దత్తత తీసుకోవడం లాంటివి చేపడుతున్నారు. మౌళిక సమస్యలపై పోరాటాల నుండి ప్రజలను పక్కదారి పట్టించడానికి మరికొన్ని కంటితుడుపు సంస్కరణలు చేపడుతున్నారు. ఒక పథకం ప్రకారం పార్టీ విప్లవోద్యమంపై తమ చెప్పు చెతుల్లో వున్న మీడియాను ఉపయోగించుకొని పోస్టర్లు, కరపత్రాల ద్వారా అసత్య ప్రచారాన్ని చేస్తూ ప్రజలలో ఒక సెక్షన్ ప్రజలని గందరగోళపరచాలని చూస్తున్నారు.

పార్టీ నాయకత్వంలో ప్రజలు ఈ దాడిని ప్రతిఘటిస్తూనే ఇంకొకవైపు తమ మౌళిక సమస్యల పరిష్కారం కోసం పోరాడుతున్నారు. విశాఖ జిల్లాలో ప్రభుత్వ ఆధీనంలో ఉన్న ఎ.పి.ఎఫ్.డి.సి వేలాది ఎకరాలలో ఉన్న కాఫీ ప్లాంటేషన్‌ను ప్రజలు స్వాధీనం చేసుకొని సాగుచేసుకుంటున్నారు. ఏజెన్సీలోని బాక్సైట్ నిక్షేపాలను బడా కంపెనీలకు అమ్మడానికి పెట్టి ఆదివాసీలను నిర్వాసితులను చేయడానికి చంద్రబాబు ప్రభుత్వం ఒప్పందాలు కుదుర్చుకుంది. **"ప్రాణాలైనా ఇస్తాం-బాక్సైట్ తవ్వకాలను అడ్డుకుంటాం, భూములు, ఇళ్ళు, పర్యావరణాన్ని కాపాడుకుంటాం"** అని ఆదివాసీలు ముక్తకంఠంతో ప్రతిజ్ఞ చేస్తున్నారు. పోరాటానికి బరిగీసి నిలుస్తున్నారు. గుమ్మ బ్లాక్‌లోని కట్‌ఆఫ్ ఏరియా ప్రజలు నిర్వాసిత సమస్యపై పోరాడుతూనే భూమి సమస్యను పరిష్కరించుకునేందుకు కృషి చేస్తున్నారు. బైఫర్‌గూడ, లమ్తాపుట్ బ్లాక్‌లో భూమి సమస్య కేంద్రంగా కార్యక్రమం రూపొందించుకుంటున్నారు. జల్-జంగల్-జమీన్‌లపై, విద్య, వైద్యం, త్రాగునీరు, సాగునీరు, ఉపాధి, గిట్టుబాటు ధరలు, వడ్డీ వ్యాపారం షావుకారుల దోపిడీకి వ్యతిరేకంగా ఉద్యమిస్తున్నారు. ప్రభుత్వం బాక్సైట్ తవ్వకాలకు మార్గం సుగమం చేయడానికి ప్రజల ప్రతిఘటనను అడ్డుకోవడం కోసం విశాఖ ఏజెన్సీలో 100 పోలీసు క్యాంపులు ఏర్పాటుకై కేంద్రానికి ప్రతిపాదన పంపి ఆమోదం పొందింది. మల్కనగిరి, కోరాపుట్ జిల్లాలలో ముఖ్యంగా కటాఫ్ ఏరియాలో పంచాయితీకి ఒకటి చొప్పున పోలీసు క్యాంపులు పెడతామని ప్రకటించారు. ఆంధ్రా-ఒడిశా పోలీసు బలగాలు సమన్వయం చేసుకొని ఈ ప్రాంతాలలో దాడులను ముమ్మరం చేయడానికి గురుప్రియ బ్రిడ్జి, రోడ్డు నిర్మాణంపై ప్రత్యేక కేంద్రీకరణ పెట్టింది. సెల్‌టవర్లను పెట్టి కమ్యూనికేషన్ వ్యవస్థను మెరుగుపరుచుకొని సమాచార సేకరణకు ప్రయత్నిస్తుంది. దాడులకు సిద్ధమవుతుంది. కట్ ఆఫ్‌లో ఇన్‌ఫార్మర్ నెట్‌వర్క్ ద్వారా

సేకరించుకున్న సమాచారం ఆధారంగా నాయకత్వం లక్ష్యంగా జనవరిలో ఆపరేషన్ ఆల్‌ఔట్ చేపట్టి ఆ సందర్భంగా సాధారణ ఆదివాసీ ప్రజలను కాల్చి చంపి రాజకీయంగా విఫలమైంది. ఆ తదుపరి ప్రజలు పార్టీ కలిసి శత్రువు ఇన్‌ఫార్మర్ నెట్‌వర్క్‌ను గుర్తించి ముఖ్యులను శిక్షించింది. దీంతో ఖంగుతిన్న శత్రువు వాడి ఏజెంట్ల ద్వారా సాధారణ ప్రజలను కూడా మావోయిస్టులు శిక్షిస్తున్నారని తప్పుడు ప్రచారం లేవనెత్తి కొందరిని గ్రామాలు వదిలి రావాలని ఆర్గనైజ్ చేసి వారి ద్వారా అసత్య ప్రకటనలు ఇప్పిస్తున్నారు. సి.పి.ఐ (మావోయిస్టు) నాయకత్వంలో జరుగుతున్న న్యాయమైన ప్రజాయుద్ధంలో ప్రజలు భాగస్వాములవుతూ అశేష పీడిత ప్రజల శత్రువులైన భూస్వాములు, దళారీ నిరంకుశ బూర్జువాలు, సామ్రాజ్యవాదులు వారి కాపాల కుక్కలైన సాయుధ బలగాలకు వ్యతిరేకంగా పోరాడండి. వాళ్ళు చూపే ఆశలకు, ప్రలోబాలకు, భ్రమలకు, కుట్రలకు బలికావద్దనీ, ప్రజల పక్షం నిలబడమని కోరుతున్నాం.

పోలీసు జవాన్‌లారా ! మీరు పీడితులే. ప్రజలు ఈ దేశ సంపదను, వనరులను, ప్రకృతి పర్యావరణాన్ని, దేశ సార్యభౌమత్వాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడటానికి పోరాడుతున్నారు. విచక్షణ కోల్పోయి మీ యజమానులు ఆజ్ఞాపిస్తే ప్రజలపై దాడులు చేస్తున్నారు. ఈ దేశాన్ని అమ్మకానికి పెడుతున్న వాళ్ళే దేశద్రోహులు దానిని కాపాడటానికి పోరాడుతున్న ప్రజలే నిజమైన దేశ భక్తులు వారి పక్షం నిలబడండి.

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై అమలు జరుపుతున్న నిర్బంధానికీ, గ్రామలలో పోలీసు క్యాంపుల ఏర్పాటుకు, మహిళలపై జరుగుతున్న అత్యాచారాలకు, అక్రమ అరెస్టులకు వ్యతిరేకంగా ప్రజలపై కాల్పులు జరిపిన సంఘటనలపై న్యాయ విచారణ జరపాలని జులై 1 నుండి 7 వరకు నిర్బంధ వ్యతిరేక నిరసన వారాన్ని పాటించండి. ఇందులో భాగంగా నిర్బంధాన్ని ఖండిస్తూ సభలు, సమావేశాలు, ర్యాలీలు, సంతకాల సేకరణ చేపడుతూ అధికార పార్టీ నేతలను నిలదీయండి.

జులై 6,7 డివిజన్ బంద్ పిలుపును విజయవంతం చేయడంలో ప్రజలు, ప్రజాస్వామికవాదులు, విద్యార్థి, మేధావి, వ్యాపారులు భాగస్వాములు కావాలని పిలుపునిస్తున్నాం !

*డిమాండ్స్ :*

- **గ్రామాలలో పోలీసు క్యాంపుల ఏర్పాటు నిర్ణయాన్ని వెంటనే రద్దు చేసుకోవాలి.**
- **గ్రామాలపై దాడులు, అక్రమ అరెస్టులు, తప్పడు కేసులు పెట్టడం నిలిపివేయాలి.**
- **ప్రజలపై కాల్పులు జరిపి హత్య చేసిన సంఘటనలపై, అత్యాచార ఘటనలపై వెంటనే న్యాయవిచారణ జరిపి దోషులైన పోలీసు అధికారులను శిక్షించాలి.**
- **ఆపరేషన్ గ్రీన్‌హంట్‌ను ప్రజాయుద్ధం ద్వారా ప్రతిఘటించి ఓడించాలి.**
- **జులై 1 నుండి 7 వరకు నిర్బంధ వ్యతిరేక నిరసన వారం పాటించాలి.**

**విప్లవాభినందనాలతో**

**ఎం.కె.వి.బి డివిజన్ కమిటీ**

**సి.పి.ఐ (మావోయిస్టు)**

బో



**“విప్లవాన్ని విజయం దిశగా సక్రమంగా నిర్వహించడానికిగానూ ప్రతి దేశంలోని కమ్యూనిస్టు పార్టీ ప్రజల నుండి ఒక స్నేహితుడిని సంపాదించుకోవడానికి ప్రతి చిన్న అవకాశాన్ని ఉపయోగించుకొని తీరాలి. ఆ స్నేహితుడు ఎంత ఊగిసలాడేవాడైనా ఆ అవకాశం ఎంత తాత్కలికమైనదైనాగానీ కూడా ఉపయోగించుకొని తీరాలి”**

- కా॥ లెనిన్

## ప్రజల ఆగ్రహంపై నీళ్ళు చల్లేందుకే 97 జీ.ఓ ఉపసంహరణ నాటకం!

## కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాక్సైట్ తవ్వకాలను అన్‌రాక్ కంపెనీకి అప్పజెప్పడాన్ని తీవ్రంగా ప్రతిఘటించండి!!

## అడవిపై హక్కు కోసం ఆయుధాలు పట్టండి!!!

*(బాక్సైట్ తవ్వకాలను వ్యతిరేకిస్తూ డిసెంబర్ 21 నుండి 27 వరకు ఏజెన్సీ వ్యాప్తంగా నిరసన వారాన్ని, 26న ఎ.ఒ.బి బంద్‌ను జయప్రదం చేద్దాం)*

ప్రజల ఆగ్రహంతో 97 జి.ఒను తాత్కలికంగా ఉపసంహరిస్తున్నట్లు ప్రకటించి వెనుకడుగేసినట్లు నటిస్తున్న చంద్రబాబు అసలు పథకాన్ని తెలుసుకోండి. చంద్రబాబుకు ఇప్పుడు సమయం కావాలి. ఆ సమయంలో ప్రజల ఆగ్రహంపై నీళ్ళు చల్లాలి. బాక్సైట్ తవ్వకాలకు మార్గం సుగమం చేయాలి. ఇది చంద్రబాబు అసలు పథకం. అందుకే చంద్రబాబుకు సమయం కావాలి. ఈ పథకంలో భాగంగానే తన నరహంతక పోలీసు మూకలను మన్యంపై ఇప్పటికే ఉసిగొల్పి ఉన్నాడు. ఈ దాడిని మరింతగా పెంచేందుకు సన్నాహాలు చేస్తున్నాడు. మరోవైపు బూటకపు ప్యాకేజీలు ప్రకటించి ఆదివాసీ ప్రజలను చీల్చి ఒక సెక్షన్‌ను తనకు మద్ధతుదారులుగా చేసుకొనేందుకు పథకం రూపొందిస్తున్నాడు. ఇటువంటి దుష్ట పథకాలనూ, కుటిల పన్నాగాలను రూపకల్పన చేయడంలో ఆరితేరిన కొడగండ్ల నారాయణ, పత్తిపాటి పుల్లారావు వంటి సహచర మంత్రులు చంద్రబాబు పక్కన ఉండనే ఉన్నారు. చంద్రబాబు చేపట్టబోయే ఈ ద్విముఖ వ్యూహాన్ని దృష్టిలో వుంచుకొని ఆదివాసీ సమాజం యావత్తు ఒకటై లేచి తమ భూమి, నీరు, సహజ వనరులు, సంస్కృతి అంతిమంగా మనుగడను రక్షించుకొనేందుకు ఆయుధాలు ఎత్తాలి. ఈ పోరాటానికి మద్ధతుగా విశాల పీడిత ప్రజానీకం, ప్రజాస్వామికవాదులు, మేధావులు అండగా నిలవాలి.

**ప్రియమైన ప్రజలారా...**

విశాఖ ఏజెన్సీలో బాక్సైట్ ఖనిజ తవ్వకాల వ్యతిరేక ప్రజావుద్యమం నిన్నమొన్నటిది కాదు. గత ఒకటిన్నర దశాబ్దాలుగా మన్యం ప్రజలు మడమతిప్పకుండా ముక్తకంఠంతో దీన్ని వ్యతిరేకిస్తూ వస్తున్నారు. దోపిడీ వర్గాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఎన్నికల పార్టీలు అధికారంలో లేనప్పుడు ఒకమాట, అధికారంలో ఉన్నప్పుడు మరొకమాట మాట్లాడటం పరిపాటి అయ్యింది. బాక్సైట్ సమస్యతో ప్రజలు ఈ విషయాన్ని నిశితంగా గమనిస్తూనే వున్నారు.

తొట్టతొలుత బాక్సైట్ తవ్వకాల ఆలోచనకు శ్రీకారం చుట్టింది తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనే. ఈ కాలంలో దాన్ని వ్యతిరేకిస్తున్నట్టు నటించిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక బాక్సైట్ తవ్వకాల వైపే మొగ్గు చూపింది. ఈ సమయంలోనే బాక్సైట్‌కు వ్యతిరేకంగా పోజుపెట్టిన తెలుగుదేశం పార్టీ పదవి చేపట్టిన అనతికాలంలోనే 2014 ఆగస్టు 9న ఆదివాసీ దినోత్సవం నాడే తిరిగి బాక్సైట్ తవ్వకాలకు తెరలేపింది.

పాలకుల మోసాన్ని, దోపిడీవర్గాల స్వభావాన్ని అర్థం చేసుకున్న ప్రజలు తమ జీవితాలను సర్వనాశనం చేయడమే కాక ఆదివాసీల అస్థిత్వాన్ని ప్రశ్నార్థకం చేసే బాక్సైట్ తవ్వకాలను అడ్డుకునేందుకు రంగంలోకి దిగారు. తొలుత రైతాంగానికి పరిమితమైన ఈ వుద్యమం క్రమంగా విస్తృతమవుతూ ఆదివాసీ సంఘాల, ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల, విద్యార్థుల మద్ధతును కూడగట్టుకొని మరింతగా బలోపేతమైంది. అధికారంలో లేని వైరిపక్షాలు సహజంగానే ప్రజల పోరాటకాంక్షాల్ని సొమ్ముచేసుకునే లక్ష్యంతో ఇందులో భాగమైనాయి. ఆఖరికి అధికార పార్టీలో వున్న ప్రజాప్రతినిధులు కూడా నేడు పెరుగుతున్న ప్రజా వత్తిడికి తలొగ్గి బాక్సైట్ వ్యతిరేక వుద్యమాన్ని సమర్థించక తప్పలేదు.

ఈ స్థితిలో ఇంకా ఎటువంటి నిర్ణయం తీసుకోలేదంటూనే చివరికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అటవీ పర్యావరణ అనుమతులను క్లియర్ చేస్తూ జీ.ఒ నెం. 97 విడుదల చేసి బాక్సైట్ తవ్వకాల కోసం ఎ.పి.ఎమ్.డి.సికి సప్పర్ల, జర్రెల ప్రాంతంలో అడవిని అప్పగించాయి. ఆదివాసీ ప్రజల మనోభవాలను దెబ్బతీస్తూ ప్రభుత్వం చేస్తున్న ఈ చర్యతో ప్రజలంతా మరింత ఆగ్రహం చెంది తమ నిరసనల్ని, ఆందోళనల్ని ఉధృతం చేసారు. తెలుగుదేశం నేతలు, మంత్రులకు మన్యంలో అడుగుపెట్టలేని అగత్యం దాపరించడంతో రాష్ట్ర క్యాబినెట్ సమావేశం 97 నెం. జీ.ఒను తాత్కలికంగా నిలుపుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అదే సమయంలో ప్రజాభిప్రాయ సేకరణ జరిపాక తుది నిర్ణయం తీసుకుంటామంటూ తన కపటత్వాన్ని ప్రదర్శించుకుంది.

**దోపిడీ పాలకుల, పార్టీల విధానాల పట్ల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలి, వాళ్ళ నక్కజిత్తులను ఓడించాలి.**

ఇప్పటివరకు అధికారం చేపట్టి దోపిడీ ప్రభుత్వాలు పదే పదే చేస్తున్న బాక్సైట్ వెలికతీత ప్రయత్నాలను సంఘటిత ప్రజల ప్రతిఘటనను అడ్డుకుంటూ వస్తున్నది. నేడు రాష్ట్ర క్యాబినెట్ సమావేశం 97 జీ.ఒ తాత్కలిక విరమణ ప్రకటన కూడా ప్రజాపోరాట విజయమే. అయితే దీని వెనుక దాగివున్న దోపిడీవర్గాల కుట్రపట్ల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలి. దోపిడీవర్గాలు, పార్టీలు అధికారంలో వున్న ఈ కాలం వాటి విధానాలు పీడిత ప్రజలకు వ్యతిరేకమైనవిగానే వుంటాయి. నేడు అధికారంలో వున్న ఎన్.డి.ఎ, టి.డి.పి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ కార్పోరేట్లకు అమ్ముడుపోయి వారి నమ్మిన బంట్లుగా సేవ చేయడంలో అన్ని విధాల ముందుంటున్నారు. దేశ ప్రకృతి సంపదను, వనరుల్ని, శ్రమశక్తిని సామ్రాజ్యవాదులు కొల్లగొట్టడానికి అన్ని తలుపులు బార్లా తెరుస్తూ సాగిల పడుతున్నారు.

నేడు ప్రజాప్రతిఘటన మూలంగా తాత్కలికంగా బాక్సైట్ పనులు ఆగినా అది ప్రజలను మోసగించడానికే. సామ, దాన, బేధ, దండోపాయాల ద్వారా చీలదీసి విభజించి పాలించే మోసపు ఎత్తుగడగానే దీన్ని చూడాలి. ఇప్పటికే ప్రజల్ని కొద్దిమందిని డబ్బులు, ఉద్యోగాలు ఆశ చూపి ప్రభుత్వాలు తమకు అనుకూలంగా మార్చుకున్న విషయం మన గమనంలో వున్న విషయమే. రేపు మరిన్ని ప్యాకేజీలు ప్రకటిస్తూ ఒక సెక్షన్‌ని చీలదీయటం కిరాయి పోలీసు బలగాల ద్వారా ప్రజా

వుద్యమకారులను అణచివేయడంలాంటి చర్యలు చేపట్టి తవ్వకాలకు దారి సుగుమం చేసుకోవడానికి ప్రభుత్వం ఈ ఎత్తుగడను చేపట్టింది.

నేడు బాక్సైట్ వెలికితీతకు తాము వ్యతిరేకమంటూ వుద్యమంలో పాలుపంచుకుంటున్న ప్రతిపక్షాలు (ఓట్ల పార్టీలు) రేపటి ఎన్నికల్లో ప్రజల్ని మోసగించి ఓట్లతో లబ్ధిపొందే లక్ష్యాన్ని కలిగి వున్నవే. ఇవి స్వభావంలో ఈ దోపిడీ వ్యవస్థను, అధికారాన్ని కాపాడుతూ భారతదేశంలోని పీడితప్రజలకు శతృవులైన దళారీ బడా బూర్జువా, బడా భూస్వామ్యవర్గాల ప్రతినిధులుగా వారికి నమ్మకంగా సేవ చేసేవే. కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీలు అధికారం చేపట్టిన ప్రతిసారి బాక్సైట్ వెలికితీతకు పూనుకున్నారనేది వాస్తవం. నేటి వై.ఎస్.ఆర్.సి.పి కూడా నిన్నటి కాంగ్రెస్ బిడ్డనే. దాని తానులో ముక్కనే. ఒకనాడు వామపక్షాలు అధికారాన్ని నెరిపిన కేరళ, పశ్చిమబెంగాల్ రాష్ట్రాల్లోని పాలన మిగతా వాటికి భిన్నంగా ఏమిలేదు. అక్కడా నందిగ్రామ్, సింగూర్, లాల్‌గడ్ వుద్యమాలే ప్రజలకు అవసరమయ్యాయి. ఈ దోపిడీ వ్యవస్థను నిలబెడుతున్న పార్లమెంటరీ విధానమే కప్పల తక్కెడ వంటిది. ఏ కప్ప ఎప్పుడు ఎలా ఎగురుతుందో ? ఎందులో దూకుతుందో ? ఏ క్షణాన ఎలా పార్టీ ఫిరాయింపులు జరుగుతాయో ? అనేది అప్పటి అవకాశవాద ఆర్థిక ప్రయోజనాల చుట్టూతనే ఉంటాయి. అయితే సారాంశంలో ఈ పార్టీలన్ని దోపిడీ వర్గాలకు కొమ్ముగాస్తూ అంతరాల వ్యవస్థను పదిలపరిచేవే. దీన్ని కూలదోయకుండా పీడిత ప్రజలు తమ మౌళిక సమస్యల్ని పరిష్కరించుకోవడం అసాధ్యం.

**జల్, జంగల్, జమీన్‌లపై అధికారం నిజంగా రావాలంటే అంతిమంగా సాయుధపోరాటమే మార్గం.**

ప్రజల మౌళిక సమస్యల్ని పరిష్కరించలేని ఈ దోపిడీ ప్రభుత్వాలు తమ కిరాయి బలగాల ద్వారా ప్రజా వుద్యమాలను కాలరాయాలని చూస్తాయి. బాక్సైట్ తవ్వకాలకు వ్యతిరేకంగా ప్రజలు స్వేచ్ఛగా తమ భావాలను వ్యక్తం చేసుకోవడానికి కూడా అవకాశం లేకుండా పోలీసు యాక్టు 30 పేరుతో టి.డి.పి ప్రభుత్వం కిరాయి పాలకుల్ని ఉసిగొల్పి ఫాసిస్టు అణచివేత పద్ధతులకు పూనుకున్నది. సమస్య పరిష్కారం కోసం ప్రశ్నించే, వుద్యమించే ప్రతిఒక్కరిని మావోయిస్టు ముద్రతో అణచివేయటం అన్నది పాలకులకు పరిపాటి అయ్యింది. ఎన్నికల ద్వారా ప్రజల బ్రతుకులు మారవనేది 6 దశాబ్దాల భారత పాలన స్పష్టం చేస్తున్నది. నక్సల్బరీ మార్గంలో సుమారు 5 దశాబ్దాలుగా భారత పీడిత ప్రజలు సాయుధులై తమ రక్తాన్ని చిందిస్తూ ఈ దోపిడీ ప్రభుత్వాలకు, బలగాలకు వ్యతిరేకంగా పోరాడుతూ సామ్రాజ్యవాదుల, దోపిడీ పాలకుల విధ్వంసకర అభివృద్ధి నమూనాకు వ్యతిరేకంగా స్వావలంబన, ప్రజల ఆర్థిక వ్యవస్థను నెలకొల్పుతున్నారు. ఇవి నేడు బీజప్రాయంలోనే మొగ్గ తొడుగుతున్నప్పటికీ అభ్యుదయ వర్గాలనంతా ఆకర్షిస్తూ ప్రత్యామ్నాయంగా ప్రజలకు ఆశాజ్యోతిగా రూపొందుతుండటం అన్నది పాలకులకు సహించని విషయంగా ఉన్నది. అందుకే ఆపరేషన్ గ్రీన్‌హంట్ 3వ దశను మరింత తీవ్రతరం చేస్తూ పాలకులు ప్రజాయుద్ధాన్ని తుడిచివేయడానికి విఫల ప్రయత్నం చేస్తున్నారు.

మన్యంలో భూమి, భుక్తి, విముక్తి లక్ష్యంతో ప్రారంభించబడిన ఆదివాసీ వుద్యమం నేడు అడవి మీద అధికారం లక్ష్యంతో కొనసాగుతుంది. మావోయిస్టు పార్టీ నేతృత్వంలోని పి.ఎల్.జి.ఎ అండదండలతో ప్రజలు ఎ.పి.ఎఫ్.డి.సి ఆక్రమణలోని కాఫీతోటల్లో ఇక ఏ మాత్రం కూలీలుగా వుండబోమని తమ భూమి, తమ తోటలు, తమ అడవిపై తమకే అధికారం అంటూ వుద్యమిస్తున్నారు. బాక్సైట్ తవ్వకాలను కూడా సహించేది లేదంటూ ప్రజలంతా ఐక్యమవుతున్నారు. రోజురోజుకు ఇది అన్ని సెక్షన్‌ల, ప్రజలు, ఆదివాసీ సంఘాలు, ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలు, విద్యార్థి, రచయితల సంఘాల మద్ధతును, సంఘీభావాన్ని పొందుతూ మరింత విస్తృతం, తీవ్రతరం అవుతుండటం ఆశావాహ పరిణామం. అయితే ఏ ప్రజా వుద్యమమైనా అది అంతిమంగా ప్రజల రాజ్యాధికారాన్ని స్థాపించే లక్ష్యాన్ని కలిగి ఉండకపోతే దానికి సమగ్రత చేకూరదు. కర్తవ్యాల పరిపూర్తి సాధ్యం కాదు. బలప్రయోగం ద్వారా తప్ప అన్యధా సాధ్యం కాదు. ఈ వాస్తవాన్ని గ్రహిస్తూ ప్రజలంతా తమ అధికార సాధనకై బాక్సైట్ తవ్వకాల అంతిమ నిలుపుదలకై ప్రజావిముక్తి గెరిల్లా సైన్యంలో సమీకృతులు కావల్సిన అవసరం ఉంది.

**బాక్సైట్ తవ్వకాల మూలంగా ఆదివాసీలను సర్వనాశనం చేయ తలపెట్టిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను, వాటి పార్టీలను (బి.జె.పి, టి.డి.పి)మన్యం నుండి పారద్రోలుదాం.**

ప్రజల మనోభవాలను బేఖాతరు చేస్తూ అధికార బి.జె.పి, టి.డి.పి పార్టీలు మరియు ప్రభుత్వాలు ఆదివాసీ ప్రజలకు ద్రోహాన్ని తలపెట్టాయి. దాన్ని వ్యతిరేకించడం, అన్ని విధాల అడ్డుకోవడం నేడు అందరి విధి. ఈ పార్టీలలో ఒక పక్క కొనసాగుతూనే తాము బాక్సైట్ తవ్వకాలకు వ్యతిరేకమేనంటూ నక్క వినయాలు ప్రదర్శిస్తున్నవారినంతా ఆదివాసీ ద్రోహులుగా ప్రకటించి సంఘటితంగా ఎదుర్కోవాలి. తక్షణమే ఆ పార్టీలనుండి పూర్తిగా వైదొలగనట్లయితే వారికి మనుగుడ లేదంటూ తరిమికొట్టాలి.

**'అడవిమీద అధికారం కోసం ఆయుధాలు అందుకుందాం'. 'బాక్సైట్ తవ్వకాలను అడ్డుకుందాం-మన్యాన్ని కాపాడుకుందాం'. 'అడవి మీద అధికారం ఆదివాసీలదే, పీడిత ప్రజలదే'** అనే నినాదాలతో ప్రజలనంతా ఐక్యం చేద్దాం. అల్లూరి స్ఫూర్తితో 'మన్యం పితూరి సేన'లో సాయుధులవుదాం. జల్, జంగల్ జమీన్‌లపై అధికారం కోసం, స్వావలంబన ఆర్థిక వ్యవస్థ నిర్మాణం కోసం ప్రజల అధికార అంగాలైన 'విప్లవ ప్రజాకమిటీ(ఆర్.పి.సి)లను స్థాపించుకుందాం.

**బాక్సైట్ తవ్వకాలకు వ్యతిరేకంగా డిసెంబర్ 21 నుండి 27 వరకు ఏజెన్సీ వ్యాప్తంగా నిరసన వారాన్ని పాటిద్దాం ! 26న ఎ.ఒ.బి బంద్‌ను విజయవంతం చేద్దాం !**

☞ **ఆదివాసీల ఐక్యత వర్ధిల్లాలి !**

☞ **మన్యం పితూరిసేన వర్ధిల్లాలి !**

☞ **అధికారం లేకుండా ప్రజలకుండేదేమి లేదు !**

☞ **ప్రజాసైన్యం లేకుండా ప్రజలకు అధికారం రాదు !**

**ఎ.ఒ.బి-ఎస్.జడ్.సి**

**(ఆంధ్ర-ఒడిశా ప్రత్యేక సరిహద్దు ప్రాంతం)**

**సి.పి.ఐ(మావోయిస్టు)**

బో

# కోవాసిరాసి అమరులకు అరుణారుణ జోహార్లు!

## కామ్రేడ్ కవిత (జానకి, మానస)

తెలంగాణ రాష్ట్రంలోని పాలమూరు జిల్లాకు చెందిన కామ్రేడ్ జానకి (కవిత) బతుకుదెరువు కోసం తన చిన్నతనంలోనే కుటుంబం హైదరాబాద్‌కు మకాం మార్చింది. జానకికి ఇద్దరు చెల్లెలు, ఒక తమ్ముడు. తండ్రి సంపాదించిన డబ్బంతా తాగడానికే ఖర్చు చేసేవాడు. తల్లి ఇండ్లల్లో పాచిపని చేసి కుటుంబాన్ని పోషించేది. తల్లితో పాటు తను కూడా పనికి వెళ్ళేది. తండ్రితాగి భార్యాపిల్లలను ఇబ్బందులకు గురి చేసేవాడు. ఇలా ఉంటున్న క్రమంలోనే జానకి తన అమ్మమ్మ దగ్గరకు వెళ్ళింది. హైస్కూల్ విద్యనభ్యసించి ఆర్థిక కారణాలవల్ల మధ్యలోనే ఆపివేసింది. తను ఉంటున్న బస్తీలోకి పట్టణ మహిళా సంఘం చదువురాని మహిళలకు రాత్రిపూట చదువు నేర్పించడం, బస్తీలోని సమస్యలపై పోరాడటం వంటి కార్యక్రమాలు చేస్తున్న క్రమంలో జానకికి సంఘం పరిచమమైంది. సంఘం సభ్యుల సలహాతో మళ్ళీ విద్యను కొనసాగించింది.



1998 లో తెలంగాణ ఉద్యమంలో భాగంగా జనసభ ఏర్పాటైంది. అదే సందర్భంలో కళాసమితి ఏర్పరిచారు. జానకి పలు తెలంగాణ కార్యక్రమాలకు వెలుతున్న క్రమంలో సిరాజ్ అనే కళాకారుడితో పరిచయం కావడం, పరిచయం కాస్త ప్రేమగా మారి పెళ్ళి చేసుకోవాలని నిర్ణయించుకోవడం అతి తక్కువ సమయంలో జరిగిపోయాయి. అప్పటికీ తనకు 15 సంవత్సరాలు. మైనర్ కావడంతో ఇప్పుడే పెళ్ళి వద్దని సంఘం వ్యతిరేకించింది. తను చేసింది సరైంది కాదని తెలిసి తర్వాత ఆత్మవిమర్శ చేసుకుంది. 2002లో సహచరులిద్దరు పూర్తికాలం కార్యకర్తలుగా పార్టీలోకి వచ్చారు. మొదట గిరాయిపల్లి దళంలో పని చేసారు. అటునుండి పనులరీత్యా నల్గొండ దళానికి మారారు. కృష్ణానది ఏరియాలో ఇద్దరు పని చేస్తున్న క్రమంలో తన సహచరుడు పార్టీ అవసరాల రీత్యా బయటకు వెళ్ళి వస్తుండేవాడు. ఆ సమయంలో విప్లవద్రోహి అయిన నయీమ్ ముఠా అరెస్టు చేసి లొంగదీసుకుంది. కోవర్టుగా మారి పార్టీకి ద్రోహం తలపెట్టాడు. ఇతడిని పార్టీ చంపాలని నిర్ణయించి జానకి అభిప్రాయం అడిగారు. "ప్రజల కోసం పని చేస్తున్న పార్టీకి ద్రోహం చేసే వ్యక్తిని చంపడమే సరైందని" చెప్పి తనలోని రాజకీయ చైతన్యాన్ని ప్రదర్శించింది. తన ప్రాణంగా ప్రేమించిన వ్యక్తి పార్టీకి మోసం చేసినప్పుడు అతడిని ఒక మోసకారిగానే చూసిందే తప్ప సహచరబంధమని ఆలోచించలేదు. అతడి మరణాంతరం పార్టీ రాజకీయాలతో ఉంటూ ఎలాంటి ఊగిసలాటకు గురి కాకుండా పార్టీలో కొనసాగింది.

నల్గొండ జిల్లా కృష్ణపట్టి, కానగల్లు, రాచకొండ ఏరియా మెజారిటీగా లంబాడి ప్రజలు నివసించే ప్రాంతాలు. అక్కడ మానసగా ప్రజలకు పరిచమైంది. వారి భాషను నేర్చుకుంది. వాళ్ళతో మమేకమై లంబడి పాటలు కూడా పాడేది. బరువులు మోసే విషయంలో ఇబ్బంది అయిన కష్టపడి చేసేది. అక్కడి జిల్లా ప్లాటూన్‌లో ఉంటూ టీచర్‌గా, డాక్టర్‌గా పని చేసింది. స్థానిక ఎస్.జి.ఎస్ (స్పెషల్ గెరిల్లా స్క్వాడ్)లో ఉంటూ మహిళా సంఘం బాధ్యతలు చూసేది. దళం మీటింగ్‌లు నిర్వహించే సమయంలో పాటలు పాడుతూ పాట ద్వారా లంబాడి ప్రజలకు దగ్గరైంది. లంబాడి ప్రజల సమస్యలకోసం చేపట్టే పలు పోరాట కార్యక్రమాలలో భాగమయ్యేది. ఈ క్రమంలోనే కురుమయ్య అనే కామ్రేడ్‌ను పెళ్ళి చేసుకుంది. 2006 కృష్ణానది దగ్గర రాజ్యం చేసిన నిరంకుశ పాశవిక దాడిలో కామ్రేడ్ కురుమయ్య అమరుడయ్యాడు. అయినప్పటికీ జానకి వెనుదిరగకుండా మరింత ధైర్యంతో అమరుల ఆశయాలను నెరవేర్చే బాటలో ముందుకే నడిచింది.

పార్టీ పనులరీత్యా ఎన్.జి.ఎన్ నుండి బదిలీ చేసి జె.ఎన్.ఎమ్‌లోకి సభ్యురాలిగా తీసుకున్నారు. జె.ఎన్.ఎమ్‌లో పని చేస్తూ ఎస్.జడ్.సి కార్యదర్శి అమరుడు మాధవ్ ప్రొటక్షన్ టీంలో ఉండేది. 2006 జూలై 23న శత్రువుతో జరిగిన ఎదురుకాల్పుల్లో మాధవ్ అమరుడు కావడంతో జె.ఎన్.ఎమ్ టీం రద్దయింది. ఈ ఎన్‌కౌంటర్‌లో జానకి తప్పించుకుంది. 2007 లో జానకిని కర్ణాటకకు బదిలీ చేసారు. అక్కడి భాష నేర్చుకొని స్థానిక దళాలతో కొద్దికాలం పని చేసింది. కొన్ని సమస్యలు ఎదురవ్వడంవల్ల అక్కడి నుండి పార్టీ కామ్రేడ్స్ లింక్‌లో కొంతకాలం బయట వుండి 2009లో ఎ.ఒ.బికి వచ్చింది. అప్పటికే ఆమె ఎ.సి మెంబర్. పార్టీనిర్ణయం మేరకు మల్కనగిరి జిల్లాలో జి.ఎన్.ఎస్‌లో కొద్దికాలం పని చేసింది. 2010లో పప్పులూరు ఎ.సి మెంబర్‌గా బదిలీ చేసారు. జి.ఎన్.ఎస్ నుండి ఆర్గనైజేషన్ బాధ్యతల్లోకి మారింది. పప్పులూరు ఏరియాలో అమరురాలు కామ్రేడ్ శిరీష కమాండర్‌గా, జానకి డిప్యూటీ కమాండర్‌గా పని చేసారు. కలిమెల ఎ.సి పప్పులూరు దళ కమాండర్‌గా 2011 నుండి 2012 వరకు కొనసాగింది. ఈ క్రమంలో తనలోని కొన్ని అన్యవర్గధోరణుల మూలంగా పార్టీ డిమోట్ చేసి పొడియా దళసభ్యురాలిగా మార్చింది. ఇలా 2సంవత్సరాలు పొడియా దళంలో పని చేస్తున్న క్రమంలో తన పని పద్ధతులు, కార్యాచరణను రివ్యూ చేస్తూ 2014లో ఎ.సిలోకి తీసుకోవడం జరిగింది. తను ఏ బాధ్యతల్లో ఉన్నప్పటికీ మొదటి నుండి డాక్టర్‌గా పార్టీ కామ్రేడ్స్‌కి, ప్రజలకు తన సేవలు నిరంతరం ఉండేవి. 2015 మార్చి డి.సి మీటింగ్‌లో డిప్యూటీ కమాండర్‌గా తీసుకున్నారు. తను అమరురాలయ్యేనాటికి కూడా డిప్యూటీ కమాండర్‌గానే కొనసాగింది.

కామ్రేడ్ జానకి ఎ.పి ప్రజలకు మానసగా, ఆదివాసీ ప్రజలకు జానకిగా మంచి సన్నిహితం గల వ్యక్తి. అమరులపై అనేక కవితలు, స్పందనలు, పాటలు రాసింది. ముక్కుసూటిగా మాట్లాడే మనిషి. మంచి విమర్శకురాలు, ఆర్గనైజరు. ఏ ఏరియాలో పని చేసినప్పటికీ అక్కడి భాష నేర్చుకోవడంతో పాటు వారిలో ఒకరిగా కలిసిపోయేది. పనిలో సృజనాత్మకతతో పాటు రాజకీయ నిర్మాణపరంగా పట్టున్న కామ్రేడ్. పార్టీ అప్పజెప్పిన పనులను తూ.చ తప్పకుండా చేసేది. తన జీవితంలో ఎన్నో కష్టాలను ఎదుర్కొన్న జానకి ఏనాడు ఉద్యమం నుండి దూరం కాలేదు. తన డిమోట్ కాలంలో కూడా తన కార్యాచరణను మరింత మెరుగుపరుచుకుందే గానీ వెనుకడుగుకు తావివ్వలేదు. పార్టీ చేపట్టిన అనేక ఇన్‌ఫార్మర్ల నెట్‌వర్క్ నిర్మూలనలో, ఆంబూష్‌లలో పాల్గొన్నది. చాలా ఎన్‌కౌంటర్లలో ప్రాణాలతో బయటపడింది.

పార్టీ అవసరాల రీత్యా ప్రయాణం చేస్తున్న క్రమంలో పొడియా ఏరియా (ఛత్తీష్‌ఘడ్ పరిధిలోనిది) కోవాసిరాసి గ్రామ పరిసర ప్రాంతాల్లో దళం సేదదీరుతుండగా వీరిని గమనించిన శతృవు మనుషులు పార్టీ సమాచారం శతృవుకు చేరవేయడంతో అతి తక్కువ సమయంలోనే డేరాను చుట్టుముట్టి ఫైరింగ్ ఓపెన్ చేసారు. అప్పటికే మలేరియా జ్వరంతో బాధపడుతున్న జానకి కౌంటర్ ఫైర్ చేయడానికి గానీ, రిట్రీట్ కావడానికి గాని తన ఆరోగ్యం సహకరించపోవడంతో శతృవు జరిపిన ఎదురుకాల్పుల్లో నెలకొరిగింది. తనతోపాటు మరో ఇద్దరు మిలీషియా కామ్రేడ్స్ కా॥ భీరె, కా॥ కోసలు అమరులయ్యారు. పీడితవర్గం కోసం ప్రాణాలర్పించిన కామ్రేడ్ జానకికి తలవంచి వినమ్రంగా అరుణారుణ జోహార్లు అర్పిద్దాం. తన ఆశయసాధనకై తుదకంటా పోరాడదాం.

## కామ్రేడ్ భీరె

మల్కనగిరి జిల్లా, పొడియా ఏరియా, మట్టేరు పంచాయితీ, మెట్టగూడ గ్రామంలో భీరె నిరుపేద వ్యవసాయ కుటుంబంలో జన్మించింది. తన వయస్సు 20 సంవత్సరాలు. పార్టీ సంఘ నిర్మాణాలుండటం, వర్గపోరాట చరిత్ర గల గ్రామం కావడంతో పార్టీ వెలుతున్న క్రమంలో ఆకర్షితురాలై మిలీషియాలో పని చేసింది. మిలీషియాలో గత 3 సంవత్సరాల నుండి పని చేసింది. పార్టీ చేపట్టిన ప్రతి కార్యక్రమంలో ముందుండటమే కాకుండా చురుకుదనంతో పనులు చేసేది. వ్యక్తిగత క్రమశిక్షణతతో పాటు పార్టీ పని పద్ధతులకు కట్టుబడి ఉండేది. చురుకుదనంలో భీరెకి ఎవరు సాటిరారని తన తోటి సహచర కామ్రేడ్స్ అంటుండేవారు. మిలీషియాలో పని చేయడమే కాకుండా తల్లిదండ్రులకు వ్యవసాయ పనుల్లో సహాయపడేది. ఇంటికి పెద్ద కూతురు కావడంతో ఇంటి బాధ్యతలన్ని పైన వేసుకొని చేసేది. మిలీషియా సమావేశాలలో మొహమాటం లేకుండా ముక్కుసూటిగా తన సహచరులను విమర్శించేది. అదే సమయంలో తనపైన పెట్టే విమర్శలను కూడా స్వీకరించేది. మిలీషియాలో గానీ, దళం దగ్గర గాని సమిష్టి పనుల్లో హుషారుగా, చురుగ్గా పని చేసేది. తన సొంత గ్రామంలో గంగవడ్డె (పూజారి) అనే వ్యక్తి వడ్డెగా వుంటూ మహిళలను వేధించడం, ఆధిపత్యం చెలాయించడంతో పాటు మూడ విశ్వాసాలతో ప్రజలను మోసం చేసేవాడు. వాడి భార్య పోలీస్ ఇన్‌ఫార్మర్. వీరిద్దరు ఇద్దరు ప్రజలకు వ్యతిరేకంగా వుంటూ పోలీసు మనుషులుగా వ్యవహరిస్తున్న వీరిని ప్రజాకోర్టు తీర్పు మేరకు పి.ఎల్.జి.ఎ, మిలీషియా ఖతం చేయడం జరిగింది. దీనిలో భీరె పాత్ర ముఖ్యమైనది. పెళ్ళి వయస్సు వచ్చిన అమ్మాయి కావడంతో తల్లిదండ్రులు పెళ్ళి సంబంధాలు చూసారు. కాని తనకు పెళ్ళి చేసుకోవడం ఇష్టం లేదనీ, పార్టీకి పూర్తికాలం కార్యకర్తగా పని చేయాలనీ తన సహచర కామ్రేడ్స్‌తో చర్చించేది. తను చనిపోయే నాటికి కామ్రేడ్ భీరె మిలీషియా డిప్యూటీ కమాండర్‌గా బాధ్యతలు నిర్వహించింది.

కామ్రేడ్ జానకి, కామ్రేడ్ కోసలతో పాటు ఆ సమయంలో కిచెన్ డ్యూటీలో ఉన్న భీరె రాజ్యం హంతక ముఠా జరిపిన కాల్పుల్లో అమరత్వం చెందింది. కామ్రేడ్ భీరెకి జోహార్లర్పిస్తూ, భీరె ఆశయాలను ఎత్తిపడదాం.

## కామ్రేడ్ కోస

మల్కనగిరి జిల్లా, పొడియా ఏరియా, మట్టేరు పంచాయితీ, మెట్టగూడ గ్రామంలో కామ్రేడ్ కోస నిరుపేద ఆదివాసీ కుటుంబంలో పుట్టి పెరిగాడు. ఇతని వయస్సు 20 సంవత్సరాలు. పెళ్లయి 2 నెలలవుతుంది. మెట్టగూడ వర్గపోరాట చరిత్ర గల గ్రామం. మహిళా సంఘం, బాలల సంఘం, రైతుకూలీ సంఘం, గొనొనాట్యో సంఘ్, సెల్స్ మొదలైన నిర్మాణాలున్న గ్రామం కావడంతో వీటన్నింటికి ఆకర్షితుడై మిలీషియాలో చేరాడు. గత 2 సం॥ల నుండి మిలీషియాలో చురుగ్గా పని చేస్తున్నాడు. గ్రామానికి దళం వెళ్ళినప్పుడు సెంట్రీ డ్యూటీల విషయంలో బాధ్యతగా వుండేవాడు. తమ గ్రామ పరిసర ప్రాంతాల్లోకి దళం వచ్చిందన్న సమాచారం తెలియగానే దళాన్ని కలిసి సమిష్టి పనుల్లో భాగమయ్యేవాడు. తీరిక సమయాల్లో దళం దగ్గర చదువు నేర్చుకునేవాడు. పార్టీ ఇచ్చే పిలుపులకు దేనికైనా(ప్రచారం, పోస్టర్లు వేయడం, కరపత్రాలు పంచడం, బ్యానర్లు కట్టడం) ముందుండి నిర్వహించేవాడు. తన సొంత గ్రామంలో గంగఒడ్డె, వీడి భార్య పోలీస్ ఇన్ఫర్మర్లుగా వ్యవహరిస్తున్న వీరిని ఖతం చేయడంలో కామ్రేడ్ కోస ప్రధాన పాత్ర వహించాడు.

కా॥ జానకి, కా॥ భీరెలతో పాటు సెంట్రీలో వున్న కోస శతృవు చేసిన దాడిలో అమరుడయ్యాడు. ఆదివాసీ కుటుంబంలో జన్మించిన కోస చివరి వరకు వర్గపోరాటంతో మమేకమై అమరుడయ్యాడు. ఆ కామ్రేడ్‌కి జోహార్లర్పిద్దాం !

బో

**"వేల వేల మృతవీరులు వీరోచితంగా ప్రజల కొరకు తమ జీవితాలను అర్పించారు. వాళ్ళ జెండాను మనం వున్నతంగా నిలిపి వాళ్ళ రక్తంతో మెరుస్తున్న దారిలో ముందుకే సాగుదాం"**

# నూతన ప్రజాస్వామిక విప్లవ ప్రయాణంలో నేలరాలిన అమరులకు విప్లవ జోహార్లు !!

## కామ్రేడ్ మద్దిలేటి

పాలమూరు జిల్లా అలంపూర్ మండలంలోని లింగన్వాయి గ్రామంలో కామ్రేడ్ మద్దిలేటి 1967 సం॥లో జన్మించాడు. కా॥ మద్దిలేటి ఉత్పత్తి కూలాల, పీడిత వర్గాల తాత్వికతను ఒంటబట్టించుకొని ప్రజలకు వారి పిల్లలకు పాఠాలు నేర్పే గురువయ్యాడు. తన స్వగ్రామంలోనే 7వ తరగతి వరకు చదువు పూర్తి చేసుకున్నాడు. 8వ తరగతి కోసం గద్వాలకు చేరాడు. సాంఘీక సంక్షేమ హాస్టల్ల్లో ఉంటూ తన విద్యను కొనసాగించాడు. సరిగ్గా అక్కడే మద్దిలేటి వ్యక్తిత్వం ఒక రాజకీయ లక్ష్యంగా రూపుదిద్దుకుంది.



10వ తరగతి పూర్తి చేసుకొని 1983-85లో గద్వాల్ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఇంటర్మీడియట్ హెచ్.ఇ.సి గ్రూప్‌లో చేరాడు. అమరులు కా॥ సుధర్శన్‌రెడ్డి, కా॥ పురుషోత్తంలు వేసిన రాజకీయ ప్రభావంతో ఇంటర్‌లోనే విప్లవ రాజకీయాలపైపు ఆకర్షితుడై ఆర్.ఎస్.యు క్లాస్ సెక్రెటరీగా బాధ్యతలు నిర్వహించాడు. రాడికల్ విద్యార్థిసంఘం తీసుకున్న అన్ని కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనేవాడు. ఆర్.ఎస్.యు పోస్టర్లు వేస్తున్న క్రమంలో పోలీసులు పట్టుకొని అనేక చిత్రహింసలకు గురిచేసారు. శతృవు పెట్టిన హింసలకు చలించకుండా విప్లవ రాజకీయాలతో నిబద్ధుడై నిలబడ్డాడు. గద్వాలలో ఇంటర్ విద్యను పూర్తి చేసుకొని 1987-89లో డిగ్రీ చదువుకోసం కర్నూలులోని బాలశివా కాలేజీలో చేరాడు. తను విద్యను కొనసాగిస్తూనే కొన్నాళ్ళు ఆంధ్రప్రభ విలేఖరిగా పని చేసాడు. పత్రికాస్వేచ్ఛను ఉపయోగించుకొని దళితులపై అగ్రకుల ఫాసిస్టులు చేస్తున్న అన్యాయాలను ధైర్యంగా ఎదుర్కొని పత్రిక ద్వారా వాటిని ఎండగట్టాడు. వాళ్ళ బెదిరింపులకు ఏనాడు లొంగలేదు. 1989లో వచ్చిన స్పెషల్ డి.ఎస్.సి ద్వారా ఉపాధ్యాయుడిగా ఎన్నికయ్యాడు. మెదక్‌లో టీచర్ ట్రైనింగ్ పూర్తి చేసుకొని పూర్తికాల ఉపాధ్యాయుడిగా మారాడు. అప్పటి నుండి ఎ.పి.టి.ఎఫ్ (ఆంధ్రప్రదేశ్ టీచర్స్ పెడరేషన్) దాని తదుపరి డి.టి.ఎఫ్ (డెమోక్రటిక్ టీచర్స్ పెడరేషన్) లాంటి ఉపాధ్యాయ సంఘాలలో క్రియాశీలకమైన కార్యకర్తగా పని చేసాడు. ఈ క్రమంలోనే తెలంగాణ ప్రాంతానికి నీళ్ళు, నిధులు, ఉద్యోగాలలో జరుగుతున్న తీవ్రమైన దోపిడీకి వ్యతిరేకంగా మన పార్టీ ప్రజాసంఘాల నేతృత్వంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రజాస్వామిక వాదులు, కవులు, కళాకారులు గళం విప్పారు. ఆ నేపథ్యంలో ఏర్పడిన తెలంగాణ జనసభ (1998)లో రాష్ట్ర కమిటీ సభ్యుడిగా ఉంటూ పాలమూరు జిల్లాలో వలస బతుకులకు వ్యతిరేకంగా పెద్దఎత్తున ప్రజల్ని కదిలించాడు. పాలమూరి మట్టి బతుకులను ఎదలకద్దుకున్నాడు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెలంగాణ జనసభపై తీసుకొచ్చిన తీవ్రమైన నిర్బంధంలో సైతం ఉపాధ్యాయుడిగా ఉంటూనే నీళ్ళలో చేపలాగా విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా ఉంటూ వచ్చాడు. తిరిగి 2000 సం॥లో ఏర్పడిన తెలంగాణ ఐక్యకార్యాచరణ సమితి ఆ తర్వాత ఏర్పడిన తెలంగాణ ప్రజా ఫ్రంట్‌లలో క్రియాశీలక కార్యకర్తగా, నాయకుడిగా, తెలంగాణ ప్రాంత ప్రజల మన్ననలు పొందాడు. తెలంగాణ ప్రాంతానికి జరుగుతున్న అన్యాయాన్ని ఖండించడంలో, ధిక్కరించడంలో చాలా స్పష్టత కలిగిన రాజకీయ కార్యకర్త. ఈ ఐక్యఉద్యమం నిర్వహించబడిన అనేక పోరాటాలలో చాలా చురుకైన నాయకత్వ పాత్రను పోషించాడు. ముఖ్యంగా పాలమూరు జిల్లా నుండి వేలాది మందిని తెలంగాణ ఉద్యమంలో నిలబెట్టడంలో ప్రధాన భూమికను పోషించాడు. తెలంగాణ భౌగోళికంగా విడబడితే పీడిత ప్రజలకు ఒరిగేదేమి లేదనీ, ప్రజాస్వామిక ప్రత్యేక తెలంగాణలోనే తెలంగాణ ప్రజల మౌళిక సమస్యలు పరిష్కరించబడతాయని రాజకీయరంగంలో తీవ్రమైన పోరాటాన్ని చేసాడు. తెలంగాణ ప్రజా ఫ్రంట్‌లో అధ్యక్షుడిగా పని చేస్తున్న కా॥ ఆకుల భూమయ్య 24 డిసెంబర్ 2013న నిరంకుష దోపిడీ రాజ్యంచేత హత్యగావింపబడ్డ తర్వాత తెలంగాణ ప్రజా ఫ్రంట్ అధ్యక్ష బాధ్యతలను చేపట్టాడు. తెలంగాణ ప్రజల విరోచిత ప్రజాపోరాటాలు, ఎందరో అమరుల త్యాగాల ద్వారా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రంలో ప్రజల ప్రజాస్వామిక ఆకాంక్షలు నెరవేరే వరకు పోరాడాలనీ, తెలంగాణ ప్రజా ఫ్రంట్‌ను పున:సంఘటితం చేసాడు. తను విద్యార్థిగా, ఉపాధ్యాయునిగా, ప్రజాసంఘ నాయకుడిగా, ఐక్యసంఘటన నాయకుడిగా ఎక్కడ పని చేసినా సాదా సీదా మనిషిగా ఉంటూ కార్యకర్తలను ప్రజాఉద్యమాల వైపు నిలబెట్టడంలో మంచి నేర్పరి. చివరకు తను అమరుడయ్యే నాటికి తన శరీరమంతా తీవ్రమైన ఇన్ఫేక్షన్ బారిన పడింది. తన ఆరోగ్యాన్ని ఏ మాత్రం పట్టించుకోకుండా ఉద్యమమే ఊపిరిగా ప్రజాస్వామిక తెలంగాణ ఏకైక లక్ష్యంగా కార్యాచరణను కొనసాగించాడు. చివరికి అనారోగ్యంతో అమరుడైనాడు. నిజాయితీ, నిబద్ధత, పారదర్శకత, నిర్ధిష్ట రాజకీయ లక్ష్యం కలిగిన రాజకీయ కార్యకర్తగా, ఉపాధ్యాయుడిగా, ప్రజాస్వామికవాదిగా మూడు దశాబ్దాలపాటు నూతన ప్రజాస్వామిక విప్లవ విజయానికై విరామమెరుగక సేవలందించిన కా॥ పులిమామిడి మద్దిలేటికి అరుణారుణ జోహార్లర్పిద్దాం.

## కామ్రేడ్ ద్రోణవళి అనసూయమ్మ

భారత కమ్యూనిస్టు పార్టీ ఉద్యమంలో తొలితరం కమ్యూనిస్టు విప్లవకారిణి కామ్రేడ్ అనసూయమ్మ. నవంబర్ 5వ తేదీన విజయవాడలో అనారోగ్యంతో కా॥ అనసూయమ్మ అమరురాలైంది. ఆమె వయస్సు 85 సంవత్సరాలు. 1930లో కృష్ణాజిల్లా



మోటూరులో పుట్టిన అనసూయమ్మ చిన్నతనం నుండి జాతీయోద్యమం వైపు ఆకర్షితురాలైంది. 40వ దశకంలో కృష్ణాజిల్లాలో ఉవ్వెత్తున నడుస్తున్న కమ్యూనిస్టు పార్టీతో కలిసి పని చేసింది. అదే సమయంలో హైదరాబాద్ సంస్థానంలో సాగుతున్న నిజాం నిరంకుష పాలనకు వ్యతిరేకంగా భూమి, భుక్తి, విముక్తి కోసం సాగిన తెలంగాణ సాయధ రైతాంగ పోరాటం వైపు అడుగులు వేసింది. కమ్యూనిస్టు పార్టీ కార్యక్రమాలలో పాల్గొనేది. కార్యకర్తగా అభివృద్ధి చెందే క్రమంలో కా॥ సత్యప్రసాద్‌ను జీవిత సహచరిగా ఎంచుకుంది. కా॥ అనసూయమ్మ సత్యప్రసాద్‌తో పాటు తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో గెరిల్లాగా నిలిచి పోరాడింది. కా॥ సత్యప్రసాద్ పోలీసుల కుట్రలో అమరుడైన తర్వాత కూడా అనసూయమ్మ ఉద్యమంతోనే కొనసాగింది. భారత కమ్యూనిస్టు పార్టీ తెలంగాణ సాయుధ పోరాటానికి తిలోదకాలిచ్చి పార్లమెంటు ఎన్నికల్లో ప్రవేశించిన తర్వాత కూడా రివిజనిజాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ తన కమ్యూనిస్టు చైతన్యంతో నిజమైన విప్లవకారుల వైపు నిలబడింది. కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తగా కొనసాగుతూ 1955 పార్టీ తాలుకా కమిటీ సెక్రెటేరియట్‌లో సభ్యురాలయ్యింది. తిరిగి నక్సల్బరీ ప్రేరణతో ఊపందుకుంటున్న శ్రీకాకుళ గిరిజన పోరాటం, దాని పిమ్మట సిరిసిల్ల, జగిత్యాలపోరాటాల పైపునడిచింది. మార్క్సిజం-లెనినిజం-మావోయిజం ఆలోచనా విధానాన్ని తన రాజకీయ నిత్యజీవితంలో ఆచరించింది. తనకు సాధ్యమైన మేరకు విప్లవోద్యమానికి సహాయసహకారాలను అందించింది. మన పార్టీ నేతృత్వంలోని ఆంధ్రప్రదేశ్ రైతుకూలీ సంఘానికి 1981 నెల్లూరులో జరిగిన మహాసభలలో ఉపాధ్యక్షురాలిగా ఎన్నుకోబడింది. రెండవ మహాసభల నాటికి ప్రభుత్వం విధించిన తీవ్రమైన నిర్బందంలో అరెస్టయి జైలుజీవితం గడిపింది. జైలులో గడిపిన 35 రోజులు జైలునే రాజకీయ పాఠశాలగా మలిచి అమెతో పాటు అరెస్టయిన అనేక మంది మహిళా కార్యకర్తలకు ఉత్తేజానందించింది. తన మొత్తం రాజకీయ జీవితంలో ఎన్ని ఒడుదుడుకులు ఎదురైనా, పార్టీలో ఎన్ని సంక్షోభాలు వచ్చినా రివిజనిజాన్ని కార్మికవర్గేతర ధోరణులను తీవ్రంగానే వ్యతిరేకిన్తూ ఎమ్.ఎల్.ఎమ్ రాజకీయాలవైపు దృఢంగా చివరిక్షణం వరకు నిలబడ్డ కా॥ అనసూయమ్మకు తలవంచి వినమ్రంగా జోహార్లర్పిద్దాం

## కామ్రేడ్ కనకయ్య

కామ్రేడ్ కనకయ్య నాలుగు దశాబ్దాల క్రితం విప్లవోద్యమ ప్రేరణలో ప్రగతిశీల విప్లవ, ప్రజాస్వామిక భావాలు అలవరుచుకొని ప్రజల పక్షం వహిస్తూ ఎనలేని సేవలందించాడు. కా॥ కనకయ్య హక్కుల కార్యకర్తగా పీడిత ప్రజలకు సుపరిచితుడు. వృత్తి రీత్యా ఉపాధ్యాయునిగా పాఠాలు చెబుతూనే ఉపాధ్యాయ ఉద్యమాలలో పాల్గొనేవాడు. గత మూడు దశాబ్దాలుగా పౌరహక్కుల సంఘం ప్రాథమిక సభ్యుడి నుండి జిల్లా అధ్యక్షుని వరకు క్రియాశీల కార్యకర్తగా చురుకుగా పాల్గొనేవాడు. ప్రకాశం జిల్లా పౌరహక్కుల సంఘానికి అనేక పర్యాయాలు అధ్యక్షునిగా ఎన్నుకోబడ్డాడు. ప్రకాశం జిల్లాలో పౌరహక్కులు కాలరాయబడిన ప్రతిచోట కా॥ కనకయ్య బాధితుల పక్షాన నిలబడేవాడు. బాధితులకు న్యాయం జరగాలని అవిరామంగా పోరాడేవాడు. రాష్ట్ర వ్యాపితంగా సంఘం తీసుకున్న అనేక కార్యక్రమాలలో, నిజనిర్ధారణలలో చాలా చురుకైన పాత్ర పోషించాడు. హక్కుల ఉద్యమంలో బాలగోపాల్ తీసుకువచ్చిన గందరగోళంలో కా॥ కనకయ్య పౌరహక్కుల సంఘం పక్షం నిలబడి తన రాజకీయ చిత్తశుద్ధిని నిలబెట్టుకున్నాడు. తను టీచర్‌గా రిటైర్ అయిన తర్వాత ఒంగోలును కేంద్రం చేసుకొని న్యాయవాదిగా తను ప్రాక్టీసు చేస్తూ జిల్లాలో రాజ్యహింసకు వ్యతిరేకంగా పని చేసాడు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా ఉద్యమాలపై తీవ్రమైన నిర్బంధాన్ని కొనసాగిస్తూ వందలాది మందిని జైళ్ళలో నిర్బంధించాయి. సంవత్సరాల తరబడి బెయిళ్ళు రాకుండా చేసి బెయిల్ వచ్చిన తరువాత విడుదలైన వారిని జైలు బయటనే తిరిగి అరెస్టు చేస్తున్న కాలంలో రాజకీయ ఖైదీలకు కూడా హక్కులున్నాయనీ, వారి కోసమే మా ప్రత్యక్ష కార్యాచరణ అంటూ కమిటీ ఫర్ రిలీజ్ పొలిటికల్ ప్రిజనర్స్ అనే పేరుతో ఏర్పడిన సంఘంలోని ఎ.పి చాప్టర్‌లో క్రియాశీలక కమిటీ సభ్యుడిగా రాజకీయ ఖైదీలకు సేవలందించాడు. దేశవ్యాపితంగా సి.ఆర్.పి.పి తీసుకున్న అనేక కార్యక్రమాలలో భాగస్వామి అయ్యాడు. 79 సం॥ల వయస్సు గల కా॥ కనకయ్య 10 సెప్టెంబర్ 2015న పర్చురులో గుండెపోటుతో అమరుడైనాడు. తన యుక్త వయస్సు నుండి తుది శ్వాస విడిచే వరకు విప్లవ సామాజిక హక్కుల పోరాటాలలో పీడిత ప్రజలకు సేవలందించిన కా॥ కనకయ్యకు విప్లవ జోహార్లర్పిద్దాం.

బో

**"పార్టీ, సైన్యం, ఐక్యసంఘటనల మధ్య సంబంధానికి సంబంధించి సరైన అవగాహన ఉండటం విప్లవ విజయానికి అవసరం"**

**- కా॥ మావో**

# ఎమ్.కె.వి.బి డివిజన్

**పోలీసు వితరణ సామాగ్రిని దగ్ధం చేసి ఆదివాసీల ఐక్యతను బలపరిచిన బొయితిలిప్రాంతపోరాటప్రజానీకం.**

పెదబయలు ఏరియా కమిటీ పరిధిలో గల జి.మాడుగుల మండలం బొయితిలి పంచాయితీ దిగురాపల్లి గ్రామంలో 13-12-15న 198బి సి.ఆర్.పి.ఎఫ్ బెటాలియన్ నాయకత్వంలో జనమైత్రి జరిగింది. హఠాత్తుగా మధ్యాహ్నం 11గం॥లకు ప్రైవేటు జీపుల్లో, ఆటోల్లో వచ్చిన పోలీసులు దిగురాపల్లి గ్రామంలో గల రేషన్‌డిపో (పి.డి.ఎస్) సెంటర్‌గా చుట్టుపక్కల గ్రామాలైన పులుసుమామిడి, సుబ్బులు, సూరిమెట్ట, గ్రామాల్లోకి చొరబడి మహిళల్ని, వృద్ధుల్ని బలవంతంగా తీసుకెళ్ళి వస్తువులు ఇచ్చి పంపించారు. ఆ సమయంలో పనుల సీజన్ కావడంతో పురుషులు, గ్రామ పెద్దలు పొలాలకు, గరువులకు వెళ్ళిపోయారు. సాయంత్రం ఇళ్ళకు చేరుకున్న గ్రామస్తులంతా హఠాత్తుగా జరిగిన ఈ పరిణామానికి అవాక్కయారు. జరిగిన విషయాన్ని వివరంగా మహిళల్ని అడిగి తెలుసుకొని స్థానిక సంఘాల నాయకత్వాల సూచన సలహాల మేరకు నాలుగు గ్రామాల ప్రజలు విడివిడిగా గ్రామాల్లో మీటింగ్స్ వేసుకున్నారు. మన్యంలో ప్రభుత్వానికి ప్రజలకు బాక్సైట్ విషయంలో సీరియస్ ఉద్యమాలు జరుగుతున్న రీత్యా పోలీసు జనమైత్రి కార్యక్రమాలను మన్యం వాసులంతా వ్యతిరేకించాలని నాలుగు గ్రామాల ప్రజలు నిర్ణయిస్తూ 23-12-15న సి.ఆర్.పి.ఎఫ్ పోలీసులు పంపిణీ చేసిన 30 చీరలు, 30 దుప్పట్లు, 20 వంటపాత్రలు, 25 శాలువలు, 30 దోమతెరలు, 25 చలికోట్లు, 30 మందికి క్యాపులను సూరుమెట్టవద్ద పులుసుమామిడి, మద్దిగరువు రోడ్డుపై దగ్ధం చేసారు.

ఈ చర్య ఏరియాలో మంచి ప్రభావాన్ని వేసింది. జనమైత్రి కార్యక్రమాల పట్ల ప్రజల్ని ఆలోచింపచేసేలా చేసింది. పోలీసు వితరణ కార్యక్రమాల వెనుకగల కుట్రలను, కుతంత్రాలను గమనించి అత్యంత అప్రమత్తతను, జాగురుకతను ప్రదర్శించారు. సామానులను దగ్ధం చేసి ఆదివాసీల ఐక్యతను దెబ్బతీయాలనే పాలకవర్గాల కుట్రలను పటాపంచలు చేశారు.

**పెత్తందారీ, ప్రజావ్యతిరేకి, పోలీసు ఏజెంట్ అయిన సత్యారావును ఖతం చేసిన మన్యంపితూరీసేన**

పెదబయలు ఎ.సి పరిధిలో గల బొయితిలి పంచాయితీ మడతకొండ గ్రామానికి చెందిన వంతల సత్యారావు గత కొన్ని సంవత్సరాల నుండి గ్రామంలో పెత్తందారీగా వ్యవహరిస్తూ అనేక ప్రజావ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడేవాడు. ముఖ్యంగా ప్రజల మధ్య సాధారణ తగాదాల నుండి మొదలు భూమి సమస్యల వరకు పరిష్కరించే పేరుతో అప్రజాస్వామిక ఆధిపత్య నిర్ణయాలు చేస్తూ ఈ ప్రాంతంలో ప్రజావ్యతిరేకిగా చలామణి అవుతున్నాడు. స్థానిక గ్రామసంఘాలు, పార్టీ అనేక మార్లు పై విషయాలపై హెచ్చరిస్తే పద్ధతి మార్చుకుంటానని చెబుతూనే వ్యక్తిగతంగా సంఘ రాజకీయాల పట్ల తీవ్ర వ్యతిరేకతను పెంచుకున్నాడు. ముఖ్యంగా సంఘం చెప్పే రాజకీయాల వల్ల గ్రామంలో తన ఆధిపత్యాన్ని కోల్పోవడం, ఏరియాలో తన అధికార ప్రజాప్రతినిధి పదవిని కోల్పోతుండటంతో సంఘాన్ని, పార్టీని దెబ్బతీసేందుకు శక్తి సరిపోక అవకాశం కోసం ఎదురుచూస్తున్నాడు. గుదలంవీధి అంజనాద్రి ఆలయంపై వర్గ చైతన్యంతో వందలాది మంది ప్రజలు చేసిన దాడిని జీర్ణించుకోలేని శత్రువు మడతకొండ గ్రామంపై దాడి చేసి ముఖ్యమైన సంఘనాయకత్వాన్ని, కార్యకర్తలను, అక్రమ అరెస్టులు, బూటకపు సరెండర్లు చేసాడు. శత్రుదాడి వల్ల సంఘం బలహీనపడటంతో సత్యారావు తన ఆధిపత్యాన్ని నిలుపుకోవాలనుకున్నాడు. సంవత్సరం క్రితం గాదెకుంట అనే గ్రామంలో ఎ.ఎస్.పి అట్టాడ బాబూజీ నాయకత్వంలో వందలాది మంది సాయుధ పోలీసుల మధ్యన 'జనమైత్రి' కార్యక్రమం జరిగింది. ఆ జనమైత్రిలో శత్రువు సాయుధ బలాన్ని చూసి సత్యారావు ఉప్పొంగిపోతూ అరగంట పాటు ఆవేశంగా సంఘానికి, పార్టీకి వ్యతిరేకంగా ప్రసంగించాడు. గ్రామస్తులు వారించినా ఆగలేదు. పార్టీపై వ్యక్తిగత ద్వేషంతో ఉన్న సత్యారావును శత్రువు గమనించి వాడికనుగుణంగా వాడుకున్నాడు. ముఖ్యంగా కిల్లంకోట, బొయితిలి పంచాయితీలలోని గ్రామాలలో గల సంఘనాయకత్వాన్ని శత్రువు ముందు బలవంతంగా బెదిరించి, బయపెట్టి సరెండర్స్ చేయించడంలో ముఖ్యమైన భూమికనే సత్యారావు పోషించాడు. తనే స్వయంగా సంఘనాయకత్వాన్ని కలిసి లొంగిపొమ్మని బెదిరించడం, పోలీసులు పంపిన లొంగుబాటు ఉత్తరాలను అందించడం చేసాడు. ఈ లొంగుబాట్ల మూలంగా ఈ ప్రాంతంలో ఉద్యమం చాలా నష్టానికి గురయ్యింది. గ్రామస్తులు, సంఘనాయకత్వం, పార్టీ పై విషయాలు వివరంగానే మీటింగ్స్, బ్యానర్స్, పోస్టర్స్, పత్రికా ప్రకటనల ద్వారా కబుర్లు పంపడం ఎప్పటికప్పుడు గుర్తిస్తున్నప్పటికీ తగిన మార్పు రాకపోవడం మూలంగా ప్రజలు, సంఘ సభ్యుల నిర్ణయం మేరకు సాంప్రదాయక ఆయుధాలు ధరించిన 60 మంది మిలీషియా (మన్యం పితూరి సేన) 21-12-15న సత్యారావును ఖతం చేసింది. ఈ చర్య స్థానికంగా మంచి ప్రభావాన్ని వేసింది. శత్రు ఏజెంట్లకు, ప్రజావ్యతిరేకులకు ఈ చర్య ఒక హెచ్చరిక అయ్యింది.

**బైపర్‌గూడ ఏరియాలో అమలు జరుపుతున్న నిర్బంధాన్ని ఎదిరించడంలో భాగంగా జరిగిన ప్రతిఘటన చర్యలు**

కోరాపుట్ జిల్లా (ఎమ్.కె.వి.బి) బైపర్‌గూడ ఏరియాను శత్రువు వ్యూహాత్మకంగా లక్ష్యంగా ఎంచుకొని పార్టీని విప్లవోద్యమాన్ని నిర్మూలించాలని కార్పెట్ సెక్యూరిటీని, కమ్యూనికేషన్ వ్యవస్థను (సెల్‌టవర్, రోడ్లు) పటిష్టం చేసుకొని ఇన్‌ఫార్మర్ యంత్రాంగం ద్వారా గత రెండు సంవత్సరాలుగా దళాలపై సమాచార ఆధారిత దాడులకు పాల్పడుతున్నాడు. 2014-16లో వరుసగా దళం మూడు సార్లు దాడులకు గురయింది. ఈ క్రమంలో ఒకరు అమరుల కాగా తుపాకులు, కిట్లు శత్రువు స్వాధీనం చేసుకున్నాడు. వరుస విజయాలతో శత్రువులో కూడా దూకుడు పెరిగింది. మన దళ కదలికలకు ఆటంకం ఏర్పర్చి మాస్ వర్క్‌కు (ప్రజాపనికి) పరిమితులు విధించాడు. రహస్య పని పద్ధతులు, గెరిల్లా యుద్ధ నియమాలు అమలు చేస్తేనే ప్రజల సహకారంతో శత్రువు ఏజెంట్లను గుర్తిస్తూ శిక్షించడం, కమ్యూనికేషన్ వ్యవస్థ ధ్వంసం చేయాలని నిర్ణయంలో భాగంగా మల్క పొద్దురు గ్రామంలో డోమ్రు సీసా పోలీసు ఏజెంటుగా పని చేస్తున్నాడని ప్రజలు ఇచ్చిన సమాచారం మీద ఆధారపడి పట్టుకొని విచారించగా 6నెలల క్రితం కోరాపుట్

పోలీసులు, జిల్లా ఎస్.పి తనను "మావోయిస్టుల సమాచారం చేరవేయాలనీ, వారి ఫోన్ నంబర్ ఇచ్చారనీ, అందుకు అంగీకరించి అప్పటి నుండి ఫోన్ ద్వారా ఎప్పటికప్పుడు సమాచారం ఇస్తున్నా"నని ఒప్పుకున్నాడు. అలాగే తనతో పాటు మరో నలుగురు కూడా ఫోన్‌ల ద్వారానే రహస్యంగా సమాచారం అందిస్తున్నారనే విషయం బయట పెట్టాడు. పంచాయితీ పరిధిలో ఏ గ్రామానికి దళం వచ్చినా, పార్టీకి ఎవరు సహకరించినా వారి వివరాలు సేకరించి ఫోన్ ద్వారా కొన్ని సార్లు స్వయంగా కలిసి సమాచారం ఇచ్చే బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈయన బయట పెట్టిన పేర్లు గల వ్యక్తులకు ముఖాముఖి పెట్టి చర్చించగా నిజాన్ని ఒప్పుకున్నారు. అందులో ముఖ్యమైన ఇద్దరిపై చర్య తీసుకోవాలని నిర్ణయించాం. డొమ్రు తల్లి సర్పంచ్, తండ్రి మాజీ సర్పంచ్‌గా, గ్రామ పెత్తందారిగా పని చేసాడు. డొమ్రు స్థానికంగా కాంట్రాక్టర్‌గా పని చేస్తున్నాడు. నిత్యం మోటారు సైకిల్‌పై ప్రభుత్వ ఆఫీసుల చుట్టూ తిరుగుతుంటాడు. ఆ సందర్భంగానే పోలీసులను కలుస్తున్నాడని ప్రజలు ఇచ్చిన సమాచారంతో పిలిచి మందలించి వదివేసాం. కానీ తన ప్రవర్తనలో మార్పు రాకపోగా పెరిగిన నిర్బంధాన్ని ఆసరా చేసుకొని పంచాయితీలో అధికారం చెలాయించడం, ప్రభుత్వ పథకాలలో అవినీతిని కాపాడుకోవడానికి పార్టీకీ, ప్రజలకు వ్యతిరేకంగా పనిచేస్తూ అందుకు పోలీసుల అండను ఉపయోగించుకొని ప్రజాకంటకుడిగా మారినందుకు సెప్టెంబర్ 24న పి.ఎల్.జి.ఎ సేన అతన్ని ఖతం చేసి ఇన్‌ఫార్మర్లుగా పని చేస్తున్న మిగిలిన వారిని ప్రజల్లో తమ తప్పులు అంగీకరిస్తే క్షమాబిక్ష పెడతామని పోస్టర్స్ ద్వారా ప్రచారం చేయడం జరిగింది.

### కొందుగూడలో ఇన్‌ఫార్మర్ అర్జున్‌ను శిక్షించిన ప్రజలు, పి.ఎల్.జి.ఎ

మద్కుపొద్దూరు పంచాయితీలోని కొందుగూడ గ్రామానికి చెందిన అర్జున్ మేస్త్రిగా పని చేస్తున్నాడు. ఈయనను గోవిందపల్లి బి.ఎస్.ఎఫ్ క్యాంపు ఇంటలిజెన్సీ అధికారి సంతకు వెళ్ళినప్పుడు కలిసి మాట్లాడి సమాచారం యిచ్చే విధంగా ఒప్పందం కుదుర్చుకున్నాడు. సమాచారం ఇచ్చినందుకు గానూ వాడు డబ్బులు ఇవ్వడం, ఈయన తీసుకోవడం ఒక సంవత్సర కాలంగా కొనసాగుతున్నది. అంతేకాకుండా మరికొందరిని ఇన్‌ఫార్మర్‌లుగా తయారు చేసే బాధ్యతను కూడా తీసుకొని మద్కుపొద్దూరు, జీంబ్రిగూడలో మరో ఇద్దరికీ డబ్బులు ఆశ చూపించి తన ఒప్పందం ప్రకారం ఆర్గనైజ్ చేసాడు. వీరి మధ్య ఫోన్ ద్వారా సమన్వయం నెరుపుతూ సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకోవడం జరుగుతున్నది. ప్రతిరోజు అర్జున్ మిగిలిన ఇద్దరి నుండి సేకరించిన విషయాలను ఇంటలిజెన్సీ అధికారికి ఫోన్ ద్వారా తెలియపరుస్తుంటాడు. అందుకు ప్రతిఫలంగా ఫోన్ రీచార్జ్ చేయడం, పార్టీ సమాచారం ఖచ్చితంగా చెప్పినప్పుడు డబ్బులు ఇవ్వడం జరుగుతున్నది. ఆ ప్రాంతంలోకి దళం వెళ్ళిందంటే వెంటవెంటనే ఆటంకాలు ఏర్పడి ప్రజాపని మీద ప్రభావం పడడం జరుగుతున్నది.

డొమ్రును ఖతం చేసిన సందర్భంగా అర్జున్‌ను ఇన్‌ఫార్మర్ గిరి మానుకోమనీ, ప్రజల ముందు తప్పు అంగీకరించాలని మందలిస్తు పోస్టర్స్ వేసాం. ఈయన నెట్‌వర్క్‌లో ఉన్న మద్కుపొద్దూరు వ్యక్తి తప్పులు అంగీకరించడంతో వదిలివేసాం. జీంబ్రిగూడ డొమ్రు గ్రామాన్ని వదిలిపారిపోయారు. అర్జున్ ప్రవర్తనలో ఎలాంటి మార్పు రాకపోగా మరింత రహస్యంగా తన కార్యకలాపాలను కొనసాగిస్తూ వచ్చాడు. 2015 అక్టోబర్‌లో గ్రామంలోనే అర్జున్‌ను పట్టుకొని విచారించగా తప్పులను అంగీకరించలేదు. ప్రజా ద్రోహిగా మారిన అర్జున్‌ను పి.ఎల్.జి.ఎ సైన్యం ఖతం చేసి వాస్తవాలను ప్రజల్లో ప్రచారం చేసింది. ఈ శతృవు నెట్‌వర్క్‌ను దెబ్బతీయడం ద్వారా ప్రజల్లో విశ్వాసం పెరిగింది. ప్రజాశతృవుల్లో ఆందోళన మొదలైంది. తాత్కాలికంగా శతృవుకు సమాచారం యిచ్చేవాళ్ళు వెనక్కి తగ్గారు. మన కదలికలకు అనుకూలతలు పెరిగాయి.

### శతృవు కమ్యూనికేషన్ వ్యవస్థను ధ్వంసం చేయడంలో భాగంగా సెల్‌టవర్స్ కాల్చివేత

సి.పి.ఐ (మావోయిస్టు)ల నాయకత్వంలో నిర్మాణమవుతున్న విప్లవోద్యమాన్ని నిర్మూలించాలనే దుష్ట తలంపుతో కేంద్రరాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయం కోసం నిరంతరం సమావేశమవుతూ అణచివేత పథకాలను రూపొందిస్తున్నారు. పెద్ద ఎత్తున కేంద్ర అర్ధ సైనిక బలగాలతో పాటు ఎక్కడికక్కడ ప్రత్యేక బలగాలను ఉద్యమ ప్రాంతాలలో మోహరించి దాడులకు పాల్పడుతున్నారు. గ్రామాల నుండి సమాచార సేకరణకు, వేగంగా వెళ్ళి దాడులు చేయడానికి రోడ్లు, సెల్‌టవర్‌ల నిర్మాణం వేగవంతం చేసారు. మావోయిస్టు ఉద్యమ ప్రాంతాలలో 2280 సెల్‌టవర్స్ నిర్మాణం చేయాలని కేంద్రం నిర్ణయించగా రాష్ట్రాలు ఈ పనుల త్వరితగతిన పూర్తిచేయనారంభించాయి. అందులో భాగంగా కార్పెట్ సెక్యూరిటీ మధ్య కోరాపుట్ జిల్లా బైపరిగూడ బ్లాక్‌లో ప్రతి పంచాయితిలో సెల్‌టవర్‌ను ఏర్పాటు చేసారు. దీని తర్వాత ప్రజల మొబైల్ సంభాషణలను ట్యాప్ చేయడం, ఇన్‌ఫార్మర్స్‌కు ఫోన్‌లు పంపిణీ చేసి వారి ద్వారా రెగ్యూలర్‌గా గ్రామాలు, పార్టీ సమాచారం సేకరించడం చేస్తున్నారు. ఇన్‌ఫార్మర్స్ ఫోన్‌ల ద్వారా ఇచ్చిన సమాచారం ఆధారంగా గ్రామాలపై, దళాలపై దాడులకు దిగుతున్నారు. సెల్‌టవర్స్ ద్వారా ప్రజలకు ఉపయోగపడటం కన్న పోలీసులే ప్రజలపై దాడులకు వినియోగిస్తున్నారనే విషయం మెజారిటీ ప్రజలకు అర్థమయింది.

ఈ సెల్‌టవర్ల నిర్మాణం వెనక వున్న ప్రభుత్వ కుట్రను ప్రజలకు అర్థం చేయించాం. మెజారిటీ ప్రజల అమోదంతో 2015 సెప్టెంబర్ నెలలో దస్తంతుపూర్ పంచాయితీ కొత్తగా నిర్మించిన సెల్‌టవర్‌ను పి.ఎల్.జి.ఎ కాల్చివేసింది. వెంటనే "పున:నిర్మాణానికి ప్రజలే పట్టించుకోవాలంటూ" పోలీసులు చేసిన ప్రయత్నాలను ప్రజలు ఆమోదించలేదు. తిరిగి డిసెంబర్‌లో కటపద పంచాయితీ గ్రామంలో నిర్మించిన సెల్‌టవర్‌ని కూడా ప్రజలతో చర్చించి వారి ఆమోదంతో కాల్చి, కూల్చి వేయడం జరిగింది. ఈ ఘటనల తర్వాత పోలీసులు కూంబింగ్ ముమ్మరం చేసి సెల్‌టవర్లు రక్షించడానికి భద్రతా బలగాలు కాపలా కాసాయి. సెల్‌టవర్ల రక్షణ విషయం వారికి చాలెంజ్‌గా మారింది. వారంలోపే ప్రజల సహకారంతో చిప్పకూరు, కొలియంటాల్‌లో నిర్మించిన రెండు సెల్‌టవర్లను కూడా కాల్చికూల్చి వేసింది. అప్పటివరకు ప్రజల అభివృద్ధిలో భాగంగా వారి అమోదంతోనే సెల్‌టవర్స్‌ను నిర్మించామని చెప్పుకుంటూ వచ్చిన పోలీసులు, ప్రభుత్వం సెల్‌టవర్స్ కూల్చివేతతో ప్రజల భాగస్వామ్యం చూసి రెచ్చిపోయి గ్రామాలపై పడి ప్రజలను చితకగొట్టడం మొదలుపెట్టాడు. దీనితో మెజారిటీ ప్రజలకు సెల్‌టవర్‌ల నిర్మాణం వెనక ప్రభుత్వ కుట్ర ఆచరణాత్మకంగా రుజువైనట్లయింది. తర్వాత శతృవు సమాచార సేకరణ వ్యవస్థకు తాత్కలికంగానైనా ఆటంకాలు ఏర్పడ్డాయి. ప్రజలపై పాజిటివ్ ప్రభావం పడింది. మన కదలికలకు కొంత అనుకూలతలు పెరిగాయి.

# ఆపరేషన్ గ్రీన్‌హంట్‌లో భాగంగా ఎమ్.కె.వి.బి డివిజన్‌లో నాయకత్వ నిర్మూలన లక్ష్యంగా ఆపరేషన్ ఆల్‌ఔట్ పేరుతో ఆంధ్ర-ఒడిశా పోలీసులు సంయుక్తంగా చేపట్టిన భారీ సైనిక (సాయుధ) అభియాన్‌ను వ్యతిరేకిస్తూ జులై 2 నుండి 10 వరకు ప్రజలు వివిధ రూపాలలో నిరసన తెలియజేస్తూ పోరాడిన ప్రజానీకం.

దేశవ్యాప్తంగా పార్టీనీ, విప్లవోద్యమాన్ని నిర్మూలించే దృష్ట తలంపుతో కొనసాగుతున్న ఆపరేషన్ గ్రీన్‌హంట్ వివిధ దశల గుండా ఆయా ఉద్యమ ప్రాంతాలు అక్కడి నిర్ధిష్ట లక్ష్యాలను కాలాన్ని (సమయాన్ని) ఎంచుకొని దానికి అనుగుణమైన పథకాలలో వేరు వేరు పేర్లతో అమలు జరుగుతున్నది. 2015 జనవరి నుండి ఎమ్.కె.వి.బి డివిజన్‌లో వ్యూహాత్మక ప్రాంతాలలోకి చొరబడి నాయకత్వ నిర్మూలన లక్ష్యంతో, ఆపరేషన్ ఆల్‌ఔట్ పేరుతో ఎ.పి-ఒ.ఎస్ పోలీసు బలగాలు సంయుక్తంగా దుర్మార్గమైన భారీ సైనిక అభియాన్‌ను ప్రారంభించారు. ఎ.పి గ్రేహౌండ్స్, సి.ఎ.పి, సి.ఆర్.పి.ఎఫ్, ఒ.ఎస్ ఎస్.ఒ.జి, డి.వి.ఎఫ్, కోబ్ర, బి.ఎస్.ఎఫ్‌కు చెందిన వేలాది బలగాలను మోహరించి పోలీసు ఉన్నతాధికారుల ప్రత్యక్ష నాయకత్వం కింద సంయుక్తంగా ఈ అభియాన్‌లు తెరిపి లేకుండా కొనసాగిస్తున్నారు. ఇందులో ప్రజలపై కాల్పులు, హత్యలు, అత్యాచారాలు, ఆస్తుల ధ్వంసం, అక్రమ అరెస్టులు కొనసాగిస్తూ ప్రజలను భయాందోళనకు గురి చేయడంతోపాటు ప్రధానంగా పార్టీని నిర్మూలించడం లక్ష్యంగా గత 6 నెలలుగా ఈ దాడి అత్యంత కౄరంగా కొనసాగుతున్నది. వ్యూహాత్మక ప్రాంతాలలోకి చొరబడటానికి రోడ్లు, సెల్ టవర్లు, పోలీసు క్యాంపుల నిర్మాణానికి పూనుకున్నారు.



ఈ దాడిని ప్రతిఘటించి ఓడించడంలో భాగంగా జులై 2 నుండి 10 వరకు ప్రజలను కదిలించి వివిధ రూపాలలో నిరసనను వ్యక్తం చేసే రాజకీయ ఆందోళనను చేపట్టాలని డివిజనల్ కమిటీ పిలుపు నిచ్చింది. అందులో భాగంగా 1. డివిజన్‌లో 2009 నుండి జరిగిన పోలీసు కాల్పులు, బూటకపు ఎన్‌కౌంటర్‌లు, లాకప్ హత్యల (కొటిపల్లి, లిటిపుట్, ఈతలపాడు, నారింజోల, వేలంపాక)పై న్యాయవిచారణ జరిపి దోషులైన పోలీసు అధికారులను శిక్షించాలి. 2. బల్లుగూడ, బయ్యపడ, స్పీలుబాద్‌లలో మహిళలపై జరిగిన అత్యాచారాలపై విచారణ జరిపాలి. 3. ప్రజలపై దాడులు, అక్రమ అరెస్టులు, తప్పుడు కేసులు బనాయించడాన్ని ఆపివేయాలి. జైళ్ళలో ఉన్న రాజకీయ ఖైధీలను వెంటనే విడుదల చేయాలి. 4. పోలీసు క్యాంపులు ఎత్తివేయాలి, గురుప్రియ బ్రిడ్జి నిర్మాణం ఆపివేయాలి. 5. ఆపరేషన్ గ్రీన్‌హంట్‌లో భాగంగా కొనసాగుతున్న ఆపరేషన్ ఆల్‌ఔట్‌ను వెంటనే నిలిపివేయాలి.

పై డిమాండ్‌లతో ప్రచారం, గ్రామగ్రామాన సభలు, సమావేశాలు, ఊరేగింపులు సంతకాల సేకరణ చేపట్టి జులై 9, 10 రెండు రోజులు డివిజన్ బంద్‌ను విజయవంతం చేయాలని నిర్ణయించింది.

అందులో భాగంగా డివిజన్ కమిటీ పేరుతో ఒక కరపత్రంను విడుదల చేసింది. నేడు పెట్టుబడిదారి విధానం తీవ్రమైన ఆర్థిక, ద్రవ్య, రాజకీయ సంక్షోభంను ఎదుర్కొంటున్నది. దానిని పరిష్కరించుకోవడానికి అది పేద దేశాల వనరులనూ, మార్కెట్లను ప్రజలను మరింతగా దోచుకోవడానికి బరితెగించింది. ఆ విధానాలకు వ్యతిరేకంగా పోరాడుతున్న ప్రజలు, విప్లవోద్యమంపైన అత్యంత అమానవీయ పద్ధతులలో అణచివేతను అమలు చేస్తున్నది. అందులో భాగమే ఆపరేషన్ గ్రీన్‌హంట్. **"ఈ దాడిని ప్రజాయుద్ధం ద్వారా ప్రతిఘటించి ఓడిద్దాం. జల్, జంగల్, జమీన్‌పై అధికారం కోసం పోరాడుదాం"** అని పిలుపునిచ్చింది. ఈ కరపత్రంతో పాటు పై డిమాండ్లతో పోస్టర్లు, బ్యానర్లు, పత్రికా ప్రకటనల ద్వారా గ్రామ గ్రామాన ప్రచారం చేయడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని అడ్డుకోవడాని ఎ.పి-ఒ.ఎస్ పోలీసు బలగాలు మరోమారు జూన్ 18 నుండే అభియాన్‌ను చేపట్టారు. జూన్ 22న ముంచంగిపుట్ మండలం గొబరిపడ గ్రామం వద్ద ద్రోహి ఇచ్చిన సమాచారం ఆధారంగా ఎ.పి గ్రేహౌండ్స్ బలగాలు గుమ్మ ఏరియా దళం మకాంపై చేసిన దాడిలో కా॥ సోను (సూర్యం) అమరుడయ్యాడు. ఇతర ఎన్‌కౌంటర్ ప్రమాదాలను తప్పించుకుంటునే ఈ కార్యక్రమం విజయానికి కృషి చేసాం. మెజారిటీ గ్రామాలలో సంఘ నాయకత్వంలో ప్రజల సమావేశాలు జరిగాయి. జులై 1న కట్‌ఆఫ్ ఏరియాలోని జోడాంబ పంచాయితీలో దార్లబెడ గ్రామం వద్ద సుమారు 12 గ్రామాలలోని 600ల మందితో ఊరేగింపు, సభ జరిగింది. ఈ సభలో ప్రజాసంఘ నాయకులు, బూర్జువా పార్టీల నాయకులు ఈ నిర్బంధాన్ని నినసిస్తూ ప్రతిఘటించి ఓడించాలని పిలుపునిస్తూ మాట్లాడారు.

జులై 4న ఒంద్రుపల్లి పంచాయితీ జొంత్రివద్ద 13 గ్రామాలకు చెందిన 1000 మంది ప్రజలతో ఊరేగింపు, సభ జరిగింది. ఈ సభకు విలేకరి కూడా హాజరై ఈ దాడిపై ప్రజల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నాడు. గ్రామాలనుండి పారిపోయిన కొందరు సాధారణ ప్రజలను తిరిగి రావాలని పిలుపునిచ్చారు. అలాగే సంఘాల నాయకులు, కొందరు ప్రజలు ఏరియా కమిటీ సభ్యులు ఈ సభలో ప్రజలనుద్దేశించి ఈ దాడిని ప్రజలందరు ఐక్యంగా ఎదుర్కొని ప్రజానిర్మాణాలనూ, పార్టీని రక్షించుకోవాలనే పిలుపునిస్తూ

మాట్లాడారు. ప్రజలందరూ ముక్తకంఠంతో ఈ దాడిని ప్రతిఘటించి ఓడిద్దామని నినదించారు.

పెదబయలు ఏరియాలోని జి.మాడుగుల మండలం కిల్లంకోట పంచాయితీలో సుమారు 10 గ్రామాలకు చెందిన 500 మంది ప్రజలు బ్యానర్లు చేత పట్టుకొని పై ప్రధాన డిమాండ్స్‌తో పాటు ఊరేగింపు నిర్వహించి బహిరంగ సభ జరుగుపుకున్నారు. ఈ సభలో సంఘ నాయకులు ప్రసంగిస్తూ బాక్సైట్ ఖనిజాన్ని దోచుకోవడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై, వారికి నాయకత్వం వహిస్తున్న పార్టీపై నిర్బంధాన్ని తీవ్రతరం చేసాయనీ, ఈ దాడిని ప్రతిఘటించి ఓడించకపోతే జల్-జంగల్-జమీన్ మీద శాశ్వత అధికారం కోల్పోయి నిర్వాసితులుగా మారాల్సి వస్తుందనీ, అందుకే పార్టీ నాయకత్వంలో పి.ఎల్.జి.ఎ అండతో సాయుధమై పోరాడదామని పిలుపునిచ్చారు. ఈ సభకు హాజరయిన ప్రజలందరూ ఏకగ్రీవంగా ఈ దాడిని ప్రతిఘటిద్దామని ప్రతినబూనారు.

పై ప్రధాన 5 డిమాండ్స్‌తో పెదబయలు, గుమ్మ ఏరియా పరిధిలోని సుమారు అన్ని గ్రామాల ప్రజలు సంతకాల సేకరణను ఉద్యమంగా చేపట్టి వేలాది మంది ప్రజలు తమ నిరసనను వ్యక్తం చేస్తూ సంతకాలు చేసారు. ఈ సంతకాలు చేసిన వారిలో అన్ని వర్గాల, సెక్షన్‌ల ప్రజలు పార్టీలకతీతంగా ఏకగ్రీవంగా చేసారు. జులై 9,10 తేదీలలో మల్కనగిరి, కోరాపుట్, విశాఖ జిల్లాల సరిహద్దులో డివిజన్ కమిటీ ఇచ్చిన 48 గం॥ల బంద్ పిలుపును ప్రజలు విజయవంతం చేసారు. ఈ కార్యక్రమాన్ని అడ్డుకోవడానికి 3 జిల్లాల పోలీసులు నిరంతరం కూంబింగ్‌లు, తనిఖీలు, ప్రజలను అడ్డుకోవడం చేసినప్పటికీ ప్రజలు వాటిని ధిక్కరిస్తూ వారం రోజులు రాజకీయ ఆందోళనను నడిపి ఈ దాడిని ఓడిస్తామని ప్రకటించారు. ఈ నిరసన వారం డివిజన్ ప్రజలపై రాజకీయంగా మంచి ప్రభావం వేసి శత్రువును ఒంటరి చేయడానికి దోహదపడింది.

# ఈస్ట్ డివిజన్

## నిప్పులు చెరిగే నిర్బంధం మధ్య బి.ఎస్.ఎఫ్ బలగాలపై దాడి చేసిన పి.ఎల్.జి.ఎ

ఆంధ్ర-ఒడిశా సరిహద్దు ప్రాంతంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సామ్రాజ్యవాద అనుకూల ఆర్థిక విధానాలను అమలు జరపడానికి, సామ్రాజ్యవాదుల అండతో విప్లవోద్యమంపై తమ పాశవిక దాడిని మరింత తీవ్రతరం చేసాయి. పోరాట ప్రాంతాలను రక్తపుటేరుల్లో ముంచుతున్నాయి. నాటో మిలటరీ పథకం అయిన లో- ఇంటెన్సిటీ కాన్‌ఫ్లిక్ట్ (ఎల్.ఐ.సి) పథకాన్ని నిర్దిష్టంగా అమలు చేస్తూ వస్తున్నాయి. అందులో భాగంగా ఈస్ట్ డివిజన్ కోరుకొండ ఏరియా కమిటీ పరిధిలోని మల్కనగిరి జిల్లా కుడుములగుమ్మ బ్లాక్‌కు చెందిన రోళ్లగెడ్డ, బోడ్‌పాదార్ పంచాయితీల్లో కార్పెట్ సెక్యూరిటీ క్యాంపులను ఏర్పాటు చేసారు. విప్లవోద్యమంపై, పార్టీ గెరిల్లా దళాలపై బహుముఖ దాడికి పూనుకున్నాయి. బూటకపు ఎదురు కాల్పుల్లో రైతాంగాన్ని హత్య చేయడం, అనేక మంది సంఘ, పార్టీ కార్యకర్తలను అరెస్టు చేస్తూ జైళ్ళలో నిర్బంధించడం, గ్రామాలపై దాడులతో నిరంతరం ప్రజలను వేధింపులకు గురిచేస్తున్నారు. ప్రజావ్యతిరేకులతోను ప్రజలలో ఒక సెక్షన్‌ను నయాన, బయానతో చేరదీసి లక్షలాది రూపాయలు వెదజల్లి ఇన్‌ఫార్మర్ వ్యవస్థను తయారు చేసుకొని దళాలపై దాడులను, గాలింపు చర్యలను తీవ్రతరం చేసారు. పోలీసుల అణచివేత పథకాలతో పాటు సంస్కరణలతో విప్లవ ప్రజానీకాన్ని, పార్టీ కార్యకర్తల్ని నిర్వీర్యపరిచే చర్యలకు పూనుకుంటుంది.

నిప్పులు చెరిగే నిర్బంధం మధ్య రాజ్యం హంతక దాడుల నుండి విప్లవ ప్రజానీకం పార్టీనీ, దళాలను కంటికి రెప్పలా కాపాడుకుంటున్నారు. ఆదివాసీలు జీవించే హక్కును తుపాకీ సన్నితతో కాలరాచి వేస్తున్న నవీన్-చంద్రబాబుల దోపిడీ రాజ్య మారణకాండను చూసి మౌనం వహించలేదు. నిబ్బరాన్ని కోల్పోలేదు. రాజ్య నిర్బంధాన్ని విప్లవ ప్రజానీకం వీరోచితంగా ప్రతిఘటిస్తూనే ఎస్.ఆర్ కంపెనీ ఐరన్ ఓర్‌ను పైప్‌లైన్ ద్వారా తరలించుకుపోవడాన్ని వ్యతిరేకిస్తూ ధ్వంసం చేస్తున్నారు. చంద్రబాబు ప్రభుత్వం తలపెట్టిన బాక్సైట్ తవ్వకాలకు వ్యతిరేకంగా మిలిటెంట్ పోరాటాలను చేపడుతున్నారు. మరొకపక్క నవీన్ పట్నాయక్ ప్రభుత్వం ఆంధ్ర-ఒడిశా రాష్ట్రాల భూభాగాన్ని కలిపెలా బలిమెల రిజర్వాయర్‌పైన నిర్మిస్తున్న గురుప్రియ బ్రిడ్జి నిర్మాణాన్ని వ్యతిరేకిస్తున్నారు. నవీన్, చంద్రబాబు దోపిడీ ప్రభుత్వం బొంకుతున్న ప్రజల అభివృద్ధికి ఏ మాత్రం ఉపయోగపడని ఎస్సార్ పైప్‌లైన్, గురుప్రియ బ్రిడ్జి, బాక్సైట్ గనులు సామ్రాజ్యవాదులు వాళ్ళ దళారీలైన భారత బడా పెట్టుబడిదారి వర్గం యొక్క ఆర్థిక ప్రయోజనాల కొరకే. అందుకోసమే బాక్సైట్ గనుల తవ్వకం ప్రాంతం చుట్టూతా మరియు ఎస్సార్ పైప్‌లైన్ పొడవుతా, అలాగే గురుప్రియ బ్రిడ్జికి ఇరువైపులా బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ (బి.ఎస్.ఎఫ్)ను మోహరించి, విప్లవ ప్రజానీకంపై భయంకరమైన తెల్ల భీభత్సకాండ (వైట్ టెర్రర్)ను అమలు చేస్తున్నారు. గ్రామాలపై దాడులతో, అక్రమ అరెస్టులతో, నిరంతరం నిఘా, తనిఖీల పేరుతో ప్రజలను వేధిస్తున్న పోలీసు ముష్కరులకు తగిన బుద్ధి చెప్పాలని తలచిన ఈస్ట్ డివిజన్ కమిటీ అంబూష్‌కు నిర్ణయించింది. అందులో భాగంగా శత్రువును రప్పించడానికి ఎస్సార్ పైప్‌లైన్ ధ్వంసం చేయాలనుకున్నారు. అంతేకాకుండా పలకరేవు సంతకు వచ్చిపోయే శత్రువు యొక్క బలహీనతల్ని కూడా ఉపయోగించుకోవాలనుకున్నారు. పైన పేర్కొన్న ఎస్సార్ కంపెనీ పైప్‌లైన్‌కి భద్రత కల్పించాలన్న లేదంటే పలగరేవు సంతకు వచ్చే సంఘ, మిలీషియా కార్యకర్తవలను అరెస్టు చేయడానికి సంతపై నిఘా పెట్టాలన్నా, జాన్‌భాయ్ వద్ద నిర్మిస్తున్న గురుప్రియ బ్రిడ్జి నిర్మాణానికి ఇరువైపుల ఉన్న బొడ్డిగెడ్డ, బోడ్‌పద బి.ఎస్.ఎఫ్ క్యాంపుల నుండి స్పీడ్ బోట్లమీద రావాల్సిందే. అప్పటికే తరచుగా స్పీడ్‌బోట్లు వాడటం మొదలైంది. అలా నీటిపై స్పీడ్‌బోట్ల ప్రయాణం చేసి పలగరేవు సంతకు సమీపంలో డొంగాఘాట్ (బోట్లు ఆగే స్థలం) దగ్గర దిగే చోట ఆంబూష్‌ను ఏర్పర్చాలనుకున్నారు. అనుకున్న ప్రకారం ఆగస్టు 23వ తేదీన ఎస్సార్ పైప్‌లైన్ ధ్వంసం చేసి 24 వ తేదీన నిర్ణయించుకున్న ఆంబూష్ స్థలంలో పి.ఎల్.జి.ఎ గెరిల్లాలు, మిలీషియాతో కూడుకున్న ఆంబూష్ టీం మాటుగాసింది. శత్రువు రాకను గమనిస్తూ ఎదిరిచూస్తున్న ఆంబూష్ టీంకు స్కౌట్ నుండి సమాచారం రావడంతో అప్రమత్తమైంది. డొంగాఘాట్‌కు స్పీడ్‌బోటు వచ్చి ఆగిన మరుక్షణమే క్లైమోర్ మైన్స్‌ను పేల్చింది. ఈ దాడిలో ముగ్గురు బి.ఎస్.ఎఫ్ జవాన్లు కుక్కచావు చావగా, మరో ఆరు మంది తీవ్రంగా గాయపడ్డారు. ఎస్సార్ కంపెనీ మెకానిక్ ఒకరు ఈ దాడిలో చనిపోయాడు. ఈ ఘటన విప్లవ ప్రజానీకంలో గొప్ప ఉత్తేజాన్ని, విశ్వాసాన్ని నింపగా దోపిడీ పాలక వర్గాలలో, వారి కిరాయి పోలీసు బలగాల్లో తీవ్ర కలవరం కల్గించాయి. బో

## ఎమ్.కె.వి.బి డివిజన్

## 28 జులై 2015 అమరుల వారోత్సవాలు

ఈ మట్టిని చీల్చుకొని విప్లవాలు లేస్తున్నాయి

“విప్లవాల యుగం మనది - విప్లవిస్తే జయం మనది”

- కా॥ చెరబండరాజు



### వీరులు మృత్యుంజయులు

“ప్రజలు మాత్రమే ప్రపంచ చరిత్రకు చోదక శక్తులు”

- కా॥ మావో

# నా కోసం !

ఉద్యమంలోకి వచ్చాక ప్రతి కామ్రేడ్ తన బాధ్యతలను నిర్వహించే క్రమంలో తెలిసో, తెలియకో తప్పులు చేస్తూనే ఉంటారు. వ్యక్తిగానే కాదు వర్గంగానే, అగ్రగామి దళంగానే తప్పులు జరుగుతుంటాయి. ఏ అనుభవం అధికారం లేని వర్గం రాజ్యాధికారం కొరకు తన వర్గాన్ని చైతన్యపరిచి ముందుకు సాగడంలో పలుమార్లు ఎగుడు దిగుళ్ళను ఎదుర్కోవలసిందే. అందుకే తప్పుల నుండి నేర్చుకొని వాటిని గురువులుగానే తీసుకొని వెలుగువైపు పయనించాలి.

నేనైతే బాధ్యతలు కొనసాగించే క్రమంలో అనేక తప్పులు చేసాను. వ్యక్తిగా చేసే తప్పులు కూడా ఉద్యమం నుండి విడదీయరానివే. ఇది అలా ఉంచి ఉద్యమ మలుపుల్లో అవసరమైన రూపురేఖలను రూపుదిద్దడంలో చాలా తప్పులే జరిగాయి. ప్రతితప్పు పాఠం నేర్పినా, నా లక్ష్యానికి ఇంకా ఇంకా జ్ఞానం పెరగాల్సిందే. జీవితం, ప్రజలు, పార్టీ చాలా విషయాలు నేర్పాయి. కానీ ఇక్కడితో నేర్చుకోవడం అనేది ఆగిపోవద్దు. చేసిన తప్పులపై విమర్శ బాధించదు. చేయని తప్పులపై విమర్శ పేరదాడి జరిగితేనే బాధిస్తుంది. అయితే ఇది తాత్కలికమే. అనేక గాయాలకు మందువేసి కట్టుకట్టే డాక్టరే వర్గపోరాటం. విమర్శలలో పాక్షికమైన సత్యాలే ఉన్నా వాటిని స్వీకరించాలి. ఇది నా బాధ్యతగానే ఉండాలి.

అహంభావం, వ్యక్తివాదం, స్వీయాత్మకతవల్ల తప్పులు జరిగినా వాటికి కారణం నాలో కాక ఎదిటివారిలో వెతకడం కొన్ని సందర్భాలలో చేస్తుంటాం. అప్పుడు నా వైఖరి నాలో గల కార్మికవర్గ పార్టీ సభ్యుడి లక్షణాన్ని ప్రతిబింబించదు. సమస్యలు ఎదురయ్యేచోట వారితో విమర్శ-ఐక్యత-విమర్శగానే సూత్రబద్ధ వైఖరి వుండాలే తప్ప వారెందుకు పనికిరారు అనుకున్నా, బాగుపడరు అనుకున్నా అది నాలో గల అన్యవర్గ ధోరణికే ప్రతిబింబం. ఇది ససేమిరా నేను అంగీకరించపోవడం అవతలివారిని వేలు చూపించి నేను పునీతుడిని అనుకొనే ఆత్మసంతృప్తే కాని ఉద్యమానికి, పార్టీకి, ప్రజలకు చెందేదిగా నా భావజాలం వుండదు.

కోపం రియాక్షన్ ఒక బలహీనతగా సాధారణంగా అందరూ గుర్తించేది. అసహనంతో ఉండి తప్పుకు ఎదుటివారిని నిందించడం కొందరు సహజంగానే చేస్తుంటారు. మరికొందరు ఎప్పుడూ రెండు రకాల కొలమానంను చేతిలో ఝళిపిస్తూ ఉంటారు. ఎదుటివారి నెగెటివ్‌నూ, తప్పులను అతిగా ఊహించి లేదా అంచనా వేసుకుంటూ ఝళిపించే కోలమానం వాడుతూ ఉంటారు. వీరితో మన ఐక్యతా-పోరాటం-సక్యతగానే ఉండాలి. వ్యక్తిగా వారి కోలమానం ఏదైనా నా పద్ధతి బాగుంటే అంతిమంగా ఈ కామ్రేడ్స్‌ను సరిచేయడం నా కమిటీ చేయగలదు. లేదా ఆచరణ అనే కొలిమిలో నిర్ధారించవచ్చు. కానీ ఇందుకు ఓపిక, నిర్మాణ పద్ధతులకు కట్టుబడి సరైన కమ్యూనిస్టుగా విశాల హృదయం కావాలి తప్ప నేను పెటీబూర్జువానే అనుకునే ఓ ఆత్మసంతృప్తి పనికిరానిదే. మార్పుకు చేయూతనివ్వనిదే. అప్పుడే తుఫాను తదుపరి ప్రశాంతతను, వుషోదయ వెలుగులోని అహ్లాదకర మానసిక విశ్వాసంతో పనిలో దుముకగలం. ఇక్కడే ప్రతిఒక్కరం సంయమనంతో వ్యవహరించగలిగితేనే గాడి తప్పం - బాట తప్పం.

నా కోసం నేను లక్ష్యసాధనకు మరింత బలంగా ఎప్పటికప్పుడూ సాగిపోవుటకు నా మనసులో నిలుపుకొని ఇలా ఆలోచిస్తాను. ఏదైనా నేనో మంచి కమ్యూనిస్టుగా సదా నిలవాలనే కృషినే ప్రధానం చేస్తాను.

- ధైర్యంగా వుందాం, తప్పులు జరిగితే విమర్శలు వస్తాయనే జంకు వదులుకుందాం !
- చొరవగా పని చేద్దాం, లోపాలను సవరించుకుందాం !
- నిర్భయంగా తప్పులు అంగీకరిద్దాం, కొలిమిలో పుటం పెట్టిన బంగారంలా పునీతం అయి ముందుకుసాగుదా!
- పూర్వార్జిత జ్ఞానం సరిపోదు. నిత్యం ప్రత్యక్ష పోరాటంలోనే జ్ఞానాన్ని పెంచుకోవాలి !
- కన్నీళ్ళు రాల్చడం సానుభూతి కోరడాలు కాదు. నిబ్బరంగా కష్టాలను అధిగమించాలి !
- పశ్చాత్తాపం విశ్వాసాన్ని ఇవ్వాలి తప్ప అవిశ్వాసాన్ని కాదు !
- హృదయ కవటాలను తెరిచి ఉండటం ద్వారానే నేర్చుకోవడం సాధ్యం !
- వ్యక్తులతో కాదు పోరాటం, వ్యవస్థతో !
- మందుకాలం కావద్దు - మనసు నిర్మలం కావాలంటే ప్రజల్లోకి వెళ్దాం !
- ఐక్యత-విమర్శ-ఐక్యతే విభేదాల పరిష్కారానికి పద్ధతిగా ఎంచి దానికి కట్టుబడి నిలుస్తా !

– ఒక కమ్యూనిస్టు